అభివృద్ధి - ఆదివాసులు - హింస

(ఎవరికి వికాసం? ఎవరికి వినాశనం?)

హిందీ మూలం

హిమంశు కుమార్

స్వేచ్ఛానువాదం

గౌరవ్

అభివృద్ధి-ఆదివాసులు-హింస

(ఎవరికి వికాసం? ఎవరికి వినాశనం?)

హిందీ మూలం : హిమంశు కుమార్

తెలుగు స్వేచ్ఛానువాదం : గౌరవ్

ప్రచురణ : ప్రత్యామ్నాయ ప్రస్థాన కేంద్రం

కాలం : ఆగష్టు, 2018

ప్రతిపాదిత చందా : రూ. 25/-

© కాపిలెఫ్ట్, సర్వహక్కులు సమాజానివి

ప్రతులకు : 9032094492

వివరాలకు : gouravmeka@gmail.com

అంకితం

ఆదివాసులందరికి...

అనువాదకుడి మాట

ఈ నెల 17 నుండి 25 వరకూ ఐదురోజులు ఒక వర్క్‌షాపు నిమిత్తం హిమాచల్ ప్రదేశ్‌లోని పాలంపూర్ దగ్గర కాండ్‌బడీ అనే గ్రామములో నున్న "సంభావనా" సంస్థకి వెళ్ళడం జరిగింది. ఒకరోజు ఉదయం మిత్రులతో దగ్గర్లో ఉన్న 'కాండ్ బడీ కేఫ్' కెళ్ళి టీ తాగి వస్తుండగా, టీ కొట్టతనితో ఏమి మాట్లాడలేదే? అని మిత్రుడు ప్రశ్నించాడు.

అర్ధం కాలేదు. టీ షాపతనితో నేనేం మాట్లాడనని అడిగాను. మిత్రుడు చెప్పాడు. "ఆయనే హిమంశు" అంతే, నా నోట మాటరాలేదు. నాలుగైదేళ్ళ క్రితం హిమాచల్‌లోనే డీర్‌పార్క్‌లో జీవన్ విద్య వర్క్‌షాప్‌కి వచ్చినప్పుడు వీళ్ళ పిల్లల్ని కలిసిన జ్ఞాపకం ఉంది.

కానీ నిబద్ధత గల గాంధీవాదిగా పేరొంది, ప్రభుత్వంచేత మావోయిస్టనే ముద్రవేయించుకుని చత్తీస్‌ఘడ్‌లో ఆదివాసుల అణిచివేతని ప్రశ్నించి ప్రభుత్వానికి కంటగింపై 18 సం॥ల చరిత్రకలిగి 7 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన వనవాసి చేతనా ఆశ్రమాన్ని ధ్వంసం చేస్తున్నా ఏ మాత్రం స్థైర్యం కోల్పోకుండా సాగుతున్న హిమంశు గురించి నేనప్పటికే విని ఉన్నాను.

యూ.పి.లో పుట్టి చత్తీస్‌ఘడ్ ప్రజలకి ఆరాధ్యుడై ప్రభుత్వ దౌర్జన్యంతో హిమాచల్ ప్రదేశ్‌లోని మారుమూల గ్రామంలో చిన్న బడ్డీకొట్టు పెట్టుకుని బతుకుతున్న హిమంశు ని కల్సి మాట్లాడి, ఇంటర్వ్యూ చేసి, మా జరుగుతున్న వర్క్‌షాపులో ఒక వర్షాకాలపు సాయంత్రం ఆయన కథంతా అందరికీ వినిపించి కానీ ఆయన్నొదల లేదు.

వచ్చేటప్పుడు ఈ మధ్యే ప్రచురించబడిన ఆయన రచనా గ్రంథం తీసుకున్నాను. హిందీలో 140 పేజీలు కల ఆ పుస్తకాన్ని ఖాళీ దొరికినప్పుడే చదువుదామని వెంట తీసుకువచ్చాను. 25వ తారీఖు మధ్యాహ్నానికి ఇంటికి చేరాను. 27వ తేదీ రాత్రి ఏదో యధాలాపంగా తిరగేద్దామని తెరిచాను.

అంటే అప్పటికే హిమంశు మాటలూ, కూతవేటు దూరంలో ఉన్న దండకారణ్యంలో అభివృద్ధి పేరిట ఆదివాసులపై జరుగుతున్న ఘోరాలు మనసులో సుడులు తిరుగుతుండగా తెలుగు చేయగలనా అనే అనుమానంతోనే అనువాదం మొదలుపెట్టాను.

ఎంత ఆశ్చర్యం వేసిందంటే నాలుగు రోజుల్లో మొత్తం అనువాదం పూర్తయింది. ఇది నా మొట్టమొదటి హిందీ మూలం నుండి చేసిన తెలుగు అనువాదం. చత్తీస్‌ఘడ్ నా జన్మస్థలం. అనేకసార్లు వెళ్ళిన చిరపరిచిత ప్రాంతం. అయినప్పటికీ అక్కడ జరుగుతున్న పరిణామాలకి నేనో అపరిచితుడ్ని.

గత ఏడాది చంపారన్ గురించిన నా పుస్తక అనువాదంలో హిమంశు ప్రస్తావన ఉంది. ఆయన ఆశ్రమాన్ని ప్రభుత్వం, మావోయిస్టులు పడగొట్టారని రాయడం జరిగింది. అది పొరపాటు. ఆశ్రమ విధ్వంసానికి మావోయిస్టులకూ సంబంధం లేదు. ప్రభుత్వం దుర్మార్గానికి చత్తీస్‌ఘడ్ ఒక పరాకాష్ట.

ఈ పుస్తకం నన్ను కదిలించినట్లుగానే చదువరుల్ని కూడా కదిల్చి ప్రశ్నిస్తుందని నమ్ముతున్నాను. హిమంశుతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి ఈ అనువాదం పబ్లిష్ చేసేందుకు అడిగాను. అనువాదానికి అనుమతించిన హిమంశుకుమార్, వీణా దంపతులకీ, అనువదించేప్పుడు అక్కడక్కడా తెలీని పదాలకి అర్థాలు చెప్పి సాయపడ్డ మా అమ్మ అనురాధకి, ఇంకా ముద్రణకు సహకరించిన మిత్రులందరికీ నా కృతజ్ఞతలు.

అభివృద్ధి పేరిట జరుగుతున్న ఆదివాసీల మారణకాండని మనిషన్న ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన సమయమిది. అందులో భాగంగా హిమంశు చేస్తున్న నిజాయితీకల ప్రయత్నానికి తెలుగు అనువాదంగా వచ్చిన ఈ పుస్తకం చదివిన అంతరాత్మలు అవెన్నయినా అన్యాయాన్ని ప్రశ్నించడానికి వాటి స్వరాల్ని వెచ్చిస్తే ఈ ప్రయత్నం సఫలమైనట్లే.

అనువాద దోషాలకు, వాక్య సమన్వయ లోపాలకూ బాధ్యత నాదే.

ఆగష్టు 31 **- గౌరవ్**
పిఠాపురం

అభివృద్ధి -ఆదివాసులు-హింస

అలహాబాద్‌లో నా ప్రసంగం:

మా నాన్న 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ముజఫర్ నగర్ రైల్వేస్టేషన్‌కి నిప్పుపెట్టి పరారయ్యాడు. ఆ కాలంలోనే ఆయనకి గాంధీజీతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. నాన్నని గాంధీజీ సేవాగ్రం ఆశ్రమానికి పిలిచారు. ఆయన గాంధీజీతో ఆశ్రమంలోనే ఉండేవారు. అలాగే ఆచార్య వినోభాభావే భూదానోద్యమంలో కూడా నాన్న పాల్గొన్నాడు. గాంధీజీ అస్తమానూ అనే మాటల్ని నాన్నగారు పదే పదే చెబుతుండేవారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టాలంటే కట్టుబట్టలతో యువత గ్రామాల్లోకి వెళ్ళి అక్కడ పనిచేయడం ప్రారంభించాలి. ఈ మాటలు చిన్నప్పటినుండి అనేకసార్లు వినడం వల్ల కావచ్చు, పట్టణాలు, నగరాలని విడిచిపెట్టి గ్రామంలోనే ఉండి పనిచేయాలని నేను నిర్ణయించుకున్నాను. అనుకున్నట్లుగానే నా పెళ్ళయిన ఇరవయి రోజులకు నేనూ నా భార్య ఢిల్లీ వదిలి అప్పటి మధ్యప్రదేశ్ రాష్ట్రం, బస్తర్‌జిల్లా, ఇప్పటి చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, దంతెవాడ జిల్లాలోకి ప్రవేశించి సరాసరి ఒక చెట్టుకింద మా సామానంతా సర్దుకుని ఉండటం మొదలెట్టాం. అలా 18 సంవత్సరాలపాటు అక్కడే ఉన్నాం. 18 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం మమ్మల్ని అక్కడ నుండి తరిమివేసింది.

ప్రస్తుతం నాపై సుమారు వంద వారెంట్లున్నాయి. ప్రభుత్వం దృష్టిలో నేనో అతి ప్రమాదకరమైన నక్సలైట్‌ని. నిస్సందేహంగా, నేనెప్పుడూ ఎవరినీ కనీసం ఒక్క దెబ్బయినా కొట్టలేదని చెప్పగలను. ఎప్పుడూ ఎవరినీ పల్లెత్తు మాటనలేదు. ఎన్నడూ హింసని సమర్థించలేదు.

ఈ పద్దెనిమిదేళ్ళలో ఏం జరిగిందో మీకు చెబుతాను. మేమక్కడికి వెళ్ళి ఆదివాసులతో కల్సి బతకడం మొదలెట్టాం. అప్పుడే కొన్ని విషయాలు గమనించాం. గ్రామంలో 40 సంవత్సరాలుగా స్కూలు నడుస్తోంది. కానీ అక్షరం ముక్క వచ్చిన ఒక్క వ్యక్తి కూడా మాకు కనిపించలేదు. రేషన్ దుకాణం ఉంది. కానీ ఏడాదికి ఒకట్రెండుసార్లు మాత్రమే అది తెరుస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది కానీ సిబ్బంది మాత్రం మనకి కనబడరు. అంగన్‌వాడీల సంగతి కూడా అంతే. అప్పుడు అక్కడి ప్రజలకి వాళ్ళ హక్కుల గురించి అవగాహన కల్పించే పని పెట్టుకుని వారితో కూర్చుని మాట్లాడటం ప్రారంభించాం. ప్రభుత్వం నుండి వారికి అందాల్సిన సంక్షేమ పథకాల గురించి చెప్పి వార్ని సంఘటితం చేయసాగాం. అలాగే ఆదివాసుల్ని తీసుకెళ్ళి ప్రభుత్వ కార్యాలయాల్లోకి అధికారుల్ని కలసి మాట్లాడేవాళ్ళం. అలా ఆరోగ్యం తదితర సమస్యల గురించి ఆదివాసులు అడగడం జరగసాగింది. అలా రేషన్ కోసం కలెక్టర్‌ని కలిసేంతదాకా ఆదివాసుల అవగాహన పెరిగింది.

అప్పటిదాకా బస్తర్ ఒక విసిరివేయబడిన ప్రాంతం. అధికారులెవరినయినా శిక్షించాలంటే అక్కడికి ట్రాన్సఫర్ చేసేవారు. అలాంటిచోట పనిమొదలెట్టిన మమ్మల్ని చూసి స్థానిక అధికారగణం ఎంతో ఉబ్బితబ్బిబైపోయింది. వారంతా వారి భార్యామణుల్ని తీసుకొచ్చి మా జంటని చూపుతూ మా సేవల్ని గురించి పొగుడుతూ ఢిల్లీ నుండి వచ్చి అడవిలో బతుకుతున్నామని గొప్పగా పరిచయం చేసేవారు. అప్పటికి వాళ్ళ భార్యాబిడ్డలు ఎవరూ కూడా ఆ ఉద్యోగులతో అక్కడుండడానికి సిద్ధపడేవారు కాదు.

ఆ సమయంలో ప్రభుత్వం మా పట్ల ఎంతో సుముఖంగా ఉంది. అమలులో ఉన్న ప్రభుత్వ పథకాలన్నిట్లో మా సలహా అడగడం జరిగేది. విద్యకి సంబంధించిన కమిటీలో హిమంశుగారు సభ్యులు. కుటుంబ సంక్షేమ విభాగంలో నా భార్య వాణి సభ్యురాలు. ఇదే విధంగా సాక్షరతా, ఆరోగ్యం, పారిశుద్ధ్యం ఇలా అన్ని జిల్లాస్థాయి ఉన్నత కమిటీలన్నింటిలో మేం భాగమయ్యాం. నన్నయితే గౌరవ న్యాయమూర్తిగా కూడా నియమించారు. జడ్జిగారితో సమానంగా వేదికపై కూర్చొని లోక్ అదాలత్ కేసులు వింటూ ప్రజలకి అవగాహన కల్పిస్తూ ఉండేవాడ్ని. అలా ప్రభుత్వం దృష్టిలో మాదొక వెలుగుతున్న ఎన్.జి.ఓ. అని ముద్రపడింది. అంటే అప్పటిదాకా కాలక్షేపం చేసిన అధికారులంతా వారి పనులన్నీ మాకు అప్పజెప్పడం మొదలెట్టారు. ఇక్కడెవరూ సరిగా పనిచేయరని చెబుతూ ప్రభుత్వం మాకు పనిచెప్పేది. మా బిడివో సరిగా పనిచేయట్లేదు, మీరు కాస్త చేసి పెట్టండి. మీ దగ్గర ఒక ట్రైనింగ్ సెంటర్ ప్రారంభిద్దాం. ప్రభుత్వానికి సంబంధించిన శిక్షణలన్నీ మీరే ఇవ్వండి. ఉపాధ్యాయుల నుండి నర్సుల వరకూ ట్రైనింగ్ మీరే ఇవ్వండి. మేం ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు. కలెక్టరు, ఎస్.పి. మినిస్టర్లు అంతా మా కార్యక్రమాలకి హాజరయ్యేవారు. మెల్లమెల్లగా మా పూర్తికాలపు కార్యకర్తల సంఖ్య 250కి, ఇతర కార్యకర్తల సంఖ్య 750కి చేరింది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఇప్పుడీ కథ మలుపుతిరగనుంది.

మేము బస్తర్‌లో ఉండగా, అదే సమయంలో దేశంలో మరో తతంగం నడుస్తోంది. దానిని ఎల్.పి.జి. అంటారు. అంటే, లిబరలైజేషన్, ప్రైయివేటైజేషన్, గ్లోబలైజేషన్. దీంట్లో ధనిక దేశాల పెట్టుబడి పేదదేశాలవైపు రాసాగింది. ఎక్కడయితే అమితమైన సహజ వనరులు ఉన్నాయో అటువైపు పెట్టుబడి వచ్చింది. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దక్షిణాసియా వైపు వచ్చింది. భారతదేశంలో సరిగ్గా మధ్యరాష్ట్రాల్లో, అంటే చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఒడిస్సా, బెంగాల్‌ల వైపు వచ్చింది. ఈయీ రాష్ట్రాల్లో ప్రభుత్వం కంపెనీలతో కల్సి ఎమ్.ఓ.యు. (మెమొరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్) లపై ఒప్పందాలు కుదుర్చుకుని సంతకాలు చేసింది. కేంద్రప్రభుత్వం, చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం కలిసి వందకి పైగా కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక్కసారి ఈ ఒప్పందాలంటూ జరిగిపోతే సంస్థలు వాటి షేర్లను మార్కెట్‌లో ఇష్యు చేస్తాయనే విషయం మీకు తెలుసు. వీటిల్లోని పెట్టుబడులు నిజానికి విదేశీ కంపెనీలవి. ఆ పెట్టుబడి ఏ దేశానికి చెందినదో

మీరెప్పటికీ తెల్సుకోలేరు. జర్మనీకి చెందిన పోర్సే కంపెనీ టాటా పేరుతో అంతర్జాతీయ పెట్టుబడిని భారత్‌లో పెడుతోంది. డబ్బులు టాటా సంస్థవని పైకి మీకు అనిపిస్తుంది, కనిపిస్తుంది. కానీ అనలు కంపెనీ జర్మనీది. ఈ రకంగా అంతర్జాతీయ పెట్టుబడిదారులంతా భారత్‌లో వాళ్ళ డబ్బుని కుమ్మరించారు. షేర్ మార్కెట్‌లో ఉన్న 1% మందే మొత్తం షేర్ మార్కెట్‌ని కంట్రోల్ చేస్తున్నారు. 99% ధనం ఏదైతే ఉందో అదంతా ఆ ఒక్కశాతం వారి వద్దనే ఉంది. ఎక్కడ ఆక్రమించుకోవాలో, ఎక్కడ యుద్ధం జరగాలో, ఎక్కడ శక్తివంతమయిన సైన్యాలు కేంద్రీకరించాలో వీళ్ళే నిర్ణయిస్తారు.

చత్తీస్‌ఘడ్‌లో ఈ ప్రక్రియ జరుగుతూ 2005 ఏడాదిలోకి వచ్చింది. ప్రభుత్వం కంపెనీలకి వాయిదాలు వేస్తూ వచ్చింది. అలా 2005 జూన్ 4న టాటాతో ఒప్పందం కుదుర్చుకుని జూన్ 5న ప్రభుత్వం సల్వాజుడుంని మొదలుపెట్టింది. సల్వాజుడుం అంటే ఏమిటి? ప్రభుత్వం ఏమంటుందంటే, రాజ్యాంగాన్ని గౌరవించరు కాబట్టే మేం నక్సలైట్లని చంపుతున్నాం అని. నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నదేమిటంటే అసలు నువ్వు గౌరవిస్తున్నావా రాజ్యాంగాన్ని అని? రాజ్యాంగం ప్రకారం ఆదివాసీ ప్రాంతాల్లో ఐదో షెడ్యూల్ అమలులో ఉండాలి. దాని ప్రకారం ప్రభుత్వం తన ఇష్టప్రకారం వ్యవహరించి నచ్చినది చేయడానికి వీల్లేదు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం ఏదయినా ప్రాజెక్టు కానీ పరిశ్రమ కానీ పెట్టాలన్నా లేదా ఇంకేమయినా చేయలన్నా ముందుగా గ్రామసభకి ఆ వివరాలు సమర్పించి అనుమతి కోరాలి. గ్రామసభ అనుమతి నిరాకరించినా లేదా పరిశ్రమలేవీ వద్దని చెప్పినా ప్రభుత్వం ఏమీ చేయడానికి లేదు. ప్రభుత్వం దౌర్జన్యం చేయడానికి వీల్లేదు. ఒకవేళ గ్రామసభ కనుక ముందుకొచ్చి నిర్దిష్టమైన షరతులకి ప్రభుత్వం ఒప్పుకున్నట్లయితే ఆ ప్రస్తావనని పరిశీలిస్తామన్నట్లయితే, కలెక్టర్ మరో నోటిఫికేషన్ ఇచ్చి మరో గ్రామసభ జరిగేలా చూడాలి. అందులో గ్రామంలో ప్రతీవ్యక్తి గురించి చర్చించబడాలి. విస్థాపన కనుక జరిగితే వారివారి పునర్వాస నష్టపరిహారాలకి సంబంధించి ఏం లభించనున్నాయో తెలియజేయాలి. భూమికి బదులు ఎక్కడ భూమి వస్తుందో, పొలాలకి బదులు ఎక్కడ పొలాలిస్తారో భార్యకి ఏపని దొరుకుతుందో, బిడ్డలకి ఏ పనిస్తారో ఇలా ఒక్కొక్క ఆదివాసీ కుటుంబానికి సంబంధించిన నష్టపరిహారం, పునర్వాసాలకి సంబంధించి నిర్వాశిత గ్రామాలన్నీ స్పష్టంగా చర్చించాలి. ఈ గ్రామసభలో కలెక్టర్ పాల్గొనాలి. గ్రామసభ తీర్మానాలన్నీ తన సమక్షంలోనే జరిగాయనీ కలెక్టరు సంతకం చేయాలి. అప్పుడు కలెక్టర్ ఆ గ్రామసభలో తీర్మానించబడిన అంశాలని శాసనసభకి పంపడం జరుగుతుంది. శాసనసభ అనుమతి ఇస్తుంది. ముందుగా నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించి తర్వాత మాత్రమే అక్కడ పరిశ్రమ పనులు ప్రారంభించాలి. కానీ ప్రభుత్వం చేసిందేమిటి?

ప్రభుత్వం 5,000 మంది గూండాల్ని సమీకరించి వారిచేతికి 303 రైఫిల్స్ ఇచ్చి వారితో మీరు స్పెషల్ పోలీసు ఆఫీసర్లని చెప్పింది. మీపని గ్రామాల్ని ఖాళీచేయించడమేనని చెప్పింది. వారికి తోడుగా పారామిలటరీ సేనల్ని కూడా కలిపింది.

అక్కడ ఆదివాసులు ఎంత అమాయకులంటే వారసలు పట్టణప్రాంత జీవితాన్ని ఎన్నడూ చూసినవారు కాదు. ఎప్పుడయినా పట్టణం నుండి ఎవరైనా గ్రామానికొస్తే వాళ్ళకి గొప్ప ఇబ్బందనిపించేది. ఫుల్ ఫాంట్ వేసుకున్న వ్యక్తులను చూస్తే చాలు మొత్తం గ్రామమంతా అడవుల్లోకి పారిపోయేది. ఆ వ్యక్తులు కచ్చితంగా ఏదో కష్టం కొనితెస్తారనీ మా బాగుకోసం ఎవరూ గ్రామంలోకి రారనే ఆలోచన వారికుండేది. అలాంటిది సైన్యంతో కలిసి సల్వాజుడుం 10,000 మంది అంతెత్తు బూట్లతో ఆయుధాలు పట్టుకొని గ్రామాల్లోకి వస్తుంటే ప్రాణాలు అరచేత పట్టుకొని ప్రజలు అడవుల్లోకి పారిపోయేరు. మీరెందుకొచ్చారని అడిగే ప్రశ్నే లేదు. యువత, కాస్త వయసులో ఉన్నవాళ్ళే పరిగెత్తగలరు కాబట్టి వాళ్ళు పారిపోయేరు. స్త్రీలు, వృద్ధులు మిగిలారు. మహిళలు పెద్దెత్తున అత్యాచారాలకి గురయ్యారు. వాళ్ళ కళ్ళెదురుగానే వారి బిడ్డల్ని హత్యచేసారు. ముసలివాళ్ళని హత్య చేసారు, వారి ఇళ్ళకి నిప్పు పెట్టారు. వాళ్ళ పంటలు తగలబెట్టారు, సాగునీటి పంపుల్ని విరగొట్టారు, నూతులు, చెరువుల్లో విషం కలిపారు. ఆదివాసులు అడవుల్లో తలదాచుకుంటూ అప్పుడప్పుడూ భయంభయంగా గ్రామాల్లోకొచ్చి బూడిదవగా మిగిలిన సామానుల్ని తీసుకెళ్ళి అక్కడే ఆకులూ అలమలూ తిని బతకసాగారు. ప్రభుత్వం మళ్ళీ మళ్ళీ దాడులు చేయించేది. కొన్ని ఆదివాసీ గ్రామాల పైనైతే ఇరవైనుండి నలభైసార్లు దాడులు జరిగాయి. ఇలా ప్రభుత్వ భద్రతాదళాలు మొత్తం 650 (అక్షరాలా ఆరొందల యాభై) గ్రామాల్ని కాల్చి బూడిద చేసాయి. 650 ఇళ్ళు కాదు, గ్రామాలు!

స్వాతంత్ర్యం నాటి మన లక్ష్యాలేమిటి? గ్రామాల్ని అభివృద్ధి చేస్తామనే కదా! కానీ మనం ఏం చేసాం? ఈరోజు ప్రభుత్వం తన దేశపు గ్రామాలకే చేజేతులా నిప్పుపెట్టి అంటించుతోంది. ముందూ వెనుకలు చూడకుండా తగలబెడుతోంది.

ఇదెలా జరిగిందనే విషయం మనకి అర్థం కావాలంటే మనం ఇక్కడ గాంధీజీ మాటలు గుర్తుచేసుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చేప్పుడు గాంధీజీ ఆంగ్లేయుల అభివృద్ధి నమూనా వినాశకరమయిందన్నాడు. ఎందుకంటే ఆ అభివృద్ధి నమూనా ప్రకారం మీ దగ్గర ఎంత ఎక్కువ ఉంటే మీరంత అభివృద్ధి అయినట్లు. మీ వద్ద తక్కువ ఉంటే మీరు వెనుకబడి ఉన్నట్లు. అనేక కట్టడాలు, భవనాలు మీవద్ద ఉంటే మీరు అభివృద్ధయినట్లు, అదే తలదాచుకోవడానికి ఒక గుడిసుంటే మీరు వెనకబడి ఉన్నట్లు. మీ దగ్గర కారుంటే మీరు అభివృద్ధయినట్లు, అదే సైకిలుంటే మాత్రం ఇంకా వెనుకబడి ఉన్నట్లు.

కానీ గాంధీజీ, ప్రకృతి అందరికీ సమానంగా అన్నీ ఇచ్చిందనేవారు. ఒకవేళ మీ దగ్గర ఎక్కువ ఉందంటే, దానర్థం ఇతరుల వంతు కూడా మీరే తీసుకుంటున్నారన్నమాట. అప్పుడే మీకు ఎక్కువనేది ఉండడానికి ఆస్కారముంది. ఇతరులు కనుక ఇవ్వకపోతే, మీరు వాళ్ళనుండి బలవంతంగా లాక్కుంటారు. అలా లాక్కోవాలంటే మీ దగ్గర బలం ఉండాలి. కాబట్టే గాంధీ దృష్టిలో ఈ అభివృద్ధి నమూనా బలవంతుల పక్షాన పనిచేస్తుందే కానీ బలహీనుల పక్షాన కాదు. ఈ నమూనా ప్రకారం బలవంతులు అభివృద్ధవుతారే కానీ బలహీనులు కాదు. ఆంగ్లేయుల రాజ్యంలో రవి అస్తమించడని అనడం రివాజు. అయితే, అదే రాజ్యంలో ఒక ఆంగ్లేయుడే స్వయంగా అన్నట్లు నెత్తురు ఎప్పటికీ ఇంకిపోదు, అనేది కూడా అంతే నిజం. ఈ విధ్వంసకర అభివృద్ధి నమూనాను నిర్మించడం కోసమే ఆంగ్లేయులు ప్రపంచమంతా రక్తాన్ని పారించారు. ఈ వినాశకర అభివృద్ధి నమూనాను అనుసరించి యుద్ధాలు చేసి నెత్తుటి నదులు సృష్టించారు. వాళ్ళ దగ్గర అతి పెద్ద సైన్యం ఉంది. వాళ్ళ లాభాలు, ప్రయోజనాల కోసం ఎప్పుడూ యుద్ధం చేస్తుండేవారు. భారతదేశం కనుక ఆంగ్లేయుల అభివృద్ధి నమూనాని కనుక అవలంభిస్తే ఎవరిపై యుద్ధం చేయాలి? గాంధీ ఎంత కచ్చితంగా స్పష్టంగా రాసి చెప్పాడంటే ఈ నమూనాని అనుకరించడం జరిగాక ఒకరోజు మనం మన గ్రామాల మీదనే దాడులు చేస్తాం. ఈ నమూనా కారణంగా రెండు దుష్పలితాలున్నాయి. ఒకటి యుద్ధం, రెండోది పర్యావరణ వినాశనం. ఈ రెండింటి వల్ల మనం నష్టపోతాం. ఈ రోజు ఆదివాసుల మీద జరుగుతోంది సరిగ్గా ఇలాంటి యుద్ధమే. ఇందులో మన దేశ ప్రభుత్వం మన దేశానికే చెందిన 644 గ్రామాల్ని తగలబెట్టింది. దీన్ని భారతదేశపు అంతర్యుద్ధం అంటారు. మన భద్రతా దళాలు, సైన్యం ఎక్కువగా ఎక్కడున్నాయో మీకు తెలుసా? మన దేశపు అత్యధిక శాతం సైనికులు ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నారు. మన సైన్యం అడవుల్లోకి ఆదివాసీల గ్రామాలకి ఏం చేయడానికి వెళ్ళింది? సాయుధ సైన్యం ఆదివాసుల్ని రక్షించడానికి అక్కడికి వెళ్ళిందా? కాదు. అడవుల్ని గ్రామాల భూముల్ని కబ్జా చేయడానికి వెళ్ళింది. ఆహారపంటల్ని ఆక్రమించుకోవడానికి వెళ్ళింది. అడవుల్ని కబళించడానికి వెళ్ళింది. సముద్రాల్ని సైతం పెకళించడానికి వెళ్ళింది. ఎవరికోసం? భారతదేశంలోని బీదల అభివృద్ధి కోసమా? కాదు దేశంలోనున్న గుప్పెడుమంది పెట్టుబడిదారుల కోసం. చదువుకుని పట్టణాలు, నగరాల్లో ఉన్న అతికొద్దిమంది కులీన ఉన్నత వర్గాల వారి కోసం. జనాభాలో బలవంతుల గుంపొకటి జనాభాలోని బలహీనుల గుంపుపైన గుత్తాధిపత్యం కోసం సైన్యాన్ని పంపింది. ఒకదేశంలో శక్తివంతమయిన ఒక సమూహం సాదాసీదా సామాన్యులైన మరో సమూహానికి వ్యతిరేకంగా సైన్యాన్ని సమీకరిస్తే దానిని అంతర్యుద్ధం అనరా? భారతదేశంలో ఒక పూర్తిస్థాయి అంతర్యుద్ధం జరుగుతోంది. దానికోసమే సైన్యాన్ని సమీకరించి అక్కడికి తలించడం జరుగుతోంది. ఆ యుద్ధంలో తూటాలు రాలడం, బాంబులు పేలడం జరుగుతోంది. అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి. బలహీన పేద జనాభాని పూర్తిగా నిర్మూలించే యుద్ధం జరుగుతోంది.

గుప్పెడు మంది ప్రయోజనాలతో రాజీపడి మనం లక్షలాది మంది ప్రజల్ని వారి అడవుల్నుంచీ భూముల్నుంచీ, వనరుల్నుంచీ దూరం చేస్తే ఏం జరుగుతుంది? ప్రజలు భూమి లేకుండా అయిపోతారు. అన్నార్తులయిపోతారు, లక్షలాది మంది జబ్బుపడి చనిపోతారు. ఈ అభివృద్ధి జనాన్ని చంపేది. ఈ యుద్ధం గురించి మనకెవరూ చెప్పరు. క్రికెట్‌లో ఏ టీమ్ గెలుస్తుందనేది పెద్ద విషయంగా మనకి చెప్పబడుతుంది. ఐశ్వర్యారాయ్ పవిత్రంగా పూజచేసి చవితినాటి చంద్రుడ్ని చూడటమే చాలా పెద్ద విషయంగా మనకి మీడియా చూపెడుతుంది. యువత ఆ విషయంపై చర్చించాలని కోరుతుంది. ఈ దేశంలోని రైతులు, ఆదివాసీలు, దళితుల సమస్యలు ఏంటో వాటిపై మీడియా ఎన్నటికీ చర్చించదు.

మేం అప్పటికి ఈ పరిస్థితుల మధ్య అక్కడ పని చేస్తున్నాం. ఒకరోజు ఒక ఆదివాసీ అమ్మాయి మా దగ్గరకొచ్చింది. ఆమె గతంలో నా శిష్యురాలు. ఆమెపేరు సోనియా భాస్కర్. నేను ఏమియిందని అడిగాను. అప్పుడామె చెప్పింది; ఆమె గ్రామంలోని సీఆర్‌పిఎఫ్ సైనికులు ఆమె జడకి ఒక తాడుకట్టి మారో తాడు చివరన ఒక సైనికుడు బూటుకి కట్టుకుని ఆ అమ్మాయిని గ్రామ వీధుల్లో ఈడ్చుకెళుతూ ఊరంతా తిప్పారు!

సిపాయిలు ఆమెని కొడుతూ పోలీస్‌స్టేషన్‌కి లాక్కెళ్ళి 15 మంది పురుషులతో కలిపి 24 గంటలు అదుపులో ఉంచుకున్నారు. నేనామెతో చేసిన ఇంటర్వ్యూ వీడియో ఈరోజుకీ యూ ట్యూబ్‌లో ఉంది. ఆ వీడియో నేను జాతీయ మహిళా కమీషన్ తాత్కాలికాధ్యక్షులు నీరజావ్యాస్‌గారికి తీసుకెళ్ళి చూపించాను.

ఆ అమ్మాయికి న్యాయమైతే జరగలేదు కానీ ఆ సంఘటన తర్వాత ఆదివాసులు పోలీసులపై మా ఆశ్రమానికొచ్చి ఫిర్యాదు చేయసాగారు. ఎందుకనంటే మీ మీద ఎవరయినా దాడి చేస్తే మీరు పోలీసుల దగ్గరికి వెళతారు. కానీ పోలీసులే మీ మీద దాడి చేస్తే ఎవరి వద్దకి వెళ్ళాలి? ఆదివాసులకి రెండు మార్గాలు కనిపించాయి. ఒకటి నక్సలైట్ల దగ్గరకి వెళ్ళడం. అక్కడ ప్రజాకోర్టులో న్యాయం చేకూరేది. రెండు మా దగ్గరకి రావడం. మేం ఆదివాసుల్ని న్యాయం కోసం న్యాయస్థానాలకి తీసికెళ్ళేవాళ్ళం. కానీ, ప్రభుత్వం దృష్టిలో న్యాయస్థానం ప్రజల్ని శిక్షించడానికే ఉంది. అందుకోసమే రూపొందించబడింది. ప్రజలు ప్రభుత్వాన్ని న్యాయస్థానానికి తీసుకురావడం ప్రభుత్వం సహించదు. మా ప్రోత్సాహంతో ఆదివాసులు తమపై జరిగే అన్యాయాన్ని ప్రశ్నించడం ప్రారంభించి కోర్టుకెక్కి ఎప్పుడైతే న్యాయం అడగడం జరిగిందో అప్పటిదాకా ప్రభుత్వం ప్రసరించిన చల్లని చూపు ఎర్రగా మారి మా సంస్థ వారికి కంట్లో నలుసులా కనిపించసాగింది.

సోనియా న్యాయం కోసం మా ఆశ్రమానికి వచ్చినప్పుడు నేను నా భార్యతో చెప్పాను. ఇప్పటివరకూ మనకి పెద్ద పేరుంది, సంస్థ ఎంతో బాగా నడుస్తోంది. కొద్దో గొప్పో ఆస్థీ అంతస్థులున్నాయి. కానీ ఇప్పుడీమె కేసు కనుక మనం తీసుకుంటే ప్రభుత్వంతో మన పోరాటం మొదలౌతుంది. సంస్థని ప్రభుత్వం పూర్తిగా నిర్మూలిస్తుంది. అప్పుడు నా భార్య వీణ అంది: మిమ్మల్ని మీరు గాంధీవాదిగా, సమాజ సేవకుడిగా చెప్పుకుంటుంటారు. కానీ అన్యాయం జరిగిన ఒక మహిళ తప్పనిసరై సాయం కోసం మీ దగ్గరికొస్తే మీరింతగా ఆలోచించడం సబబేనా? ఒక అసహాయురాలికి జరిగిన అన్యాయానికి ఆమె చేసే పోరాటంలో మద్దతివ్వడానికి ఇంత వెనకాడుతున్నారెందుకు? అంతే! నేను సరేనన్నాను. సోనియా కేసుని మేం తీసుకున్నాం. న్యాయం కోసం మా సంస్థకొచ్చే ఆదివాసుల సంఖ్య పెరిగింది. మా సంస్థ సంక్షేమ పథకాల నుండి మానవ హక్కుల సంఘంగా మార్పు చెందింది.

మేము ఆదివాసీల నుండి ఫిర్యాదులు తీసుకుని ప్రభుత్వ అధికారుల్ని కలిసి అడిగేవాళ్ళం, కానీ అధికారులు వినిపించుకోవడం మానేసి అవి ప్రభుత్వ ఆదేశాలని చెప్పేవాళ్ళు. తర్వాత మేం మీడియాలో ఈ విషయాలు ప్రస్తావించినప్పుడు మొదట్లో ప్రభుత్వం కొద్దిగా ఇబ్బంది పడింది కానీ దాని వైఖరిలో పెద్దగా మార్పురాలేదు. అప్పుడిక మేం ఆదివాసులపై జరిగే దౌర్జన్యాల్ని తీసుకెళ్ళి న్యాయస్థానానికెళ్ళడం మొదలుపెట్టాం.

సరిగ్గా అప్పుడే ఒక సంఘటన జరిగింది. సూక్మా జిల్లాలో సింగారం అనే గ్రామంలో పోలీసులు 19 మంది ఆదివాసుల్ని తీసుకెళ్ళారు. అందులో నలుగురు మహిళలు. వార్ని సామూహికంగా అత్యాచారాలు చేసి బయొనెట్లతో హింసించి చంపేసారు. యువకుల్ని వరుసగా నిలబెట్టి కాల్చి పడేసారు. ఇలా చనిపోయిన వాళ్ళ బంధువులు మా దగ్గరకొచ్చారు. దానిపై మేం హైకోర్టుకి వెళ్ళి ఆ ఆదివాసుల్ని ఎందుకు చంపారని ప్రభుత్వాన్ని అడిగాం. పోలీసులు ఇది ఎన్‌కౌంటర్ అనీ, మృతులంతా నక్సలైట్లనీ చెప్పారు. అప్పుడు మేం ఆ ఎన్‌కౌంటర్లో నక్సలైట్లు పోలీసులపై ఎన్నిరౌండ్లు కాల్పులు జరిపారని అడిగాం. దానికి వాళ్ళు గుడ్డిగా కాల్పులు చెదురుమదురుగా జరిపారని చెప్పారు. మరి మీరెన్ని రౌండ్లు కాల్చారని మా లాయరు పోలీసుల్ని ప్రశ్నిస్తే, 25 రౌండ్లని చెప్పారు. అప్పుడు మేం నక్సలైట్లు చెదురు మదురుగా కాల్చినా మీలో ఒక్కరికీ ఏమీ కాలేదు కానీ మీరు 25 రౌండ్లు కాల్చగానే 19మంది నక్సలైట్లు ఎలా చనిపోయారని అడిగాం. పోలీసులు ఉపయోగించినవిగా 5 తుపాకులు కోర్టుకి చూపించారు. ఆ తుపాకీ గొట్టాలు తుప్పుపట్టి ఉన్నాయి. అవి ఫైరింగ్‌కి పనిచేయవు. మాకు తెల్సిందేమంటే పోలీసులు దగ్గర ఇలాంటివి 5–7 తుపాకులున్నాయి. ఎన్‌కౌంటర్ కథ ఎప్పుడు చెప్పాల్సివచ్చినా వీటినే ప్రవేశపెడుతుంటారు. 2000 సంవత్సరం, చత్తీస్‌ఘడ్ రాష్ట్రం ఏర్పడింది మొదలు పట్టపగలు ఇలాంటి ఎన్ని ఎన్‌కౌంటర్లు పోలీసులకి

ఒక్కతూటా కూడా తగలనివి జరిగుంటాయని అడిగి నాటి నుండి స్వాధీనంలోనున్న ఆయుధాలకి సంబంధించిన లెక్కల్ని న్యాయస్థానానికి చెప్పమని అడిగాం. దాంతో పోలీసులకి గుబులు పుట్టింది. ప్రభుత్వం బుల్‌డోజర్లు, ఏంటీలేండ్ మైన్లు, ట్యాంకులు, మెషీన్‌గన్లు గల జీపులతో మా ఆశ్రమాన్ని చుట్టుముట్టింది. ఆశ్రమంలో హాస్టల్, లైబ్రరీ ఉన్నాయి. ఆఫీసు, ట్రైనింగ్ సెంటరు ఉంది. వచ్చిన ఆదివాసులు ఉండడానికి డార్మెటరీ కూడా ఉంది.

వేలాదిమంది సాయుధ సేనలతో, పోలీసులతో వచ్చిన ప్రభుత్వం 18 సం॥రాల చరిత్ర కలిగిన ఆశ్రమాన్ని 2 గంటల్లో మట్టిలో కలిపేసింది. మాకేం బాధలేదు. ఎందుకంటే ఇది పోరాటం. మేం న్యాయస్థానంలో వారి మీద పోరాటం చేసాం. వారు మా మీద ప్రతిదాడిచేసి ప్రతీకారం తీర్చుకున్నారు. అప్పుడొక అద్దె గృహంలో మా ఆశ్రమాన్ని పెట్టి నడిపించాం.

అప్పుడే దేశ హోంమంత్రిగానున్న చిదంబరం ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. హింసని కనుక 72 గంటలు ఆపితే శాంతి పునఃస్థాపనకి ప్రయత్నిస్తానని చెబుతూ అదే ఇంటర్వ్యూలో ఆయన హిమంశు కుమార్ కనుక ఆహ్వానించినట్లయితే ఆదివాసులతో వారి సమస్యలు వినడానికి వెళ్ళతానన్నారు. చిదంబరం, రాహుల్‌గాంధీల్ని కలవాల్సిందిగా నాకు ఢిల్లీ నుండి కబురొచ్చింది. అప్పుడు రాహుల్‌గాంధీని వెళ్ళి కలిస్తే ఆయన ఆదివాసులు మా నుండి ఎందుకు దూరమౌతున్నారని ప్రశ్నించారు. అప్పుడు నేను సరదాగా ఆయనతో, మీరు బుద్దుడితో బ్రాహ్మణులు వ్యవహరించినట్లు ఆదివాసులతో వ్యవహరించమన్నాను. దానికాయన అదేంటని ప్రశ్నించారు. బుద్ధుడు బ్రాహ్మణత్వాన్ని ధిక్కరించి నిలిచాడు, బ్రాహ్మణులు తెలివిగా బుద్దుడ్ని విష్ణువు అవతారాల్లో చేర్చి పారేసారు. తర్వాత బౌద్ధం ప్రపంచమంతటా వ్యాప్తి చెందింది, ఒక్క భారతదేశంలో తప్ప. అలా మీరు కూడా నక్సలైట్లు మా మిత్రులేనని చెప్పండి. మా పరిపాలనలో లోపాల్ని వారెత్తి చూపుతుంటారని చెప్పండి. ప్రజాస్వామ్యంలోని అలాంటి లోపాల్ని సరిచేయడానికే ఇప్పుడు ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారని చెప్పండని అన్నాను. రాహుల్ నవ్వుతూ నన్ను చిదంబరాన్ని కలవమని చెప్పాడు.

నేనప్పుడు చిదంబరాన్ని కల్సి చెప్పిందేమిటంటే; చూడండయ్యా నక్సలైట్ల దగ్గర రెండురకాల యుద్ధనీతులున్నాయి. ఒక భుజానున్న సంచిలో మార్క్స్, మావో, లెనిన్‌ల సాహిత్యం ఉంటుంది. ఇంకో భుజాన తుపాకీ ఉంటుంది. శాంతి సమయాల్లో వాళ్ళు సంచుల్లోంచి సాహిత్యం తీసి జనాలకిచ్చి వారిచేత చదివిస్తారు. ఎదురుగా శత్రువు వస్తే మరో భుజాన ఉన్న ఆయుధాల్ని తీసి పోరాటం చేస్తారు. కానీ ప్రభుత్వం దగ్గర కేవలం ఆయుధాలే ఉన్నాయి. ఆలోచనలు లేవు. మేం మీకు అవకాశమిస్తాం, మీరొచ్చి ఆదివాసులతో మాట్లాడండి. అందుకు చిదంబరం అంగీకరించి 2010, జనవరి 7వ తేదీన వస్తానన్నాడు. నేనాయనతో మిమ్మిల్ని చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి ఆపడుకదా

అన్నాను. దానికాయన భారతదేశపు హోంమంత్రిని ఎవరైనా ఎలా ఆపగలరన్నాడు. నేను ఢిల్లీ నుండి దంతెవాడొచ్చి మా కార్యకర్తలందర్నీ పిలిచి భారతదేశ హోంమంత్రి ఆదివాసుల సమస్యలు వినడానికి స్వయంగా వస్తున్నాడనే విషయం గ్రామగ్రామానికీ చేరేలా చెప్పమన్నాను.

నేను చిదంబరానికి ఒక సిడి ఇచ్చాను. అందులో కొన్ని దురాగతాలకి సంబంధించిన దృశ్యాలున్నాయి. గోమ్‌పాడ్ అనే ఒక గ్రామంలో సిఆర్‌పిఎఫ్ కోబ్రా దళానికి చెందిన సైనికులు 16 మంది ఆదివాసుల తలలు నరికేసారు. 80 ఏళ్ళ వృద్ధుడి కడుపు చీల్చేసారు. 70 ఏళ్ళ మహిళ స్తనాలు కోసారు. ఏడాదిన్నర వయసున్న పసివాడి చేతిని కోసేసారు. తల నరికేయబడ్డ తల్లి మొండెం ఒడిలో వాడు ఏడుస్తూ పడున్నాడు. 8 ఏళ్ళ వాడి పిన్నితో పాటూ వాడి అమ్మమ్మనీ, తాతయ్యనీ హత్య చేసారు. ఆ ఘటనలకి సంబంధించిన సాక్షుల్ని మీరొచ్చినప్పుడు మీ ముందు ప్రవేశపెడతానని నేను చిదంబరంతో చెప్పడం జరిగింది.

నన్ను మోసం చేసారు. నేనిచ్చిన సీడిని వాళ్ళు చత్తీస్‌ఘడ్ ప్రభుత్వానికి పంపారు. మొదటగా సుప్రీంకోర్టులో పిటీషన్ వేసిన గోమ్‌పాడ్ గ్రామస్థుల్ని కిడ్నాప్ చేసారు. ఆ కేసులో పిటీషనర్‌గా నేనొక్కడినే ఇక మిగిలాను. ఆ సిడీలో ఇంకో కేసుంది. సుక్మా జిల్లాలోని సామ్‌శెట్టి గ్రామానికి చెందిన నలుగురు యువతుల్ని పోలీసులు బలాత్కరించి అత్యాచారం చేసారు. ఆ స్త్రీలు ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కి వెళితే అక్కడ వారికి తమపై అత్యాచారం చేసినవాడే అధికారిగా కూర్చుని కనిపించాడు. దాంతో వాళ్ళు మా దగ్గరికి వచ్చారు. ఆ యువతుల ఫిర్యాదుని వ్రాతపూర్వకంగా రాసి ఎస్.పి.కి. రిజిస్టర్ పోస్ట్‌లో పంపడం జరిగింది. ఎస్.పి. నుండి ఏ జవాబూ రాలేదు. అప్పుడు ప్రైయివేటుగా మేం కోర్టులో కేసుని ఫైల్ చేసాం. ముద్దాయిలైన పోలీసులపై వారెంటు జారీ అయింది కానీ ఆ పోలీసులు పరారీలో ఉన్నారని పోలీసుశాఖ కోర్టుకి చెప్పింది. నేరారోపణ చేయబడిన పోలీసులు మరిన్ని అత్యాచారాలు చేస్తూ, మరిన్ని గ్రామాల్ని తగలెడుతున్న సమయంలో అలా చెప్పడం జరిగింది. ఇదే విషయాన్ని హిందూస్థాన్ టైమ్స్ పత్రిక పరిశోధించి ప్రచురిస్తూ "పరారీలో ఉన్నా కానీ డ్యూటీలోనే ఉన్నార"ంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. హోంమంత్రికి తెల్సు. ముఖ్యమంత్రికి కూడా తెలుసు. వారి ఆధ్వర్యంలోనే వారి నేతృత్వంలోనే మొత్తం ప్రభుత్వం తన శక్తినంతా వెచ్చించి అత్యాచారం చేసినవార్ని కాపాడుతున్నారు. ఆ స్త్రీలు హోంమంత్రి ముందుకి వస్తారని ముఖ్యమంత్రికి తెలుసు. ఆయన ఆదేశానుసారమే 400 మంది పోలీసులు, అత్యాచారం చేసిన ఆ సిబ్బందితో సహా ఆ యువతులున్న గ్రామానికి వెళ్ళారు. గ్రామంలో అల్లకల్లోలం సృష్టించి ఆ యువతుల్ని ఎత్తుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లో 5 రోజులపాటు మళ్ళీ బలాత్కరించి ఐదురోజుల తర్వాత జీప్‌లో తీసికెళ్ళి గ్రామకూడలిలో విసిరేసి వెళ్ళిపోయారు. పోతూ పోతూ మళ్ళీ హిమంశు కుమార్ దగ్గరకి కనుక వెళితే మొత్తం గ్రామాన్ని బూడిద చేస్తామని బెదిరించారు.

తర్వాత నేను ఆ గ్రామానికి వెళ్ళాను. నాతోపాటు ముంబయి జర్నలిస్టు ప్రియాంక బోర్‌పూజారీ కూడా ఉన్నారు. ఆ అమ్మాయిలు నాతో మాట్లాడుతూ, మీరే ముందుకు రండంటూ మమ్మల్ని ప్రేరేపించారు. రాజ్యాంగం, న్యాయస్థానం ఉన్నాయన్నారు. ధైర్యంగా ఉండమనీ, గొంతు విప్పమనీ, భయపడొద్దని చెప్పారు. కానీ మీరు మమ్మల్ని కాపాడలేకపోయారు, అన్నారు. వాళ్ళ మాటలు విన్నాక వాళ్ళని మరింత ప్రమాదంలోకి నెడుతున్నానేమో అని నాకు అనిపించింది. రాజ్యాంగం న్యాయస్థానాలపై నాకున్న భ్రమలన్నీ తొలగిపోయాయి.

మనం ఆదివాసులకి వారి ఆత్మాభిమానం, జీవితం, బ్రతుకుతెరువు, కాపాడుకునేందుకు ఏ మార్గాన్నీ వదలలేదు. రాజ్యం, మీడియా, న్యాయస్థానం అన్నీ వారికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. వాళ్ళకి మనమేమీ వదల్లేదు! ఆదివాసులు వాళ్ళ పిల్లల్ని ఎలా కాపాడుకోవాలి? ఏముంది వాళ్ళ దగ్గర? పోరాడ్డం, పోరాడుతూ పోరాడుతూ మరణించడం తప్పా?

అప్పటికి చిదంబరం రావడానికి ఇంకా మూడ్రోజులుంది. నా ఆశ్రమంలో గోమ్‌పాడ్ గ్రామానికి చెందిన సోడీసోంబో అనే స్త్రీ ఉండేది. ఆమె కాలుపై సిఆర్‌పిఎఫ్ జవాన్లు కాల్చేసారు. నేనామెను తీసుకుని ఢిల్లీ సెయింట్ స్టీఫెన్ హాస్పటల్‌కి వెళ్ళాం. అక్కడ ఆమె కాలులో రాడ్ అమర్చడం జరిగింది. నెలరోజుల్లో ఆమెను మళ్ళీ తీసుకురమ్మని డాక్టర్ చెప్పారు. ఆమెను తీసుకుని జనవరి 4న ఢిల్లీకి బయలుదేరాను. అంటే చిదంబరం రాకకి మూడ్రోజుల ముందు. మార్గమధ్యలో పోలీసులు మా బండిని ఆపి ఆమెని అపహరించుకుపోయారు. సాయంత్రానికి మీడియాలో హిమంశుకుమార్ ఆమెని కిడ్నాప్ చేసాడు, పరారీలో ఉన్నాడనే వార్తలొచ్చాయి. పోలీసులు త్వరలోనే అతడ్ని పట్టుకుంటారని కూడా వార్తల్లో వచ్చింది! మర్నాడు నా దగ్గరకి నా సహచరుడొకరొచ్చి ఒక్క గంటలో నా యింటిపై పోలీసులు దాడి చేస్తారు. అలాగే ఈ రోజు రాత్రి మిమ్మల్ని చంపేస్తారనే సమాచారం ఇచ్చాడు. భార్యాపిల్లల్ని తీసుకుని నేను వెళ్ళిపోతున్నాను. మీరు కూడా తప్పించుకుపొండన్నాడు. అతడు చెప్పినట్లే సరిగ్గా గంట సేపటికల్లా అతడింటిపై పోలీసులు దాడిచేసారు. మోటర్‌సైకిల్ తీసుకుపోయారు, టీవీ తదితర సామాన్లు ధ్వంసం చేసారు. నా ఇంటిని చుట్టుముట్టారు. రాత్రి నన్ను హత్య చేయాల్సిఉంది. నా సహచరులందరి ఇళ్ళపైనా పోలీసులు కాపలాకాసి నిఘా పెట్టారు. నేను విచారించిందేమంటే వేలమంది ఆదివాసుల కేసులు న్యాయస్థానంలో ఉన్నాయి. ఇప్పుడు కనుక నేను మరణిస్తే మొత్తం పోరాటం పరిసమాప్తమయిపోతుంది. హీరో అవడం కంటే ముఖ్యంగా ఈ పోరాటాన్ని కొనసాగించడం చాలా అవసరం. అలా అనుకొని అర్ధరాత్రి మా ఇంటిగోడ దూకి రాయ్‌పూర్ వెళ్ళి అక్కడినుండి విమానంలో ఢిల్లీకి చేరాను.

నా మొత్తం అనుచరులు, సహచరులు మా సంస్థ కార్యకర్తల ఇళ్ళన్నింటిలో సోదాలు జరిగాయి. అక్రమాలు చేసిన పోలీసు అధికారుల మీద ఈగ కూడా వాలలేదు.

ఆదివాసుల కోర్టు వ్యవహారాలన్నీ నేనే చూస్తున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో కావాలని చావుని కోరుకోవడం తెలివయిన పనని నాకనిపించలేదు. అందుకే అర్ధరాత్రి ఇంటిగోడ దూకి టాక్సీలో రాయ్‌పూర్ చేరి అక్కడ్నుంచీ ఫ్లయిట్‌లో ఢిల్లీకి వచ్చేసాను. తర్వాత నాకు తెల్సిందేమంటే ప్రభుత్వం నేను మళ్ళీ వచ్చి ఆదివాసులతో పనిచేసే అవకాశం లేకుండా చేయడం కోసం నా మీద సుమారు 100 వారెంట్లు జారీ చేసింది.

కోపాకుంజుమ్ అనే నాకత్యంత దగ్గరి మిత్రుడున్నాడు. హోంమంత్రి ఆదివాసుల గోడు వినడానికి వస్తున్నాడని ఆదివాసీ గ్రామాల్లో చెబుతుండగా మానవహక్కుల దినంనాడు అతడ్ని పోలీసులు తీసుకుపోయారు. అతడితోపాటూ ఉన్న హైకోర్టు లాయరు కూడా స్టేషన్‌కి వెళ్ళాడు. జిల్లాలో ఏ లాయరూ పోలీసుల ముందు నోరెత్తడానికి కూడా జంకుతాడు. అలాంటిది మీరు స్టేషన్ లోపలికే వచ్చేసారా! అంటూ లాయరుని కూడా వాడితోపాటు బట్టలిప్పి తలకిందకి వేలాడ కట్టండంటూ ఆదేశించాడు పోలీసధికారి. ఆ రాత్రంతా ఇద్దరినీ కొడుతూనే ఉన్నారు. హత్య, అపహరణకి సంబంధించిన రెండున్నరేళ్ళు శిక్షపడగల తప్పుడు కేసు బనాయించి ఇద్దర్నీ జైలులో పడేసారు. ఉదయం లాయరుచేత రక్షణకోసం రాత్రి స్టేషన్‌లో గడిపాననీ ఉదయమే సత్సంబంధాలతో తిరిగి వెళుతున్నానని కాగితం మీద రాయించుకుని సంతకం చేయించుకున్నారు. నా దగ్గరికి లాయరు వచ్చినప్పుడు ఆయన దేహమంతా ఎర్రగా వాచి, కందిపోయి ఉంది. ఆ స్థితిలో ఉన్న ఆయన ఫోటో ఇప్పటికీ నా దగ్గర ఉంది. ఆయన ఎఫ్ఐఆర్ ఇప్పటికీ నమోదు చేయబడలేదు.

నా మరో సహచరురాలు సోనీసోరి నా విద్యార్థిగా ఉండేది. అలాగే ఆమె మేనల్లుడు లింగ్ కొడోపీ కూడా. ప్రభుత్వ దౌర్జన్యాలకి వ్యతిరేకంగా గొంతు విప్పడం మొదలయ్యాక లింగ్ కొడోపీని పట్టుకుని ఎస్.పి. ఇంటికి తీసుకెళ్ళారు. అతడ్ని నగ్నంగా చేసి కారం–నూనె కలిపిన మిశ్రమం కర్రకురాసి దాన్ని అతడి మలద్వారంలోపలికి దూర్చేసారు. అతడి గుదభాగం చీలిపోయింది. ఇప్పటికీ అతనికి రక్తస్రావం అవుతుంటుంది. ఎన్నో ఆపరేషన్లు జరిగాయి అయినా బాగవలేదు. సోనీసోరిని స్టేషన్‌కి పిలిచి అరుంధతీరాయ్, ప్రశాంత భూషణ్, హిమంశుకుమార్ పట్టణప్రాంతపు నక్సలైట్లని రాసిమ్మన్నారు. అలా రాసిస్తే వొదిలేస్తామన్నారు. అయితే అలా రాయడానికామె నిరాకరించింది. దాంతో ఆమెను వివస్త్రను చేయమని పోలీసుల్ని ఎస్.పి. ఆదేశించాడు. నగ్నంగా ఉన్న ఆమెకి కరెంటు షాకులివ్వడమే కాక ఆమె గుప్తాంగాల్లో గులకరాళ్ళని కుక్కడం జరిగింది. స్పృహలేకుండా, అలా పడున్న ఆమెని చూడ్డానికి కూడా మెజిస్ట్రేట్ సిద్దపడకుండా, జుడీషియల్ రిమాండ్ ఇచ్చి జైలుకి పంపించేసాడు. ఆమెని చత్తీస్‌ఘడ్ వెలుపల పరీక్ష చేయాల్సిందిగా మేం సుప్రీంకోర్టుకి నివేదించాం. కోల్‌కత్తాలోని ఎన్ఆర్ఎస్ హాస్పటల్‌లో సోనీసోరీకి మెడికల్ పరీక్షలు జరిగాయి. ఆమె శరీరంలోంచి రాతిగడ్డలు వచ్చాయి. వాట్ని సుప్రీంకోర్టు టేబిల్‌మీద ఉంచడం జరిగింది. 7 సంవత్సరాలకు పైగా అవుతున్నా ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానం ఒక ఎస్.పి.పై

ఎఫ్ఐఆర్ నమోదు చేయమనే ధైర్యం చేయలేకపోయింది. ఎందుకు? ఎందుకనంటే భారతదేశంలో సాగుతున్న అభివృద్ధి నమూనా ఏదైతే ఉందో అది తుపాకీ నీడలో మాత్రమే కొనసాగగలదు. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుండి నేటి వరకూ ఒక్క అభివృద్ధి ప్రాజెక్టు కూడా పోలీసులు, తుపాకులు లేకుండా సాధ్యపడలేదు. అలాంటిది పోలీసుల్నే జైలులో పడేస్తే మరి పట్టణవాసుల, నగరవాసుల అభివృద్ధి ఎలా జరుగుతుంది? ఈ అభివృద్ధి నమూనా పేదలతో సంప్రదింపులు జరపడం వల్ల సాధ్యపడదు. ఆక్రమించడం వలన, ఆయుధాలకి పనిచెప్పడం వల్లనే సాధ్యపడుతుంది. అందుకే పోలీస్ అధికారిని శిక్షించడానికి సుప్రీంకోర్టుకి ధైర్యం చాలడం లేదు.

సంవత్సరాలుగా సోనీసోరి సుప్రీంకోర్టులో పోరాడుతూనే ఉంది. ఇప్పుడు ఇతరుల కోసం కూడా పోరాడుతోంది. ప్రభుత్వం ఈ ప్రక్రియనే కొనసాగిస్తానంటోంది. ఆమెని లక్ష్యంగా చేసుకుంది. నేనామెతో మాట్లాడితే అదే చెబుతోంది. సల్వాజుడుం మళ్ళీ వస్తోందట. కొద్దినెలలముందే మరికొన్ని గ్రామాలకి నిప్పుపెట్టారట. మహిళల్ని విచక్షణారహితంగా కొట్టారట. సైన్యం ఆదివాసుల ధాన్యాగారాల్ని, పశువుల కొట్టాల్ని ధ్వంసంచేసి మేకల్ని, బర్రెల్ని, అడవుల్లోకి తుపాకులు పేల్చి పరిగెత్తించారట. పంటలన్నింటినీ పాడుచేసారట. గ్రామాల్ని కనుక వదిలి వెళ్ళకపోతే మీ పిల్లల పీకలు కోస్తామని బెదిరిస్తున్నారట. ఆదివాసులగోడు వినేవాళ్ళెవరూ అక్కడ మిగల్లేదు.

వినాయక్‌సేన్ చత్తీస్‌ఘడ్ వచ్చి పని చేయలేరు. షాలినీగేరా, ఇషా ఖండేల్‌వాల్ న్యాయసహాయం కోసం అక్కడికెళితే వాళ్ళని అక్కడి నుండి తరిమేయడమేకాక ఏమాత్రం సిగ్గూ, భయం లేకుండా డిజిపి; మేం లాయర్లని ఎందుకు తరిమేస్తున్నామంటే ఇక్కడి న్యాయం మావోయిస్టులకి మద్దతిస్తుంది, అంటున్నాడు. ఎవరు మావోయిస్టులు? పోలీసులు ఎవరిపైన ముద్రవేస్తారో వాళ్ళంతా మావోయిస్టులా? నన్ను మావోయిస్టన్నారనుకోండి, నేను మావోయిస్టునో కాదో న్యాయస్థానం తేలుస్తుంది. అందుకొరకు నాకు న్యాయవాది అవసరం ఉంది. అలాంటిది మీరు మా న్యాయవాదుల్ని తరిమికొడతారు. శారీరకంగా చిత్రహింసలు పెడతారు. అలాంటప్పుడు నేను ఎలా న్యాయపోరాటం చేయగలను? న్యాయమయిన పోరాటంలో అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇది నేరం. కోర్టు దీనిని పరిగణనలోకి తీసుకోవాలి. కానీ అలా చేయడం లేదు. అందుకే న్యాయవాదుల్ని తరిమికొట్టామని డిజిపి మీడియాతో చెప్పగలుగుతున్నాడు.

అయిదుగురు విలేఖరుల్ని జైల్లో పడేసారు. సోనీసోరి మీద పలుసార్లు దాడిచేసి యాసిడ్ పోసారు. హైదరాబాద్ నుండి కొద్దిమంది లాయర్లు, జర్నలిస్టులు కలిసి నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి వెళితే మొత్తం కమిటీ సభ్యులందర్నీ జైల్లో వేసారు. వాళ్ళందరితో నగ్నంగా జైల్లో పెరేడ్ చేయించారు. నిజనిర్ధారణ కోసం బయటనుండీ భయపడి ఎవరూ రాకూడదనే అలాచేసారు.

ఆదివాసులకి మద్దతిచ్చే మార్గాలన్నీ మూసేయబడుతున్నాయి. న్యాయస్థానాలు, ప్రసారమాధ్యమాలు వ్యవస్థ మొత్తాన్ని స్థబ్దంచేసి ఆదివాసుల్ని సామూహికంగా

చంపుతున్నారు. వంద సంవత్సరాల క్రితం ఎక్కడో సూడాన్, ఆఫ్ఘనిస్థాన్ వంటి దూరదేశంలోని విషయంలా కనిపించొచ్చు కానీ ఇది ఇప్పుడు ప్రస్తుతం మన దేశంలో మన ప్రభుత్వం చేయిస్తోంది. మనల్ని మనం చాలా నాగరికులమని, ప్రజాతంత్ర వాదులమనీ, ఆధునిక సంస్కృతీ పారాయణులమని చెప్పుకుంటాం. మన దేశ సైన్యాన్ని ఉపయోగించి కోట్లాదిమంది మన దేశవాసుల్నే హత్య చేయడం జరుగుతోంది. ఇది అసహనం వల్ల ఏర్పడిన పరిస్థితి. నిజానికి దేశంలో జరుగుతున్న లక్షలాది, కోట్లాది మంది ప్రజల హత్యలకి వ్యతిరేకంగా అసహనం ప్రకటించబడాలి. అటువంటి అసహనాన్ని వ్యాపింపచేయడానికి నేను కృషి చేస్తాను. బస్తర్‌ను తాకిన మంట చిన్నదే కావొచ్చు. నా పోరాటం అసలే ప్రభావం చూపదని మీరనవచ్చు. కానీ బస్తర్‌లోని ప్రజలు పోరాటం చేస్తున్నారు. జైళ్ళకి వెళ్తున్నారు. తట్టుకోలేని పరిస్థితుల్లో మరణిస్తున్నారు. ఆ విషయం పై మనం ఎక్కువగా దృష్టిపెట్టి చర్చించాలి. మాట్లాడాలి, రాయాలి. ఎన్ని ఎక్కువ గొంతులు కలిసికట్టుగా నినదిస్తే ప్రభుత్వం అంతగా భయపడుతుంది. ఎంత మౌనంగా ఉంటే ప్రభుత్వం అంతలా తెగిస్తుంది. అన్నిటికంటే ముఖ్యమయిన ప్రమాదకరమయిన విషయం ఏమిటంటే, చత్తీస్‌ఘడ్‌లో ప్రభుత్వానికి ఏమాత్రం అవకాశం చిక్కి ముందుకు సాగడమంటూ జరిగితే, రేపు మీతో కూడా ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తుంది.

ఇప్పుడు యు.పి.లో యాంటీరోమియోస్క్వాడ్‌ని ఏర్పాటు చేసారు. అదక్కడి సల్వాజుడుం. ఎవరినయినా పట్టుకుని కొట్టే అధికారం గూండాలకిచ్చారు. ఇదే తరహాలో హర్యానాలోని గోరక్షక దళాలకి అనుమతి పత్రాలిచ్చారు. అది కూడా సల్వాజుడుమే. ముస్లింలు, పశువ్యాపారం చేసుకునే దళితులపై దాడులు చేసి కొట్టడానికిగానూ పోలీసు ప్రొటక్షన్ ఇవ్వబడుతోంది.

మీరు కనక చత్తీస్‌ఘడ్‌లో ఇలా మాట్లాడితే ప్రభుత్వం మీపట్ల కూడా ఇలాగే వ్యవహరిస్తుంది. అందుకే ఎక్కడయితే ప్రభుత్వం రాజ్యాంగాన్ని, న్యాయాన్ని, మానవ హక్కుల్ని, కాలరాస్తుందో అక్కడే వెంటనే గొంతు విప్పండి. ఆపడానికి ప్రయత్నించండి. మీ ధిక్కారస్వరాన్ని వినిపించండి. ఏ ఒక్క వ్యక్తికి సంబంధించిన మానవహక్కుల్ని హరించడానికైనా అంగీకరించడమంటే భారతదేశంలోని ప్రతి నాగరిక పౌరుడి మానవహక్కుల్ని హరించడానికి ఒప్పుకోవడమే!

తాడిమెట్ల గ్రామంలో ఏం జరిగింది?

2011 మార్చి నెలలో సుమారు 400 మంది సాయుధ సైనికులు, పోలీసులు చత్తీస్‌ఘడ్‌లోని తాడిమెట్ల, తిమ్మాయిపురం మరియు మోరంపల్లి గ్రామాలపై దాడి చేసారు.

గ్రామాల్లో ఉన్న ఆదివాసులంతా గ్రామాలొదిలి పారిపోవాలని ప్రభుత్వం కోరుకుంటోంది.

ఆదివాసుల నుండి భూమి లాక్కుని పెట్టుబడిదారులకి ఇవ్వాలనుకుంటోంది.

ఆదివాసులు పోలీసు దాడుల్నుంచీ ప్రాణాలు దక్కించుకోడానికి అడవుల్లోకి పారిపోయారు.

భద్రతాదళాలు ముగ్గురు ఆదివాసీ మహిళలపై అత్యాచారం చేసారు.

పోలీసులు ముగ్గురు ఆదివాసుల్ని హత్య చేసారు.

పోలీసులు, సైన్యం గ్రామంలో మూడురోజులు ఉన్నారు.

గ్రామాన్ని విడిచిపోతూ పోలీసులు 300 ఆదివాసీ ఇళ్ళకి నిప్పుపెట్టి తగలబెట్టారు.

ఆదివాసీ ఇళ్ళల్లో ఆహారధాన్యాల్ని తగులబెట్టారు.

వెళ్ళిపోయేటప్పుడు పోలీసులు ఒక ఆదివాసీ అమ్మాయిని తీసుకెళ్ళారు.

ఆమెని రాత్రంతా స్టేషనులో వివస్త్రగా ఉంచి సామూహికంగా బలత్కరించారు.

ఈ సంగతులన్నీ గ్రామస్థులు నాకు ఫోన్‌లో చెప్పారు. నేను ఈ విషయాలన్నింటినీ మెసెజ్‌లుగా పంపించాను.

మెసేజ్ చూసిన దంతెవాడ కలెక్టర్ ఆర్.ప్రసన్న నాకు ఫోన్‌చేసి మీరు చెబుతున్న విషయాలకి సాక్ష్యాలేవని అడిగారు.

అప్పుడు కలెక్టర్‌గారితో, మీరే స్వయంగా ఆయా గ్రామాలకి వెళ్ళి మీ కళ్ళతో నిజాల్ని చూడమన్నాను. నా మెసేజ్ కనుక అబద్దమైతే నన్ను జైల్లో పెట్టండన్నాను.

అలాగే కలెక్టర్‌ని కాస్త ఆహారసామాగ్రి కూడా వెంటబెట్టుకు వెళ్ళమన్నాను.

కలెక్టర్ ఒక ట్రక్‌లో సామానంతా పెట్టుకుని పోలీసులు తగలబెట్టిన గ్రామాలవైపు తరలిపోయాడు.

ఆ సమయంలో దంతెవాడ ఎస్.పి.గా కల్లూరి ఉన్నాడు.

కల్లూరి కంపెనీలకి బాగా కావాల్సిన అధికారి. కల్లూరి కలెక్టర్ వాహనాన్ని గ్రామ సరిహద్దులోనే ఆపేసాడు. అంతేకాదు, కలెక్టర్ తీసుకొచ్చిన సామానంతా లూటీచేయించాడు.

ఇదంతా నేను మళ్ళీ ప్రభుత్వానికి రాసాను.

ప్రభుత్వం కలెక్టర్‌ని, కల్లూరిని ఇద్దరినీ ట్రాన్స్‌ఫర్ చేసింది.

కలెక్టర్ వెంటనే చార్జ్ ఇచ్చేసాడు కానీ కల్లూరి భల్లూకప్పట్టువొదల్లేదు.

నేను విలేఖరులకి ఫోన్‌చేసి ఆయా గ్రామాలకి వెళ్ళి ఆదివాసుల్ని కలుసుకోమని చెప్పాను.

హిందూ పత్రికా విలేఖరి ఆమన్‌సేథీ, నయీ దునియా పత్రికా విలేఖరి అనిల్ మిశ్రా పోలీసుల కళ్ళుకప్పి ఆ గ్రామాలకి వెళ్ళి రిపోర్టు పంపించారు.

నేనెలా రాసానో అక్షరాలా అక్కడ అదే జరిగింది. నేను స్వామి అగ్నివేష్‌కి ఫోన్‌చేసి ఈ ఘటనకి సంబంధించిన సమాచారం ఇచ్చాను.

ఆయా ఆదివాసీ గ్రామాలకి ఆహారపదార్థాలు ఎలాగైనా చేర్చాల్సిందిగా ప్రార్థించాను.

స్వామి అగ్నివేశ్ ఢిల్లీ నుండి విమానంలో చత్తీస్‌ఘడ్ వచ్చారు. ఆహార ధాన్యాల్ని కొని ఒక వాహనంలో సర్ది బాధిత గ్రామాల వైపు సాగారు.

దారిలో ఆయన వాహనాన్ని పోలీసులు ఆపేసారు.

మీ ప్రాణాలకి అపాయం కలగచ్చంటూ హెచ్చరించారు.

నిజానికి జరిగిందేమిటంటే, పోలీసు అధికారి కల్లూరి నేతృత్వంలో ప్రైయివేటు గుండాలకు, పోలీసు అధికారులకు ఫుల్‌గా మద్యం పోయించి, ఆయుధాలిచ్చి తగలబడిన గ్రామాల దగ్గర కాపాలా పెట్టారు. మీడియా, సామాజిక కార్యకర్తలు గ్రామాల్లోకి రాకుండా చూడటం వారిపని.

కొంతసేపటికి స్వామి అగ్నివేశ్ వారితో తగలబడిన గ్రామాల్లోకి నేను వెళుతున్నానని ముఖ్యమంత్రికి చెప్పండని కొద్దిమంది జర్నలిస్టులతో కల్సి బాధిత గ్రామాలవైపు వెళ్ళిపోయారు.

దరోనాపాల్ అనే గ్రామ సరిహద్దులో కల్లూరి నియమిత గూండాలు, సాయుధ సైన్యం కల్సి స్వామి అగ్నివేశ్ ఇంకా విలేఖరులపై మూకమ్మడిగా దాడి చేసారు.

బండరాళ్ళతో స్వామి అగ్నివేశ్, విలేఖరులు వచ్చిన వాహనాల అద్దాల్ని పగలగొట్టారు.

ఒక పెద్ద రాయి స్వామి అగ్నివేశ్ తలకి తగిలింది. కానీ తలపాగా పెద్దగా ఉండటం వల్ల ఏమీ కాలేదు.

స్వామీ అగ్నివేశ్, పత్రికా విలేఖరులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెనక్కి రావాల్సి వచ్చింది.

ఆదివాసీ జర్నలిస్టు లింగ్ కోడొపీ ఢిల్లీలో జర్నలిజం పూర్తి చేసాడు.

అతడు ఈ తగలబడిన గ్రామాల్లోకి పోవాలని నిర్ణయించుకున్నాడు.

రహస్యంగా గ్రామాల్లోకి వెళ్ళి బాధితుల్ని కల్సి వారి ఇంటర్వ్యూల్ని వీడియోతీసి తీసుకొచ్చాడు.

అలాంటి వీడియోలు కొన్నింటిని మేం యూట్యూబ్‌లో పెట్టాం, దాంతో ప్రభుత్వం హడలిపోయింది.

లింగ్ కడోపీ మళ్ళీ దంతెవాడ వెళ్ళినప్పుడు పోలీసులు అతడ్ని అరెస్ట్ చేసారు.

మీడియాకి అబద్దపు కథని ఇస్తూ ఎస్సార్ కంపెనీ కాంట్రాక్టర్ నుండి నక్సలైట్ల కోసం 15 లక్షలు తీసుకుంటుండగా లింగ్ కడోపీని పట్టుకున్నామన్నారు.

కానీ లింగ్ కడోపిని అతడింటి నుండి తీసికెళుతూ పోలీసులు, నువ్వు తాడిమెట్ల గ్రామానికి సంబంధించిన వీడియోలు యూట్యూబ్‌లో పెట్టావు కదా, దాని ఫలితం ఇప్పుడు అనుభవించబోతున్నావ్ చూడు, అన్నారు.

ఆదివాసీ విలేఖరి లింగ్ కడోపిని దంతెవాడ కొత్త ఎస్.పి. అంకిత్‌గార్గే నివాసానికి తీసికెళ్ళారు.

అక్కడ అతడి బట్టలూడదీసి కారం, నూనె దట్టంచిన లావుపాటి కర్రని మలద్వారంలోకి దిగేసి కొట్టారు. దాంతో అతడి వెనుకభాగం చీలిపోయింది. తర్వాత అతడ్ని జైల్లో పడేసారు.

తర్వాత పోలీసులు ఢిల్లీ వచ్చి లింగ్ కడోపీ అత్త సోనీసోరీని పట్టుకుని చత్తీస్‌ఘడ్ తీసుకుపోయారు.

ఎస్.పి. అంకిత్‌గార్గే అర్ధరాత్రి స్టేషన్‌కొచ్చి ఆమెకి విద్యుద్ఘాతాలివ్వడమే కాకుండా గుప్తాంగాల్లో గులకరాళ్ళు నింపారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్రాలు బోధించే ప్రొఫెసర్ నందినీ సుందర్ న్యాయస్థానానికి పోలీసులు తగలబెట్టిన గ్రామాల గురించి తెలపడం జరిగింది.

సుప్రీంకోర్టు స్పందించి సిబిఐని ఈ ఘటనపై విచారణ చేసి వివరాలివ్వాలని ఆదేశించింది.

సి.బి.ఐ. అధికారులు విచారణ కోసం అక్కడికెళితే అక్కడి భద్రతాదళాలు సిబిఐపై దాడి చేసాయి.

పోలీసుల బారినుండి కాపాడమని సిబిఐ సాక్షాత్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ప్రార్థించింది.

సిబిఐనే పోలీసులు కొడితే వాళ్ళని రక్షించమని సుప్రీంకోర్టు ఎవరితో చెప్పాలి?

సిబిఐ సుప్రీంకోర్టుకి అక్కడ గృహదహనాలు, సామూహిక హత్యలు జరిగిన మాట నిజమేనని చెప్పింది.

అప్పుడు సుప్రీంకోర్టు సిబిఐని, ఏ రోజైతే పోలీసులు గ్రామాల్లోకి వెళ్ళారో ఆ రోజే ఇవన్నీ జరిగాయా? అని అడిగింది. ఆగస్టు 2, 2016న సుప్రీంకోర్టుకి సిబిఐ జవాబిస్తూ ఏ రోజైతే పోలీసులు గ్రామంలోకి వెళ్ళారో ఆరోజే మహిళలు బలాత్కరించబడి అత్యాచారాలకి గురయ్యారని చెప్పింది.

సిబిఐ రిపోర్టులో నిందితులుగా ఉన్నతస్థాయి పోలీసు అధికారుల పేర్లు కూడా చేర్చడం జరిగింది.

ఆరుగుర్ని విధుల నుండి తీసేయడం జరిగింది. కానీ పై స్థాయి ఉద్యోగులు మాత్రం రక్షింపబడ్డారు.

ఐజి కల్లూరి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ జరిగిందంతా నా ఆదేశానుసారమే జరిగిందన్నాడు.

ఆదివాసీ స్త్రీలని బలత్కరించిన పోలీసులపై కానీ, ఐజి కల్లూరిపై కానీ సోనీసోరి గుప్తాంగాల్లో రాళ్ళు కూరిపించిన ఎస్.పి. అంకిత్‌గార్గేకి వ్యతిరేకంగా కానీ చర్య తీసుకోడానికి ప్రభుత్వం ధైర్యం చేయలేదు.

అలా చేయకపోగా ఈ దుర్మార్గులిద్దరికీ రాష్ట్రపతి వీరత్వ పురస్కారాలివ్వడం జరిగింది.

ఈ సంఘటన తర్వాత పోలీసులు నాతోపాటు ఇతర మానవహక్కుల కార్యకర్తల దిష్టిబొమ్మల్ని తగలబెట్టారు.

భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా పోలీసులు సామాజిక కార్యకర్తల దిష్టిబొమ్మల్ని తగలెట్టడం జరిగింది.

నేటికీ ఆయా గ్రామాల ప్రజలు న్యాయం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

ఈనాటి మన అభివృద్ధంతా తుపాకులతో తెచ్చుకున్న ఆధిపత్యంతోనే అవుతోంది.

మీరు బతికున్నంతవరకూ ఈ పోలీసులు భద్రతా దళాలు గ్రామాల్ని లూటీచేసి సహజవనరుల్ని మీకోసం తరలించడం జరుగుతూనే ఉంటుంది.

అందుకే మీరు సైన్యాన్ని సమర్థించినప్పుడల్లా మేం మా కష్టాలు మీతో చెబుతుంటాం.

దానికి మీరు మమ్మల్ని అభివృద్ధి నిరోధకులనీ, దేశద్రోహులనీ అంటారు.

ఆదివాసులకి స్వాతంత్ర్యం వచ్చిందా?

స్వాతంత్ర్యం వల్ల ఆదివాసులకి ఏం దక్కిందో మాట్లాడుకుందాం. ఆదివాసులకి స్వాతంత్ర్యం అంటే ఏమిటి?

ఒకసారి నా దగ్గరకి డౌన్ టు ఎర్త్ పత్రికా విలేఖరి వచ్చి తాను ఆదివాసులు – స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన వ్యాసమొకటి రాయాలనుకుంటున్నానన్నాడు. నేను సరే ఆదివాసీ గ్రామాలకి పోదాం పదండని ఆయన్ని తీసికెళ్ళాను.

నేనా విలేఖరిని సుక్మా జిల్లాలోని నేన్‌ద్రా గ్రామం తీసికెళ్ళాను. అప్పటికి ఆ గ్రామాన్ని ప్రభుత్వం మూడుసార్లు తగలబెట్టించింది. ఎందుకంటే ప్రభుత్వం ఆదివాసులు గ్రామాల్ని ఖాళీ చేయాలని కోరుకుంటోంది. అలాచేస్తే ఆ భూములన్నింటినీ కంపెనీలకి ఇచ్చేద్దామనుకుంటోంది.

మా కార్యకర్తలు ఆ గ్రామాన్ని తిరిగి బాగుచేసి అక్కడే కాపలాగా ఉంటున్నారు. నాతో వచ్చిన మహిళా విలేఖరి వృద్ధుడయిన గ్రామపటేల్‌ని మీ దృష్టిలో ఈ స్వాతంత్ర్యం ఎంత మహత్తరమయిందో చెప్పమని అడిగింది.

దానికాయన తెల్లమొహంపెట్టి ఆశ్చర్యంగా ఆమె వైపు చూస్తూ స్వాతంత్ర్యమా? అంటే ఏమిటి? అని నాకేసి బేలగా చూసాడు. నేను, స్వాతంత్ర్యం అంటే తెలియాలంటే ముందు బానిసత్వం అర్థం కావాలన్నాను.

ఎవరైతే బానిసత్వాన్ని అనుభవించలేదో వారికి స్వాతంత్ర్యం కూడా అర్థం కాదు. నేను చెప్పడం మొదలెట్టాను. ఈ ఆదివాసులు పుట్టినప్పటినుంచి స్వతంత్రులే. బస్తర్‌లోని ఈ అరణ్యాల్లోకి ఆంగ్లేయులు కూడా రాలేకపోయారు. కాబట్టి ఆదివాసులు వాళ్ళ జీవితంలో బానిసత్వాన్ని ఎన్నడూ చూడలేదు, బానిసత్వం ఎలా ఉంటుందో వినలేదు. వీళ్ళు జన్మతః స్వతంత్రులుగానే ఉన్నారు. బస్తర్ ఆదివాసులకు వారి వారపు సంతలు దాటి బయటి ప్రపంచం తెలీదు. వాళ్ళు పత్రికలు చదవరు, రేడియోలు వాళ్ళ దగ్గరలేవు. ఆంగ్లేయులు వచ్చారు, పోయారు. భారత్ స్వాతంత్ర్య దేశంగా రూపొందింది. కానీ ఇవేవీ ఆదివాసులకు తెలియలేదు. స్వాతంత్ర్యం వచ్చి 60 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా ప్రభుత్వం ఆదివాసుల దగ్గరకి రాలేదు. ప్రపంచీకరణ మొదలయ్యిందో లేదో లోకంలోని గుత్త సంస్థలన్నీ ఒక్కసారిగా ఈ ప్రాంతం పై విరుచుకుపడ్డాయి.

ఈ కంపెనీల ముందు ప్రభుత్వం చాలా బలహీనమయింది. అధికారంలోనున్న నాయకులు, అధికారులు, పోలీసులు కల్సి ఆదివాసుల భూములు లాక్కోడానికి సిద్ధపడ్డారు. ఎవర్నయితే న్యాయానికి రక్షణ కల్పించడం కోసం ఎన్నుకుని నియమించడం జరిగిందో వాళ్ళే అన్యాయంగా వ్యవహరిస్తూ అదే దేశాభివృద్ధంటున్నారు.

ఈ పరిస్థితుల్లో ఆదివాసులకి నక్సలైట్ల వాదన సరిగ్గానే అనిపిస్తోంది. ఈ స్వాతంత్ర్యం అబద్దమనీ ప్రభుత్వం అప్పట్లోనూ సామ్రాజ్యవాదుల చేతుల్లో ఎలా అయితే ఉందో ఇప్పుడు కూడా అలానే నయా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు పావుగా ఉపయోగపడుతోందని అంటున్నారు. అందుకే సిసలయిన ప్రజాపోరాటమే అసలయిన స్వాతంత్ర్యాన్ని తీసుకువస్తుందని అంటున్నారు. నక్సలైట్లు ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 15, జనవరి 26 దినాల్లో నల్లజెండా ఎగరేస్తుంటారు. మరోవైపున ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలన్నింటిలోనూ లోటుపాట్లు ఉంటూనే వస్తున్నాయి.

ఎక్కడెక్కడైతే అభివృద్ధి పథకాలు వచ్చాయో అక్కడ ఆదివాసులు పెద్ద ఎత్తున మూల్యం చెల్లించాల్సి వచ్చింది. అలా చెల్లించిన మూల్యానికి బదులుగా అభివృద్ధి ఫలాలేవీ ఆదివాసులకి దక్కలేదు. అభివృద్ధి పథకాల రూపకల్పనలో సైతం ఆదివాసుల అభిప్రాయాలు ఇసుమంతైనా పరిగణనలోకి తీసుకోడం జరగలేదు.

కాబట్టే జరిగిందేమిటంటే ఈ అభివృద్ధి ఫలాలన్నీ పట్టణాలకి దక్కితే మూల్యం మాత్రం ఆదివాసులు చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈరోజు అభివృద్ధనేది అతిపెద్ద రాజకీయ అంశం. కానీ పెట్టుబడిదారుల్ని దానికి నాయకుల్ని చేయడం జరిగింది.

పెట్టుబడిదారులు లాభాల కోసం పనిచేస్తారు. వాళ్ళు మనుషులకి ఉపాధి ఇవ్వడానికి బదులు యంత్రాల్ని పెట్టి పోషిస్తారు. కానీ జనాలు ప్రభుత్వాన్ని పదేపదే ఉద్యోగాలకోసం అడుగుతుంటారు. ప్రభుత్వం ఎక్కువ ప్రాంతాల్లో ఉద్యోగాల కల్పనని విస్తరిస్తుంటుంది.

దీని ప్రభావం ఆదివాసీ ప్రాంతాలపై పడుతుంది. ఎందుకంటే అత్యధిక ప్రకృతి వనరులు ఆదివాసీ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ప్రపంచంలోనే ఆదివాసులంతా ఈ అభివృద్ధి నమునా కారణంగా దాడులకి చేరువలో ఉన్నారు.

అది భాతర్ కావచ్చు, లాటిన్ అమెరికా కావచ్చు, ఆఫ్రికా కావచ్చు. ఆదివాసులపై దాడి జరుగుతోంది.

మీరు కనుక చూస్తే ఈ సమయంలో వాళ్ళ సొంత భూమిని రక్షించుకోవడం కోసం జైళ్ళలో ఖైదు చేయబడ్డ ఆదివాసుల సంఖ్య పెద్ద మొత్తంలో ఉంది.

భూమిని రక్షించుకోవడం కోసం, దక్కించుకోవడం కోసం క్రియాశీలంగా పనిచేస్తున్న ఆదివాసీ కార్యకర్తలే ఎక్కువగా హత్యలకి గురవుతున్నారు. ప్రతీ వ్యక్తికీ ఒకే విలువని గుర్తించడం స్వాతంత్ర్యం నాటి మౌలిక ప్రతిజ్ఞ. అది దారుణంగా తోసిబుచ్చబడింది.

ఆదివాసులు, పెట్టుబడిదారులు ఇద్దరూ సమానం కాదు. కాబట్టే ఆదివాసుల భూమిని లాక్కుని పెట్టుబడిదారులకి ఇవ్వడం జరుగుతోంది. అభివృద్ధి పేరిట గుప్పెడుమందిని మరింత సంపన్నవంతుల్ని చేసే ప్రక్రియ ఎంత వేగంగా జరుగుతుందో, ఆదివాసులపై దాడులు అంతే వేగంగా పెరుగుతాయి.

అభివృద్ధితో రాజీపడి మనం మన కళ్ళు మూసుకుంటున్నాం. ఎంతమంది నిర్దోషులయిన ఆదివాసుల్ని హత్యలు చేసినా, ఎంతమంది ఆదివాసీ స్త్రీలు అత్యాచారాలకి గురయినా, మనకి వాట్ని వ్యతిరేకించే ధైర్యం లేదు.

అందుకే ఈ దేశంలో నేడు ఆదివాసులంతా ఒంటరితనంతో వాళ్ళని వాళ్ళు ఏకాకులుగా పేర్కొంటున్నారు. జాతీయ మానవహక్కుల కమిషన్ రిపోర్టు ప్రకారం ఈ సంవత్సరంలో కనీసం 16 మంది ఆదివాసీ మహిళలపై భద్రతాదళాలు అత్యాచారం చేసినట్లుగా ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయి.

అయినా ప్రభుత్వం కదిలి ఏ చర్యా తీసుకోలేదు. సోనీసోరి యోనిలో రాళ్ళను కూరిన పోలీసాధికారికి రాష్ట్రపతి వీరత్వ పురస్కారం లభించింది. స్వాతంత్ర్యమంటే అర్థం సమానత్వమే అయితే, అందులో సమానావకాశాలూ, సమానాధికారాలు, సమాన గౌరవం అనేవంటు ఉంటే, అలాంటి స్వాతంత్ర్యం ఆదివాసులకి ఇంకా రాలేదు.

నేన్‌ద్రా గ్రామం కథ:

చత్తీస్‌ఘడ్‌లోని సుక్మాజిల్లా నేన్‌ద్రా గ్రామాన్ని భద్రతా దళాలు మూడుసార్లు తగులబెట్టేసాయి.

మేం ఆ గ్రామస్తుల్ని 2007లో జాతీయ మానవహక్కుల కమిషన్ ఎదుట ప్రవేశపెట్టడం జరిగింది.

గ్రామస్తులు అలా ధైర్యంగా ఫిర్యాదు చేయడం చూసిన పోలీసులు నాలుగోసారి మళ్ళీ ఆ గ్రామాన్ని తగులబెట్టేసారు.

దానిని సవాలుగా తీసుకున్న మేము ఆ గ్రామాన్ని పునర్నిర్మిస్తామని ప్రభుత్వానికి తెలియజేసాం.

ఆదివాసులతోబాటు అదే గ్రామంలో నేను ఉండబోతున్నాననీ, ఆదివాసుల్ని కనక చంపదల్చుకుంటే ముందు నన్ను చంపాలని ప్రభుత్వానికి సవాలు చేసాను.

ప్రభుత్వం నుంచి ప్రాణాలు రక్షించుకోడానికి ఆంధ్రప్రదేశ్‌లోకి పారిపోయిన ఆదివాసుల్ని నేను తిరిగి గ్రామంలోకి తీసుకొచ్చాను.

ఎంతోమంది ఆదివాసులు ప్రాణభయంతో అడవుల్లో దాక్కున్నారు. వార్ని మళ్ళీ గ్రామంలోకి తీసుకువచ్చాను.

అందరి ఇళ్ళూ మళ్ళీ నిర్మించడం జరిగింది.

తర్వాత ఆ గ్రామంలో నేను ఏడాదికిపైగా ఉన్నాను.

ఆ ఆదివాసులు రెండేళ్ళుగా సంతకి పోవడం కూడా మానుకున్నారు.

నేను తిరిగి వాళ్ళని సంతలకి తీసుకెళ్ళాను.

ఆ విషయం తెల్సి పోలీసులు నా ఆదివాసీ మిత్రుడు సుఖ్‌నాథ్‌ని పట్టుకుని జైల్లో వేసారు. అతని వద్ద బాంబులు, నక్సలైట్ల పోస్టర్లు దొరికాయనే నేరం మోపారు.

న్యాయస్థానం అతడి దగ్గర స్వాధీనం చేసుకున్న బాంబులు ఏవని అడిగితే, వాట్ని ధ్వంసం చేసేసామని చెప్పారు. సరే, ఇతని దగ్గర దొరికిన పోస్టర్లు చూపమని న్యాయస్థానం అడిగితే, వాటిని తగలబెట్టేసామన్నారు.

కోర్టు ఏవైనా ఆధారాలు చూపండని అడిగింది. పోలీసులు సాక్ష్యాలుగా వేటిని ప్రవేశపెట్టారో అవే పోలీసుల కథ అబద్ధమని చెప్పాయి.

సుఖ్‌నాథ్‌ని కోర్టు విడుదల చేసింది. కానీ, అప్పటికి అతడి రెండేళ్ళు జైల్లో గడిచిపోయాయి.

శాంతి నెలకొనాలంటే ప్రజలకి న్యాయం చేయండని చెప్పినందుకే నన్ను అపరాధిగా, దోషిగా చేసి నిస్సహాయ స్థితిలో చత్తీస్‌ఘడ్ వదిలి వెళ్ళిపోయేలా చేసారు.

అన్యాయాలు, దౌర్జన్యాలకి సంబంధించీ ఎన్ని కథలు నా తలలో సుడులు తిరుగుతున్నాయో.. కానీ ఎలా వినిపించాలి?

నేన్‌ద్రా గ్రామంలోని పరిస్థితుల్ని గురించి ముఖ్యమంత్రికి నా లేఖ

గౌరవనీయులైన రమణ్‌సింగ్‌గారికి,

సల్వాజడుం తగలబెట్టిన అనేక గ్రామల్లోంచి రెండు గ్రామాల్ని ఎంపిక చేసుకుని మా సంస్థ కార్యకర్తలు అక్కడ పునరావాస కార్యక్రమాలు చేస్తున్నట్లు నేను మీకు దీనికి ముందు రాసిన లేఖలో తెలియజేసాను.

05-07-2008న వీటిల్లో నేన్‌ద్రా అనే గ్రామానికి మా కార్యకర్తలతో వెళ్ళడం జరిగింది. నా ముందు దాదాపు 150 మంది ఆదివాసీ స్త్రీలు, పురుషులు, పిల్లలు సమావేశమయ్యారు.

వాళ్ళ ఒంటిమీది బట్టలన్నీ మాసిపోయి చిరిగిపోయి ఉన్నాయి. ఎందుకంటే వాళ్ళకి బజారుకి పోయేందుకు అనుమతి లేదు. వెళితే అక్కడే చంపేస్తారు.

ఎక్కువమంది చిక్కి శల్యమై ఎముకల గూళ్ళలా ఉన్నారు. ఎందుకంటే మూడేళ్ళుగా వాళ్ళ పంటలు తగలబెట్టేస్తున్నారు కనుక.

నేను మీకోసం ప్రధానంగా ఏం చేయాలనుకుంటున్నారని వాళ్ళని అడిగాను.

ఒక ఆదివాసీ వృద్ధుడు నిలబడి చెప్పడం మొదలెట్టాడు; రెండేళ్ళ క్రితం నా పన్నెండు సంవత్సరాల అమ్మాయిని సల్వాజుడుం వాళ్ళు పట్టుకుని కేంప్‌లోకి తీసికెళ్ళిపోయారు. నా కూతురు ఇంకా అక్కడే ఉంది. మీరు మా కూతుర్ని మా దగ్గరికి తీసుకురాగలరా?

స్వాతంత్ర్యం వచ్చిన అరవై సంవత్సరాల అనంతరం నా మనసులో ఒక ప్రశ్న మెదిలింది. మనం రోజూ పాడుకునే 'జన గణ మన అధినాయక' ఈ ముసలి ఆదివాసీ గురించేనా?

భారత రాజ్యాంగ పీఠిక మొట్టమొదటి వాక్యమే 'భారతదేశ ప్రజలమయిన మేము'తో మొదలవుతుంది. అందులో ఈ ఆదివాసులు కూడా భాగంగా ఉన్నారా?

ఆ ఆదివాసీ అమ్మాయిని తండ్రికి దూరం చేసింది ఏదో అసాంఘిక శక్తి కాదు. ప్రభుత్వాధికారం సమర్దించే ఒక కార్యవర్గమే ఆ అమ్మాయిని తండ్రికి కాకుండా చేసింది.

నాక్కూడా పన్నెండేళ్ళ కూతురుంది. నేనూ ఆలోచించసాగాను. మా అమ్మాయిని కూడా అలాగే నా నుండి దూరంచేసి బలవంతంగా అత్యాచారం చేయడానికిగానూ అలాంటి శిబిరంలో ఉంచగలరా?

అంతమాత్రం ఆలోచించేసరికి నాకళ్ళకి చీకటి కమ్ముకుంది.

ఆ క్షణంలో భారత రాజ్యాంగం నాకమితమయిన శక్తినిచ్చింది. నా విషయంలో ఇలా కాదనీ, ఎందుకంటే నేను రాజ్యాంగ పరిధిలో జీవిస్తున్నానని హామీ ఇచ్చింది.

కానీ బస్తర్‌లోని ఈ ఆదివాసీ ఇంకా రాజ్యాంగం పరిధిలోకి రాలేదనే నిజం మనందరికీ తెలుసు.

అందుకే ఆ ఆదివాసీ అమ్మాయిని తండ్రి నుండి దూరంచేసి సల్వాజుడుం శిబిరంలో పెట్టే దుస్సాహసం చేయగలుగుతున్నాం.

నేను నేన్‌ద్రా గ్రామ ప్రజలతో మాట్లాడుతూ, మా సంస్థ మీ ఇళ్ళని తిరిగి నిర్మించుకోడానికి సాయం చేస్తుందని మాటిచ్చాను.

ఆ గ్రామ యువకులు దానికి స్పందించిన తీరుచూసి నా అంతరాత్మ సిగ్గుతో కంపించింది.

ఆ యువకులు జవాబిస్తూ, "ధన్యవాదాలు, మాకు ఈ తాటాకు గుడిసెలు సరిపోతాయి. ప్రభుత్వం మమ్మల్ని చంపేయకుండా మీరు తోడుండండి చాలు."

బస్తర్ ఆదివాసులు నావంటి పట్టణ ప్రాంతం వారి నుండి ఈరోజుకీ ఏమీ ఆశించడం లేదు, మా మానాన మమ్మల్ని బతకనిస్తే చాలంటున్నారు.

నేను వారితో మళ్ళీ వ్యవసాయం చేయమన్నాను. దానికి వాళ్ళు సల్వాజుడుం, భద్రతాదళాలు మా పంటల్ని తగలబెడతారంటూ వాపోయారు.

నేను వాళ్ళతో మా సంస్థ కార్యకర్తలు అక్కడే ఉంటారనీ, సల్వాజుడుం వాళ్ళు కనుక గ్రామంలోకి వస్తే మా వాళ్ళు మాట్లాడతారనే హామీ ఇచ్చాను.

అయితే ఈ రోజు నాకు భయం పట్టుకుంది. సల్వాజుడుం కనుక మళ్లీ ఆ గ్రామంపై దాడిచేసి మా కార్యకర్తల్ని కూడా హత్యచేస్తే భారత రాజ్యాంగం వాళ్ళని ఎలా కాపాడగలుగుతుంది?

రమణ్‌సింగ్‌గారూ, మామూలుగా జరగాల్సిందేమంటే ప్రజలపై నక్సలైట్లు కనుక దౌర్జన్యం చేస్తే మీరు ప్రజల్ని కాపాడాలి.

కానీ జరుగుతోందీ, గ్రామాల్లోని ప్రజలకి అనిపిస్తోంది ఏంటంటే, ప్రభుత్వం వాళ్ళమీద దాడులు చేస్తూ దౌర్జన్యానికి పాల్పడుతుంటే నక్సలైట్లు వారిని కాపాడుతున్నారు.

ఈ పరిస్థితి దేశానికెంత లాభదాయకమో నాకు తెలీదు. బహుశా నాకంటే మీరు బాగా అర్థం చేసుకుంటారేమో కానీ నా మందబుద్ధికి మాత్రం అర్థం కావడం లేదు.

పాఠశాలలు నడవాలనీ, అంగన్‌వాడీలు తెరవాలనీ మా స్నేహితులు – సహచరులు కృషి చేస్తున్నారు.

రేషన్ దుకాణాల నుండి రేషన్ సరుకులు తిరిగి ఇప్పిస్తున్నారు. ప్రజలు మళ్ళీ దేశాన్నీ, వ్యవస్థనీ ప్రశ్నించడం, విశ్వసించడం ప్రారంభించారు.

కానీ ప్రభుత్వం తాలూకా వ్యక్తులే ఇవి జరగకుండా అడ్డుపడుతున్నారు. దేనికో అర్థం కావడం లేదు.

అన్నిటికంటే ఇబ్బంది పెడుతున్న విషయమేమిటంటే ప్రతీ విషయంలోనూ ప్రభుత్వం స్వయంగా అధికార యంత్రాంగం చేత అబద్దాలు చెప్పిస్తోంది.

ప్రభుత్వం స్కూళ్ళని మూసేసింది. అంగన్‌వాడీలనీ, ఆరోగ్య కార్యకర్తలనీ గ్రామాల్లోకి వెళ్ళకుండా సల్వాజుడుం, రక్షకదళాలు అడ్డుకుంటున్నారు. ఎందుకని అడిగితే ఆయా గ్రామాల నుండి సల్వాజుడుంలో చేరడానికి ఎవరూ రాలేదు కాబట్టీ అవి నక్సల్ గ్రామాలు!

అందుకే వీళ్ళకి ఏమీ అందడానికి వీల్లేదు. మళ్ళీ నక్సలైట్లు గ్రామాల్లో ఏ పనీ చేయనివ్వరని అబద్దపు ప్రచారం చేస్తారు.

ఎంతమంది అంగన్‌వాడీ కార్యకర్తల్నీ, ఆరోగ్య కార్యకర్తల్నీ, అధ్యాపకుల్నీ నక్సలైట్లు చంపారో మీరు చెప్పగలరా?

విషయం :– మీ విధులు మీరు నిర్వర్తిస్తున్నారా?

నిర్వర్తించడం లేదని చెప్పడానికి నా దగ్గర మీ అధికార యంత్రాంగ రాతపూర్వక వివరాలున్నాయి.

స్కూళ్ళు, అంగన్‌వాడీలు, హేండ్ పంపులు, ఆరోగ్యకేంద్రాలు, రేషన్ దుకాణాలు మొదలైనవన్నీ దంతెవాడలోని అనేక గ్రామాల్లో లక్షలాది ప్రజలకి అందించకుండా ఎందుకు మూసేయడం జరుగుతోంది?

బహుశా మీకు మీ సలహాదారులు ఇలా చేయడం వలన నక్సలైట్లు ఆకలితో మాడి చనిపోతారనీ దాంతో నక్సలిజం పనైపోతుందని చెప్పుంటారు.

కానీ జరిగింది వేరు.

మొదట్లో నక్సలైట్లు కొన్ని గ్రామాలకే పరిమితమయ్యేవారు, ఇప్పుడు ప్రభుత్వం కొన్ని పట్టణాలకే పరిమితమైంది.

నిజం చెప్పండి, బస్తర్‌లోని గ్రామాల్ని బూడిదచేసి ప్రజల్ని హత్యచేసి మీరేమీ బావుకోలేదని మీకు అనిపించడం లేదా?

నవ్వొచ్చే విషయం ఏంటంటే మంచి చెప్పే వాళ్ళందర్నీ మీ సమర్థకులు, తప్పుడు నాయకులు కల్సి వెంటనే నక్సలైటు మద్దతుదారులంటూ పిలుస్తుంటారు.

మేధావులు, బుద్ధిజీవులు, స్వతంత్ర పత్రికా విలేఖరులు, సామాజిక కార్యకర్తలు, మానవ హక్కుల కార్యకర్తలు అందర్నీ నక్సలైట్లనే ముద్ర వేసారు.

కానీ రేషన్ బియ్యం తినేసే దొంగలూ, ప్రభుత్వ పథకాల్లో అవినీతికి పాల్పడే అక్రమార్కులూ, కాంట్రాక్టర్లూ, ట్రాన్స్‌ఫర్ల కోసం లంచాలు తినే వాళ్లంతా దేశభక్తులు, పార్టీకి విధేయులు అయ్యారు.

రమణ్‌సింగ్ గారూ, మా కుటుంబ సబ్యులెంతో మంది ఈ దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములుగా ఉన్నారు. పెన్షను కూడా వదిలేసుకున్నారు.

నా తండ్రి ఆచార్య వినోభాభావే భూదానోద్యమంలో భుజాన సంచి తగిలించుకుని ముప్పైఏళ్ళు తిరిగారు.

బస్తర్లోని ఆదివాసులతో నేను పనిచేయడం చూస్తూ నువ్వు సత్యంకోసం సరయిన మార్గంలోనే పయనిస్తున్నావని నాతో ఆయనంటుంటారు.

అంతకు మించిన సర్టిఫికెట్ నాకేదీ అవసరం లేదు. నా జీవితానికదే అతిగొప్ప ప్రమాణపత్రం.

అందుకే, బడాపెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదుల కోసం సల్వాజుడుంని ఏర్పాటుచేసి గ్రామాల్ని ఖాళీచేయించే పని మీరేదైతే చేస్తున్నారో, మీకు వంతపాడుతూ పోలీసులు, సైన్యం మిమ్మల్నెలా అనుసరిస్తున్నాయో ఆ దుష్కార్యాన్ని నేను బతికున్నంతవరకూ, బయట ఉన్నా, జైల్లో ఉన్నా సఫలం కానివ్వను. మీరు కాల్చిబూడిద చేసి ఖాళీ చేయించిన గ్రామాలన్నింటినీ పునర్నిర్మించడానికి సిద్ధపడుతున్నాను. సల్వాజుడుం చేసిన ఈ అతిపెద్ద విధి నిర్వహణా విస్థాపనను విఫలం చేయబోతున్నాను. విధ్వంసానికి ప్రతిగా వినిర్మాణం చేస్తున్నాను. గాంధీ సత్యాగ్రహిగా నేను వేసే ప్రతి అడుగుకి సంబంధించిన పూర్తి సమాచారం మీకు తెలియజేస్తూ ఉంటాను.

అభివృద్ధి పేరిట మహిళలపై హింస:

నా ఎదురుగా ఒక రిపోర్టు ఉంది. జాతీయ మానవ హక్కుల కమిషన్ బస్తర్‌లో మహిళలపై పోలీసులు, భద్రతా దళాలు జరిపిన అత్యాచారాలు, దారుణాలకి సంబంధించీ విచారణ జరిపి ప్రచురించిన రిపోర్టు ఇది.

ఆ మానవహక్కుల కమిషన్ రిపోర్టులో ఇలా ఉంది; పోలీసులు ఆదివాసీ మహిళలతో మీ యోనుల్లో కారం కూరతామని అన్నారు. పోలీసులు ఆదివాసీ స్త్రీల బట్టలు తొలగించి వారి స్తనాల్ని పిసికి పిల్లలకి పాలు ఇచ్చే తల్లులా కాదా తెల్సుకునేవారు.

జాతీయ మానవహక్కుల కమిషన్ ప్రకారం తక్కువలో తక్కువ 16 మంది ఆదివాసీ స్త్రీలు బలాత్కరించబడినట్లు ఆధారాలున్నాయి. మీరు కనుక బస్తర్ వెళితే, అక్కడ గ్రామాల్లోకి పోవడానికి ప్రభుత్వం మిమ్మల్ని అనుమతిస్తే, భారత సైన్యం చేతుల్లో అత్యాచారాలకి గురికాబడిన వేలాది మంది స్త్రీలు మీకు కనిపిస్తారు.

సైనికులు సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తారు. సైనికులకి జీతంతోబాటు ధైర్యం కూడా సమాజం ఇస్తుంది. అందుకే సైనికులు అత్యాచారాలు చేస్తుంటే సమాజం

ఆపలేదంటే దానర్థం మొత్తం వ్యవస్తే బలాత్కారం చేస్తోంది. ఈరోజు మనది అత్యాచార వ్యవస్థనే నిజాన్ని ముందు ఒప్పుకుని మరో విషయంలో కెళదాం.

అభివృద్ధి పేరుతో ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని నేనంటే, బాగా చదూకున్న మిత్రుడు వచ్చి నాతో, ఏం, దేశం వెనకబడి ఉండాలని మీరు ఆశిస్తారా? అనంటాడు.

అంటే కటువుగా ఉంటుంది కానీ మనం దేశ అభివృద్ధి కోసం మన అమ్మాయిలపై, అక్కచెల్లెళ్ళపై అత్యాచారాలు చేయించడానికి సిద్ధపడతామా? మరి ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాల్ని ఎందుకు ప్రశ్నించం? ఏదేమయినా, అత్యాచారాల్ని అంగీకరించే పరిస్థితి లేదని ఖండితంగా ఎందుకు చెప్పం?

అత్యాచారాలు చేస్తేకాని అభివృద్ధి కాదనే భయం మనకి లేదనుకుంటాను. కానీ అలాంటి మార్గాన్ని అన్వేషించడానికీ, అనుసరించడానికీ మనం సిద్ధంగా లేం. అటువంటి మాటలు ఎవరయినా చెప్తే వెంటనే అతడ్ని నక్సలైటో, మావోయిస్టో, దేశద్రోహో అని పిల్చి జైల్లో పడేస్తాం. లేదా తూటాలతో చంపేస్తాం. అదీ కాకపోతే ఆ ప్రాంతం వదిలిపోయేలా పరిస్థితులు సృష్టిస్తాం. సోనీసోరీ, వినాయక్‌సేన్ ఇంకా నా ఉదాహరణలు కళ్ళముందే ఉన్నాయి. వీళ్ళేకాక ప్రభుత్వ క్రూరత్వాన్ని ప్రశ్నించినందుగ్గానూ అంతే క్రూరత్వాన్ని చవిచూసిన వారెందరో మనకి తెలుసు.

భారత రాజ్యాంగం ఆదివాసులకి ప్రత్యేక రక్షణ కల్పిస్తుంది. రాజ్యాంగం ద్వారా రాష్ట్రపతిని ఆదివాసీల సంరక్షణ కోసం నియమించడం జరిగింది. ఆదివాసులు ఈ దేశపు ప్రత్యేక, విశేషాధికారాలు కల పౌరులు. విచారకరమయిన విషయం ఏమంటే స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచీ ఈనాటిదాకా ఒక్కసారి కూడా ఆదివాసుల ప్రయోజనాలకోసం రాష్ట్రపతి తనకి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఏ ఒక్క అధికారాన్నీ ఉపయోగించలేదు. దేశంలో వేలాది మంది ఆదివాసుల్ని హత్య చేస్తున్నారు. విస్థాపనకు గురి చేస్తున్నారు. ఆదివాసులు రక్షించే వారికోసం సంవత్సరాలుగా చూస్తున్నా, రాష్ట్రపతికానీ, ఆయన ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు ఒక్కసారి కూడా ఆదివాసుల రక్షణకి ఏ కార్యక్రమం చేపట్టలేదు.

భారతీయ సమాజం ఈ సమయంలో ఆదివాసులతో యుద్ధం చేయడంలో నిమగ్నమై ఉంది. భారత ప్రభుత్వం ఇదే సమయంలో ఆదివాసులతో యుద్ధం చేస్తోంది. మీకు తెలుసా! ఈ సమయంలో అత్యధిక శాతం మన సైన్యం ఎక్కడుందో? భారతదేశపు అత్యధిక మంది సైనికులు ఇప్పుడు ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నారు. మనం మన సైనికుల్ని అడవికి ఏం చేయమని పంపించాం? ఆదివాసుల్ని రక్షించమనా? కాదు. వారి భూముల్ని ఆక్రమించుకోవడానికి పంపించాం.

ఆదివాసుల భూముల్ని బలవంతంగా లాక్కొనే సైనికులు ఈ దేశ పేదలకి మంచి చేస్తారా? చేయరు. గుప్పెడు మంది ధనిక పెట్టుబడిదారీలకు ఆ భూముల్ని సమర్పిస్తారు.

ఆదివాసీ భూముల్ని ఆక్రమించుకోవడానికిగానూ చేస్తున్న పూర్తి యుద్ధమిది. ఇందులో ఆయుధాలున్నాయి, హత్యలున్నాయి, అత్యాచారాలున్నాయి, అబద్ధపు ప్రచారాలున్నాయి. ఈ నిజాన్ని మీరొప్పుకోడానికి సిద్ధంగా లేరు.

ఆదివాసీలకి సాయం చేసే వ్యక్తులపై సంస్థలపై భారత ప్రభుత్వం మావోయిస్టనే ముద్ర వేస్తుంది. న్యాయసహాయం చేసిన ప్రభాకర్‌గవాల్ అనే న్యాయమూర్తిని విధుల నుంచి తప్పించడం జరిగింది. ఆదివాసీ స్త్రీలపై జరిగిన క్రూరకృత్యాలకి స్పందించిన జైలర్ వర్షాడోంగ్రీని వేధింపులకు గురిచేసారు. ఆదివాసీల కోసం గొంతువిప్పిన సోనిసోరి మొహంపై యాసిడ్ పోసారు. ఆదివాసీల కోసం పనిచేస్తున్న మహిళా న్యాయవాది షాలినీగోరా ఆమె సన్నిహితుల్ని బస్తర్ నుండి బయటకి తరిమేసారు. ఆదివాసీల హక్కులకోసం ముందుకొచ్చిన విలేకరుల్ని జైల్లో పెడుతున్నారు. మాలినీ సుబ్రహ్మణ్యంపై పోలీసులు దాడిచేసి ఆమె బస్తర్ విడిచిపోయేలా దౌర్జన్యం చేసారు.

అంతేకాదు, అంతర్జాతీయ సంస్థయిన రెడ్‌క్రాస్‌ని మావోయిస్టు సంఘమన్నారు, వైద్యులు నడిపిస్తున్న డాక్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్ సంస్థను మావోయిస్టు మద్దతుదన్నారు. సల్వాజుడుంకి వ్యతిరేకంగా తీర్పిచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తిని మావోయిస్టు సానుభూతిపరుడని స్వయంగా చత్తీస్‌ఘడ్ హోంమంత్రే అన్నాడు. ఆదివాసుల కోసం ఏర్పడిన సంయుక్త రాష్ట్రాల కమిషన్ ఉపాధ్యక్షుడు చత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లు పర్యటిస్తూ బస్తర్‌కొచ్చి ఆదివాసులతో మాట్లాడితే బిజెపి నాయకులు పత్రికల్లో అతడు మావోయిస్టు సానుభూతిపరుడన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశానుసారం సిబిఐ తగలబెట్టబడిన గ్రామాల్లోకి వెళ్ళాలని ప్రయత్నించినందుకు పోలీసులు సిబిఐ మీద దాడి చేసారు.

భారతదేశపు ధనికులు ఆదివాసీల మీద యుద్ధం చేస్తున్నట్లు స్పష్టమౌతోంది. కాబట్టి ఆదివాసుల్ని భారతీయ ధనికస్వామ్యం శత్రువులుగా చూస్తోంది. యుద్ధంలో శత్రువుకి సహాయం చేసేవాళ్ళంతా శత్రువుల్లాగానే చూడబడతారు. అందుకనే అలాంటి వారందర్నీ వేధింపులకు గురిచేసి మావోయిస్టులనే నెపంతో శక్తినంతా వార్ని అణిచేయడానికే వినియోగిస్తారు.

మీకు అధికారం కావాలి, శాంతి కావాలి. కానీ ప్రతీరోజూ మీరు అశాంతికి కారణమవుతున్నారు. రోజూ దోచుకోబడిన సొత్తుని అనుభవిస్తున్నారు. మీ విద్యుత్తు విలాసాల కోసం ఎంతోమంది ఆదివాసులు విస్థాపనకి గురై జైళ్ళలో కుక్కబడి, తూటాలకి బలై, బలాత్కరించబడి దూరంగా విసిరేయబడ్డారో! లోహాలు, ముత్యాలు, రత్నాలు, వజ్రాల గనులన్నీ ఎంతమంది ఆదివాసుల జీవితాల్ని నాశనం చేసి నిర్మించబడ్డాయో మిమ్మల్ని మీరెప్పుడయినా ప్రశ్నించుకున్నారా? మన సైనికులు ఎందరు ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నారు?

మీరు హింసనే అగ్నిపర్వతం మీదనే కూర్చున్నారు. హింసను సమర్థిస్తున్నారు. హింసని వ్యాప్తిచేస్తున్న ప్రభుత్వాలకి ఓట్లు వేస్తూ పన్నులు కడుతున్నారు. మీ హింస మీరు చూడలేక మొహం ముడుచుకుంటారు, మరోవైపు తిప్పుకుంటారు. కానీ అది సాధ్యం కాదు. మీకు శాంతీ, సమానత, ప్రజాస్వామ్యం లభించవనీ నేను కరాఖండీగా చెప్పగలను. మీరింత దోపిడీ, క్రూరత్వం చూపిన తర్వాత కూడా మీకు కనక శాంతనేది లభిస్తే, నా జీవితాన్ని శక్తియుక్తుల్నీ పూర్తిగా వెచ్చించి మీ శాంతికి భంగం కలిగించే మొట్టమొదటి వ్యక్తిని నేనే. అన్యాయంతో రాజీపడిన శాంతి అపరాధమవుతుంది. అలాంటి అపరాధం నేను చేయను.

నక్సల్ సానుభూతిపరులు:

ప్రభుత్వ సాయుధ సేనలు, పోలీసులు ఆదివాసుల్ని హత్య చేస్తున్నారని మానవహక్కుల కార్యకర్తలు ఆందోళనతో ప్రకటిస్తుంటే, భక్తకోటి వెనువెంటనే మరి నక్సలైట్లు హత్యలు చేసినప్పుడు మీరెందుకు మాట్లాడరని ప్రశ్నిస్తారు.

ఈమధ్య ఈ భక్తజనంతోపాటూ కొద్దిమంది పోలీసులు, వారికి తోడుగా సైనికాధికారులు సైతం ఫేస్‌బుక్‌లో నాతో ఇలానే వాదిస్తుంటారు.

ప్రభుత్వం, నక్సలైట్లు ఇద్దరూ సమానమేనని అనుకోవడం లేదు.

ప్రభుత్వ క్రూరత్వాన్నీ, అత్యాచారాల్నీ ప్రశ్నించడానికి ప్రతిసారీ పక్కన నక్సలైట్లను పెట్టి నిందించనవసరం లేదు.

రాజ్యాంగబద్ధమయిన రాజకీయాల్ని సమర్థిస్తానని నేను స్పష్టంగా ప్రకటించాను.

కాబట్టీ ప్రభుత్వం చేసిన అక్రమాల్ని వెల్లడించే ప్రతీసారీ అదే విషయాన్ని పదేపదే ప్రకటించాల్సిన పనిలేదు.

నేను ప్రభుత్వానికి పన్ను కడతాను, ఓటు వేస్తాను, కోర్టుకి వెళతాను, అంటే దానర్థం నేను విధులు సక్రమంగా నిర్వర్తించేవారి లెక్కలోకే వస్తాను.

నా వోటు నుంచీ, నేను కట్టే పన్ను నుండీ జీతాలు తీసుకుంటున్న సైనికులు, పోలీసులు ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు చేస్తుంటే అందుకు అభ్యంతరం వ్యక్తం చేసే హక్కు నాకు లేదా?

అలా నా వోట్లతో ఎన్నికయిన నాయకుల ప్రోద్బలంతో, అలా ఏర్పడిన ప్రభుత్వ సైన్యం నేను కట్టిన పన్నుల ద్వారా ఆయుధాలు సమకూర్చుకుని, యూనిఫారాలు వేస్కుని, జీతాలు తీసుకుంటూ, నా దేశపు ఆదివాసీ మహిళల్ని బలాత్కరించడాన్ని వ్యతిరేకిస్తేనే, నువ్వు ముందు నక్సలైట్లకు వ్యతిరేకంగా మాట్లాడు లేకపోతే నిన్ను కూడా మేము నక్సలైటు సానుభూతిపరుడని గుర్తిస్తాం అనడానికి లేదు.

బజారులో సైనికుడొకరు జేబు కత్తిరిస్తున్నాడనుకుందాం. అతడిని పట్టుకు ప్రశ్నిస్తే, అతడు ఎదురు తిరిగి ముందు లోకంలోని జేబులు కత్తిరించే వారందర్నీ తిట్టు, తర్వాత మాత్రమే నన్నేదయినా అను, అనడానికి లేదు.

ప్రజల భూమిని తుపాకీ బలంతో లాక్కోడం ప్రభుత్వాలకలవాటైన పాత పద్ధతే, నక్సలైట్లు లేనప్పుడు కూడా ఆ పని జరిగింది.

ఈరోజుకీ, నక్సలైట్లు ఎక్కడైతే లేరో అక్కడ పోలీసులు, తుపాకుల బలంతోటే భూమి గుంజుకోబడుతోంది.

దేశ రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న బట్టాపర్సోల్ ప్రాంతంలోకూడా భూమికోసం రైతుల ఇళ్ళను తగలబెట్టడం జరిగింది.

ప్రభుత్వమే అన్యాయానికి దిగితే దానర్థం మొత్తం వ్యవస్థ అన్యాయాన్ని ఆశ్రయించడమనే.

మీరు, మీ సైనికులు చేస్తున్న అత్యాచారాల్ని వ్యతిరేకించడం లేదంటే, వాట్ని ఖండిస్తూ ఒక్కమాటైనా అనడం లేదంటే, ఆ బలాత్కారాల్నీ, అత్యాచారాల్నీ, మీరు సమర్దిస్తున్నారని అర్థం.

అత్యాచారాల్నీ వ్యతిరేకించేందుకు పౌరులెవరి మీదా ప్రత్యేక నియమాలేవీ రుద్దబడవు.

ప్రభుత్వ అత్యాచారాల్ని మీరు కనక వ్యతిరేకించారంటే మిమ్మల్ని మేము నక్సలైటు సానుభూతిపరులుగా గుర్తిస్తామని మీరు పౌరులతో బొత్తిగా చెప్పలేరు.

అందుకే మీరు కేవలం నక్సలైట్లకి వ్యతిరేకంగా మాట్లాడమంటారంతే. ఈలోపల సైనికులు అదానీ, అంబానీల కోసం భూముల్ని లాక్కుంటూ అమాయకులయిన ఆదివాసుల తలలు తూటాలతో తూట్లు చేస్తూ, వారి భార్యాబిడ్డల్ని, అక్కచెల్లెళ్ళనీ బలాత్కరిస్తూంటారు.

మీరు కనుక దంతెవాడ బాలికోన్నత పాఠశాలలో సి.ఆర్.పి.ఎఫ్. చేసిన దుశ్చర్యలకి ఆశ్చర్య చకితులైతే మీకు మరికొంత సమాచారం అవసరం.

ప్రపంచంలోని ఎక్కడయినా ఒక ప్రత్యేక కార్యం కోసం నిర్దిష్ట ప్రాంతాలకి తరలించబడ్డ సాయుధ బలగాలు అక్కడి మహిళల మీద లైంగిక దోపిడీ చేస్తారు.

విభిన్న ప్రాంతాల్లో దీనికి కారణాలు కొద్దిగా వేరు కావొచ్చు.

అలాగే ఆయా పరిస్థితుల్ని బట్టీ స్త్రీలపై జరిగే లైంగిక దాడుల్లో ఎక్కువ తక్కువలుంటాయి.

శత్రువులెప్పుడైనా దేశంమీద దాడి చేసినప్పుడు వాళ్ళకి బుద్ధి చెప్పడానికని సైన్యం బలాత్కారాలకి పాల్పడుతుంటుంది.

ఇతర దేశాల స్త్రీలపై అత్యాచారాలు చేయడం సైనికుల వీరత్వానికీ, దేశభక్తికీ చిహ్నంగా చూడబడుతోంది.

సైనికులు వారు చేసిన అత్యాచారాల గురించి సన్నిహితులతో చాలా గర్వంగా చెబుతుంటారు.

బంగ్లాదేశ్ ఏర్పడ్డానికి ముందు పాకిస్తాన్ సైన్యం చేతుల్లో బంగ్లా స్త్రీలు పెద్ద ఎత్తున అత్యాచారాలకి గురయ్యారు.

దేశంలోపల కూడా స్త్రీలపై సైనిక బలగాలు లైంగిక దాడులకు పాల్పడతాయి.

ఈ దేశంలో దేశభక్తనేది అగ్రకులాలకీ, ఉన్నత వర్గాలకి చెందిన కొద్దిమంది పురుషుల చేతుల్లోనే ఉంటుంది.

అందుకే ఎప్పుడైనా భారతీయ కార్మికులు, దళితులు, ఆదివాసులు, చేసే పోరాటాలని దేశద్రోహంగా ఎంచి వారిపై దాడులకు తెగబడతారు.

దేశద్రోహులకి ఎలాగైనా బుద్ధి చెప్పాలనే మత్తు సైన్యానికి ఎంతలా ఉంటుందంటే సొంత దేశానికే చెందిన ఆదివాసుల్ని, దళితుల్ని చంపడం, మాయం చేయడం, వారి మహిళలపై అత్యాచారాలు చేయడం దేశరక్షణ కోసమని భ్రమించడం జరుగుతుంది.

అందుకనే అత్యాచారాలు చేసిన సైనికుల్ని కాపాడ్డానికి మొత్తం ప్రభుత్వం దిగొస్తుంది. జరిగిన అత్యాచారాలు, హత్యలకంటే ఇదే ప్రభుత్వాన్ని ఎక్కువ బాధిస్తుంది.

ఏ సమూహంలోనయితే పురుషులు చావుకి భయపడటం మానేస్తారో సైన్యం ఆ సమూహపు స్త్రీలమీద అత్యాచారాలు చేయడం ద్వారా భయపెట్టాలనుకుంటుంది.

అదీకాక ఎంతోకాలం నుండి కుటుంబాలకి దూరంగా ఉండే సైనికులు లైంగిక కాంక్షలతో ఉంటారు.

సైనికులు వారి కామప్రకోపాల్ని సంతృప్తిపర్చుకోడానికి వారు పంపబడిన ప్రాంతపు మహిళల్నే బలిపశువులు చేసుకుంటారు.

సుదీర్ఘకాలం నుండి సైన్యం విడిదిచేసిన ఏదైనా ప్రాంతానికి కనుక మీరెళితే, అక్కడ ఎంతోమంది మహిళలు బలవంతంగా వేశ్యలుగా మారినవారు కనిపిస్తారు.

సాయుధ బలగాలు ఆ సముదాయంలోని పురుషుల్ని తప్పుడు ఆరోపణలతో భయపెట్టి, బెదిరించి వారి స్త్రీలపై దౌర్జన్యాలు చేస్తారు.

మన మాజీ సైన్యాధ్యక్షుడు విక్రమ్‌సింహ్ కాంగోలో సంయుక్త దేశాల శాంతి సంఘంలో నియమితులైనప్పుడు అతని మీద అత్యాచార ఆరోపణలొచ్చిన విషయం మీకు గుర్తుండే ఉంటుంది.

ఆ విషయంలో సుప్రీంకోర్టు సిగ్గుచేటైన తీర్పునిస్తూ, ఆ సమయంలో ఆయనక్కడ భారత సైన్యం కోసం పనిచేయడం లేదు కనుక భారతీయ చట్టాలు ఆ నేరాన్ని విచారించలేవని చెప్పింది.

ఈ విషయంలో నేను కాంగోలోనే ఉండొచ్చిన మరో సైనికాధికారితో మాట్లాడటం జరిగింది.

ఆయన మాట్లాడుతూ, అక్కడసలు అత్యాచారాలు చేయాల్సిన అవసరమే లేదు. ప్రతి స్త్రీ ఎంత పేదరాలంటే, మేం తిని వదిలేసిన ఆహారం పోగుచేసుకు కడుపు నింపుకునేవారు. ఒక్క డాలరు కోసం శరీరాన్ని అమ్ముకోడానికి సిద్ధపడేవారు, అన్నాడు.

మన సైన్యం స్త్రీలని కేవలం అవసరానికి పనికొచ్చే వస్తువులుగా భావించడం చూసి నా తల సిగ్గుతో వాలిపోయింది.

బాగా వెనుకబడిన, పేదరికంలోనున్న వ్యవస్థపై సైన్యం మరింత బలప్రయోగం చేస్తుంది.

ఏ సమాజమయితే విద్యాబుద్ధులు నేర్చి కొద్దోగొప్పో చదూకున్న వాళ్ళతో ఆర్థికంగా కాస్త బలంగా ఉంటుందో అలాంటిచోట మహిళలపై దాడులు తక్కువ జరుగుతుంటాయి.

అదే ఏ సమూహాన్నయితే శత్రువులుగా, దోషులుగా చిత్రించడం జరుగుతుందో అక్కడి స్త్రీపై పీడన చాలా దారుణంగా, గరిష్టంగా ఉంటుంది.

కాశ్మీరు, ఈశాన్య రాష్ట్రాల్లో భద్రతా దళాలు అక్కడి మహిళలపై చేసిన దౌర్జన్యాలు, అత్యాచారాల గురించి ఈ దేశ పత్రికల్లో కూడా వార్తలు రావు.

అసలు సంగతేంటంటే మనం మన సైనికుల్ని చేజేతులా క్రూరులుగా తయారుచేస్తున్నాం.

ఎందుకంటే ఈ సైన్యం ద్వారానే శత్రువులకి బుద్ధిచెప్పగలమని మనం అనుకుంటున్నాం.

ఇంతకీ మన శత్రువులంటే ఎవరు?

దళిత బహుజన ఆదివాసీ మైనారిటీ బీద కార్మికులే మన శత్రువులని చెప్పడం జరిగింది.

సమాజంలో ఇదో సంక్లిష్టమయిన లోతైన సమస్య. దీనిని సరిగా అర్థం చేసుకుంటేకాని పరిష్కరించలేం.

సీత ఓడిపోతే, గెలిచేదెవరు?

సీతకి సుమారుగా పదిహేడేళ్ళుంటాయి. సాయంత్రం వాళ్ళ ఇంట్లో అంట్లు తోముకుంటోంది. ఇంతలో సల్వాజుడుం, సాయుధ సైన్యం గ్రామం మీద దాడి చేసాయి. గ్రామస్థులు ప్రాణభయంతో అడవిలోకి పారిపోయారు. సీత తల్లిదండ్రులు కూడా ఇంట్లోనే ఉన్నారు. నలుగురు ఎస్పీవో (ప్రత్యేక పోలీసాఫీసర్లు) ఇంటిపై దాడి చేసారు.

ఒక పోలీసు సీత జుట్టు పట్టుకుని లాక్కెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాడు. సీత అమ్మానాన్నలు కూతుర్ని కాపాడుకోడానికి ప్రయత్నించారు. ఇద్దరు పోలీసులు వాళ్ళని తుపాకీ మడమలతో కొట్టిపడేసారు. అప్పుడో పోలీసు సీత గింజుకుంటుండగా బలవంతంగా బుజాన్నేసుకుని గదిలోకి తీసికెళ్ళిపోయాడు. నలుగురూ కల్సి తలుపులు మూసేసారు. ముసలి తల్లిదండ్రులు తలుపులు బాదిబాది మొత్తుకున్నారు. కన్నకూతుర్ని వదిలేయమంటూ ఏడుస్తూ ప్రార్థించారు.

నలుగురు పోలీసులు సీతపై అత్యాచారం చేసి ఆమె ముక్కుపుడక, చెవిదుద్దులు ఊడబీక్కున్నారు. సీత తండ్రి ఎద్దుల్ని కొనడానికని ఇంట్లో దాచిన 10,000 రూపాయలు లూఠీ చేసారు. కింద అపస్మారకంగా పడున్న సీతనలాగే వదిలి ఆ నలుగురూ మరో ఇంటికి వెళ్ళిపోయారు.

సీత ధైర్యం గల అమ్మాయి. మర్నాడుదయం జరిగినది రిపోర్టిస్తానని వాళ్ళ నాన్నతో ఊర్లోని పోలీసు స్టేషనుకొచ్చి చూస్తే, స్టేషన్‌లో ఆమెని బలాత్కరించిన పోలీసులు తిరుగుతూ కనిపించారు. ఆమె అధికారి దగ్గరకి వెళ్ళడం చూసి నలుగురూ తిన్నగా కుర్చీలు తెచ్చుకుని అక్కడే కూర్చున్నారు. సీత జరిగింది మొత్తం అధికారితో చెప్పింది. అంతా విన్న అధికారి, ఆ నలుగురితో వెకిలిగా నవ్వుతూ అక్కడ్నుంచీ త్వరగా వెళ్ళకపోతే ఆమెపై మరోసారి అత్యాచారం జరుగుతుందని బెదిరించాడు.

ఇక చేసేదిలేక సీతా, ఆమె తండ్రీ వెనక్కొచ్చేసారు. ఆమెకి ఎలాగో మా గురించి తెల్సి ఆశ్రమానికొచ్చింది. మేమామెకి సాయం చేయదల్చి ఎస్‌పికి లేఖ రాసాం. స్పందన లేకపోవడంతో కోర్టులో ఫిర్యాదు నమోదు చేసాం.

కోర్టు నలుగురు పోలీసధికారులకీ సమన్లు పంపింది. వాళ్ళు కోర్టుకి రాలేదు. కోర్టు నలుగురిపై అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఆ నలుగురి పేర్లు : కిచ్చేనందా, విజయ్, మంగళ్, రాజు.

ఈ నలుగురు పోలీసులు పరారీలో ఉన్నారనీ రానున్న కాలంలో కూడా వాళ్ళు దొరికే జాడలేవీ కన్పించడంలేదనీ ప్రభుత్వం కోర్టుకి చెప్పింది. కోర్టు ఏమీ చేయలేక కేసుని పాత కేసుల గదిలో ఉంచమని చెప్పి చేతులు దులుపుకుంది.

ఈలోగా నేను ఢిల్లీవచ్చి హోంమంత్రి చిదంబరాన్ని కల్సి దంతెవాడకొచ్చి ఆదివాసుల సమస్యలు వినాల్సిందిగా సలహా ఇచ్చాను. అలాగే ఈ ఘటనకి సంబంధించిన వివరాలున్న సిడి కూడా ఇచ్చాను.

చిదంబరం దంతెవాడొచ్చి సీతని కలవాల్సిన రెండు వారాల ముందు నిందితులయిన నలుగురు పోలీసుల సహా సైనిక బలగాలు సీతగ్రామంపై బడి సీతతో పాటు అత్యాచారం చేయబడిన మరో నలుగురు అమ్మాయిల్ని మళ్ళీ ఎత్తుకుపోయారు.

పోలీస్ స్టేషన్లో వాళ్ళని అయిదురోజులపాటు రేప్ చేస్తూనే ఉన్నారు. ఈమాటు వాళ్ళని కొడుతూ తిండికూడా పెట్టకుండా అయిదురోజులపాటు అత్యాచారం చేసారు.

విషయం తెల్సిన వెంటనే నేను చిదంబరానికీ, దేశ హోంశాఖ సెక్రటరీకి, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ముఖ్యకార్యదర్శికి, రాష్ట్ర ప్రధాన పోలీసధికారికీ, దంతెవాడ కలెక్టర్‌కి, ప్రధాన పోలీసధికారికి ఫోన్‌చేసి ఆ ఆదివాసీ అమ్మాయిల్ని కాపాడమని ప్రార్థించాను. కానీ ఒక్కరు కూడా కాపాడలేదు.

అయిదు రోజుల తదనంతరం సీతతో సహా అత్యాచారం చేయబడ్డ వారందర్నీ జీపులో తీసుకువచ్చి గ్రామకూడలిలో విసిరేసి, మళ్ళీ ఎవరయినా హిమాంశుతో మాట్లాడితే గ్రామాన్ని తగలబెడతామని బెదిరించి పోయారు.

ఇది జరిగాక నేనా గ్రామానికి వెళ్ళాను. నా వెనక పోలీసు జీపు వచ్చింది. గ్రామస్తులు నాకు ఏడుస్తూ చేతులు జోడించి వారికి సాయం వద్దనీ నన్ను తిరిగి వెనక్కిపొమ్మని వేడుకున్నారు.

ఈ రకమయిన అత్యాచారాలు ఇప్పటికీ బాహాటంగానే జరుగుతున్నాయి. కొత్త అమ్మాయిల్ని బలాత్కరిస్తున్నారు. కిందటేడు మరో 3 గ్రామాల్ని తగలబెట్టేసారు. ఆ గ్రామాలకి సాయం చేయడానికని స్వామి అగ్నివేశ్ ఆహార సామాగ్రిని తీసుకొస్తే ఆయన మీద దాడి జరిగింది. రేప్ చేసిన పోలీసులంతా స్టేషన్‌లోనే ఉన్నారు. ప్రతినెలా దివ్యంగా జీతాలు, ఇంక్రిమెట్లు కూడా తీసుకుంటున్నారు. అయినా ప్రభుత్వం కోర్టుకి వాళ్ళు పరారీలో ఉన్నారని చెబుతుంది.

సీత, ఆమెతోపాటూన్న స్నేహితురాళ్ళు ఇప్పుడు ఎక్కడున్నారో, ఎలా ఏ పరిస్థితుల్లో ఉన్నారో నాకు తెలీదు. కానీ ఈ పోరాటంలో సీత ఓడిపోలేదు, ఈ దేశ ప్రజాస్వామ్యం ఆమె స్థైర్యాన్ని దిగజార్చింది.

వీరత్వ పురస్కారం

దంతెవాడలో పనిచేస్తున్నప్పుడు మాతోపాటు ఆశ్రమంలో పనిచేసే ఒక కుర్రాడుండేవాడు. అతడు గతంలో సల్వాజుడుంలో పనిచేసేవాడని మావాళ్ళు చెప్పారు. కానీ తర్వాత అతనికి ఆ పనిపై వ్యతిరేకభావం పెరిగి గ్రామాలకేదయినా మంచి చేయాలని మాతో కలిసున్నాననేవాడు. అతడు తననుభవాలు కొన్నింటిని నాతో చెప్పాడు. వాటిల్లో వో రెంటిని మీతో పంచుకుంటాను.

ఒకసారి సల్వాజుడుం పోలీసులు, సిఆర్‌పిఎఫ్‌తో కల్సి ఒక గ్రామంపై దాడి చేసారు. గ్రామస్తులు అడివిలోనికి పారిపోతున్నారు. సైన్యం ఇల్లిల్లూ వెతికి ఆదివాసుల్ని చంపుతోంది. ఈ అబ్బాయి కూడా ఒక ఇంట్లోకి చొరబడి తలుపులు బద్దలుకొట్టాడు.

లోపల ఆదివాసీ కుటుంబం ముగ్గురు పసిపిల్లలతో బిక్కుబిక్కుమంటూ ఏడుస్తూ కూర్చున్నారు. పిల్లల ఏడుపు బయటికి రాకుండా వాళ్ళ నాన్న చెయ్యి అడ్డం పెడుతున్నాడు.

అలా చెప్తూ ఆ అబ్బాయి "గురూగారూ మామూలుగానైతే నేను అందర్నీ చంపేసేవాడ్ని. కానీ ఆరోజు నాకెందుకో ఆ పసిపిల్లలతో సహా మరణించిన వాళ్ళ మృతదేహాల్ని ఊహించుకుంటే కళ్ళు తిరిగాయి. నేనా తండ్రితో నెమ్మదిగా వెంటనే అడివిలోకి పారిపొమ్మని చెప్పాను. నేను వాళ్లని వెనకనుండి కాలుస్తానేమోనని భయపడ్డారు. కానీ నేను గట్టిగా అరిచాను, దాంతో వాళ్ళు బిడ్డల్ని తీసుకుని పారిపోయారు.

ఇంతలో మావాళ్ళ చేతికి ఒక ఆదివాసీ వృద్ధుడు చిక్కాడు. అతడ్ని వరండాలో కట్టివేసి వివరాలడగసాగాం. ఒక పోలీసు, ఇదంతా వృధాప్రయాసనీ ఆ ముసలాడి వల్ల ప్రయోజనం ఏమీ లేదని వాడ్ని చంపేయమన్నాడు. మాలోనే ఒహడు అక్కడున్న గొడ్డలి తీసుకుని వృద్ధుడి మెడ నరికేసాడు. అతడి తల కిందికి వాలిపోయింది.

అక్కడ్నే మా వాళ్ళ చేతికి ఇద్దరు ఆదివాసీ యువతులు చిక్కారు. అందులో ఒకమ్మాయి జ్వరంతో ఉంది. మరో ఆమె పడుకునుండగా పారిపోయిన వాళ్ళ కుటుంబానికి ఆమెని లేపేంత సమయం చిక్కలేదు. వాళ్ళిద్దర్నీ పోలీసులు, సైనికులు ఒకింట్లోకి తీసుకెళ్ళారు. బయటకి ఆ అమ్మాయిల ఏడుపులు, అరుపులు సైనికుల నవ్వులు వినిపిస్తున్నాయి. ఇంతలో మా అధికారి వచ్చి ఏం జరుగుతోందన్నాడు. వాళ్ళిద్దర్నీ తీసుకురమ్మన్నాడు. తర్వాత వాళ్ళ జుట్టుపొట్టిగా కత్తిరించి, మా దగ్గరున్న నక్సలైట్ల యూనిఫారాలు నగ్నంగా వణుకుతున్న ఆ అమ్మాయిలిద్దరికీ తొడిగి, వారి చేతులకి తుపాకులిచ్చి ఫోటోలు తీసి, వాళ్ళిద్దర్నీ పోలీసు స్టేషనులో కస్టడీలోఉంచాం. రెండు వారాలదాకా కస్టడీలో చిత్రహింసలు పెట్టి తర్వాత కోర్టులో ప్రవేశపెట్టాం. వాళ్ళు నక్సల్సని నమ్మిన జడ్జి ఇద్దరికీ కారాగార శిక్ష విధించాడు.

(విజ్ఞప్తి : నేను ఈ ఇద్దరమ్మాయిల కుటుంబాల్ని తీసుకుని జెఎన్‌యులో సమావేశం ఏర్పాటు చేసాను. కొన్ని నెలల తర్వాత ఢిల్లీలో ఒక విలేకరుల సమావేశం పెట్టి జరిగిన సంగతులు ఆ కుటుంబ సభ్యులు చెబుతుంటే అక్కడున్న ప్రతీ జర్నలిస్టు కంట్లోనూ నీళ్ళు తిరిగాయి. కానీ మర్నాడు ఆ వార్తని ఏ ఒక్క పత్రికా ప్రచురించలేదు. నేను దంతెవాడలోనుండగా ఆ ఇద్దర్లో ఒకమ్మాయికి జామీను ఇచ్చి బయటికి తీసుకొచ్చాను. తర్వాత నేను చత్తీస్‌ఘడ్ వదిలి రావాల్సి వచ్చింది. ఆ రెండో అమ్మాయి ఇంకా జైల్లోనే మగ్గిపోతోందని అనుకుంటున్నాను.)

అతను మరో సంఘటన చెప్పాడు! ఒకసారి తెల్లవారుజామునే మేం కూంబింగ్‌కి బయలుదేరాం. ఒక గ్రామం పొలిమేరల్లో పంటచేలకి కాపలా ఉండే అయిదుగురు ముసలాళ్ళు మంటపెట్టి చలికాచుకుంటున్నారు. ఒక్కసారిగా నలుదిక్కుల్నుంచీ

పోలీసులొచ్చేసరికి ఏంచేయాలో తోచక పరిగెత్తడం మొదలెట్టారు. పోలీసులు వాళ్ళపై కాల్పులు జరపగా ముగ్గురు అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఇద్దరు తప్పించుకుని అడివిలోకి పారిపోయారు.

మా కాల్పుల శబ్దాలకి అప్పటికే గ్రామం అంతా ఖాళీ అయిపోయింది. ఎంత వెతికినా గ్రామంలో ఎవరూ దొరకలేదు. ఎస్పీ ఆదేశాల మేరకు మేం ఆ వృద్ధుల మృతదేహాలకు మా దగ్గరున్న నక్సల్ యూనిఫారాలు తొడిగి, వాళ్ళ పక్కన తుపాకులుంచి, పక్కన ఎస్పీసార్ నిలబడి ఉండగా ఫోటోలు తీసాం. తర్వాత గ్రామంలోని ఒక ఎడ్లబండిలో ఆ శవాల్ని జిల్లా కేంద్రానికి తరలించాం.

అక్కడ ఎస్.పి. సార్ ఫోన్లో విలేఖరులందర్నీ పిల్చి, సమావేశం పెట్టి ఇలా చెప్పాడు : గాలింపు చర్యల్లో భాగంగా స్పెషల్ పార్టీ పోలీసులకి పేద్ద నక్సలైట్ల దళం ఎదురైంది. లొంగిపొమ్మని హెచ్చరిస్తున్నా వినకుండా పోలీసులపై దాడికి దిగింది. తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు పొజిషన్స్ తీస్కుని నక్సలైట్లకి గట్టిగా జవాబిచ్చారు. సుమారు రెండు గంటలపాటు భయంకరంగా జరిగిన కాల్పుల్లో పోలీసులు అద్భుతమయిన వీరత్వాన్నీ, నైపుణ్యాన్నీ ప్రదర్శించారు. ఎస్.పి.గారి నేతృత్వంలో జరిగిన ఈ ఎదురు కాల్పుల ఘటనలో భద్రతాదళాల చేతిలో ముగ్గురు మావోయిస్టులు మరణించారు.

ఈ వార్త ప్రముఖ వార్తాపత్రికలన్నింటిలోనూ ప్రచురితమయింది. రాష్ట్రప్రభుత్వం ఎస్.పి. పేరుని రాష్ట్రపతి వీరత్వపురస్కారానికి పంపడం జరిగింది. మరుసటి సంవత్సరమే విధి నిర్వహణలో ఎస్.పి. సార్ చూపిన చొరవకూ, ధైర్యానికీ ఆయనకి రాష్ట్రపతి పోలీసు వీరత్వ పురస్కారం ప్రదానం చేయడం జరిగింది.

కోశి

కోశి ఒక ఆదివాసీ అమ్మాయి. మమ్మల్ని కలిసే నాటికి ఆమెకి పదహారో మహా ఐతే పదిహేడో ఏళ్ళుంటాయి. ఆమె ఇంటిని పోలీసులు కాల్చేసారు. వాళ్ళ కుటుంబం అడవిలో రహస్యంగా ఉంటోంది. సల్వాజుడుం, పోలీసులు కల్సి గ్రామాన్ని తగలబెట్టారని గ్రామస్తులు అంటారు.

ఆమె గ్రామం పేరు విరాన్‌పాడ్. ఇళ్ళన్నీ తగలబడ్డాయి. చెట్లనున్న చింతకాయలు, జామకాయలు రాలి తినేవాళ్ళెవరూ లేక నేలమీదే కుళ్ళిపోతున్నాయి. సరిగ్గా పంటలు చేతికొచ్చేనాటికి సల్వాజుడుం, పోలీసులు పొలాల్ని తగలబెట్టడం వల్ల పచ్చదనం ఏదీ మిగల్లేదక్కడ.

అడివిలో దాక్కున్న అమ్మా, చెల్లెలి ఆకలిని చూసి కోశి తట్టుకోలేకపోయింది. గ్రామంలో పక్వానికొచ్చిన చింతకాయలు కోసుకుని 40 కిలోమీటర్ల దూరంలో నున్న ఆంధ్రలోని చర్ల బజారులో వాటిని అమ్మి, అమ్మా చెల్లికోసం బియ్యం తీసుకురావడానికి నిర్ణయించుకుంది.

గ్రామంలోకి వెళ్ళి చింతకాయలు రాలుస్తుండగా వాహనాల రొద వినిపించింది. మధ్యమధ్యలో ఆదివాసీలు గ్రామంలోకి వచ్చేస్తారనే అనుమానంతో పోలీసులు, సల్వాజుడుం అకస్మాత్తుగా తనిఖీలు చేస్తుంటారు.

కోశి పరిగెత్తాలనుకునే లోగానే సల్వాజుడుం, పోలీసులు కాల్పులు ప్రారంభించారు. ఆమె చేతులు పైకెత్తి నేను పారిపోను, కాల్చకండని చెబుతున్నా వినిపించుకోకుండా కాల్చారు. కోశి శరీరంలోకి రెండు తూటాలు దూసుకుపోయాయి.

కిందపడి వున్న కోశిని అలాగే సల్వాజుడుం, పోలీసులు ప్రశ్నించారు. తండ్రిపేరు తదితర వివరాలడిగి చింతకాయలుకోసుకోడానికి వచ్చానంటే వెకిలి నవ్వులు నవ్వుతూ, ఇంకా చింతపండు కావాలా? అని ఆటపట్టించారు.

అలా గాయాలతోనే స్టేషన్‌కి తరలించబడిన కోశిని మర్నాడు కోర్టులో ప్రవేశపెట్టారు. ఆమె నక్సలైటనీ, పోలీసులపై దాడి చేసిందనీ, ఎదురుకాల్పుల్లో గాయపడిందని చెప్పారు. కోర్టు ఆమెను జైలుకి పంపే ముందు చికిత్స చేయించమని ఆదేశించింది.

కోశి జైలులో రెండేళ్ళపాటు ఉంది. కోర్టులో ఆమెపై చేయబడిన ఆరోపణలేవీ రుజువు కాలేదు. దంతెవాడలోని జిల్లా కోర్టు కోశిని విడుదల చేసింది.

మా సంస్థ కోశిగ్రామాన్ని పునర్నిర్మాణం చేసే పని మొదలుపెట్టింది. నా భార్యా పిల్లలకి కోశి స్నేహితురాలయింది. మా ఆశ్రమానికి వచ్చేది. ఒకసారామె మా కార్యకర్తలతో కల్సి వినాయక్‌సేన్ విడుదల కోసం చేసిన సత్యాగ్రహంలో పాల్గోడానికి రాయ్‌పూర్ కూడా వచ్చింది.

కోశి చేతిమీద బుల్లెటు గాయం చేసిన మచ్చ ఉంది కానీ ఆమె మనసులో మాత్రం ఏ మచ్చాలేదు. ఆమె తన వయసు పిల్లలందరిలాగానే స్వచ్ఛంగా, నిష్కల్మషంగా నవ్వుతూ తుళ్ళుతూ ఉంటుంది. ఆమెకి ప్రభుత్వమన్నా, పోలీసులన్నా కోపం కూడా లేదు. తనపై జరిగిన దాడిని గురించి ఎవరయినా అడిగితే నవ్వుతూ జరిగిందంతా చెబుతుంది. నవ్వుతూనే చేతిమీదనున్న తూటా మచ్చని చూపిస్తుంది. బహుశ కోసి ఇంకా అడవిలో ఏదోచోట నవ్వుతూనే ఉండుంటుంది.

ఇక్కడ ఢిల్లీలో నాముందు కోశి ఫైలులో తీర్పునిచ్చిన న్యాయమూర్తి ఆమె గురించి రాస్తూ: ముద్దాయి నుండి ఏ విధమయిన ఆయుధాలు స్వాధీనం చేసుకోబడలేదు. ఖాళీ తుపాకులు కూడా ఘటనాస్థలంలో లేవు. ఇందుకు సంబంధించిన సాక్షులు కూడా ముద్దాయి పోలీసులపై కాల్పులు జరుపుతుండగా చూసామని చెప్పడం లేదు. కాన కోర్టు ముద్దాయిని నిర్దోషని తలచి విడుదల చేస్తోంది.

ఈ వ్యవహారమంతా ఎప్పుడూ ఏ పత్రికలోనూ ప్రచురించబడలేదని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదనుకుంటా!

ఈ పిల్లల్ని ఎవరు కాపాడతారు?

చత్తీస్‌ఘడ్‌లోని దంతెవాడ కథయిది. 2005లో ప్రభుత్వం ఆదివాసీ గ్రామాల్ని తగలెడుతోంది. ఈ పని కోసం ప్రభుత్వం అన్ని ప్రాంతాల నుండీ 5000 మంది ఆదివాసీ యువకులకి తుపాకులిచ్చి వాళ్ళకి ఉన్నతస్థాయి పోలీసులకుండే ప్రత్యేకధికారాల్ని కట్టబెట్టింది. గ్రామాల్ని ఖాళీ చేయించడం కోసం వారికి తోడుగా పోలీసుల్ని, స్పెషల్ పార్టీ టీములని, ఆర్మీ ఫోర్స్‌నీ, సిఆర్‌పిఎఫ్ దళాల్నీ, కూంబింగ్ సాయుధ బలగాల్నీ దింపింది. వీళ్ళంతా కల్సి 650 ఆదివాసీ గ్రామాల్ని తగలబెట్టారు. మూడున్నర లక్షలమంది ఆదివాసుల్ని నిర్వాసితుల్ని చేసారు. ఈ ఆదివాసులంతా ప్రాణాలు కాపాడుకోవడం కోసం బిక్కుబిక్కుమని అడివిలో బతుకుతున్నారు.

ప్రభుత్వం ఈ గ్రామాలన్నింటినీ ఖాళీచేసి గంపగుత్తగా పారిశ్రామికవేత్తలకు ఇవ్వాలనుకుంటోంది. ఇందుకోసం ఈ బడాబాబులు ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ మొదలుకుని పోలీసు అధికారులందరికీ పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చారు. త్వరగా ఆదివాసుల్ని అక్కడి నుండి తరిమేయమనీ తద్వారా భూములూ, భూమిలోపలి ఖనిజవనరులు దక్కించుకోవాలని, వాటితో సొమ్ము చేసుకుని ఇంకా కూడబెట్టాలను కుంటున్నారు.

ప్రభుత్వం అడవిలోనున్న మూడులక్షలపై చిలుకు ఆదివాసీలందర్నీ హత్య చేయించేందుకు కార్యక్రమం రూపొందించింది. ఆదివాసుల ఇళ్ళలోని ఆహార ధాన్యాలన్నీ తగలబెట్టేయడం జరిగింది. ఆ ప్రాంతంలోని సరుకులమ్మే బజారుల్నీ, వారాంతపు సంతల్నీ ఆదివాసులు బియ్యం కొనుక్కుతిని బతికేస్తారనే భయంతో పూర్తిగా మూయించడం జరిగింది. ఈ 650 గ్రామాల్లో రేషను దుకాణాలు మొదలుకుని, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రాధమిక ఆరోగ్యకేంద్రాలు అన్నింటినీ ప్రభుత్వం మూసేసింది.

నేనూ నా భార్య వీణ పన్నెండు సంవత్సరాలుగా ఆదివాసీ మిత్రులతో కల్సి ఈ గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. నాకు అడవిలో దాక్కున్న ఆదివాసీ పిల్లల గురించీ బెంగగా ఉండేది. ఈ హత్యాకాండని ఆపించడానికి మావంతు ప్రయత్నం చేసాం. జాతీయ మానవహక్కుల కమిషన్‌కు రాసా, జాతీయ మహిళా కమిషన్‌కు రాసాం, జాతీయ షెడ్యూల్డు కులాలు, జాతుల కమిషన్‌కు రాసాను, జాతీయ బాలల హక్కుల సంరక్షణా కమిషన్‌క్కూడా రాసాను, అయినా ఏ ఒక్కరూ స్పందించి ఈ ఆదివాసులకి మద్దతివ్వలేదు. సాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు.

ఆ తర్వాత పిల్లలకోసం పనిచేస్తున్న యూనిసెఫ్ సంస్థని సంప్రదించాం. అడవిలో దాగి ఉన్న పిల్లల ప్రాణాలు కాపాడాల్సిందనీ, వారి వివరాలు సేకరించాల్సిందని

తెలిపాం. మా సంస్థతో కల్సి యునిసెఫ్ 300 గ్రామాల్లో సర్వే చేయడానికి ఒప్పందం కుదిరింది. ఈ పనికోసం మా కార్యకర్తలకి శిక్షణ ఇచ్చాం. సర్వే దరఖాస్తులు తయారుచేసాం. పర్యవేక్షణా టీమ్‌లని నియమించాం.

మొదటి బృందంలో ముగ్గురు కార్యకర్తలు ఉన్నారు. వాళ్ళకి ఇంద్రావతి నది ఆవలనున్న చింగోర్ అనే గ్రామానికెళ్ళి సర్వే చేసేపని ఇవ్వబడింది. బియ్యం తదితర వాటికోసం ఆదివాసులు నదికి ఇవతలివైపు రాకుండా పెద్దమొత్తంలో పోలీసు దళాలక్కడ పహారా కాస్తుంటాయి. మా సంస్థ కార్యకర్తలయిన కోప మరియు లింగ ఇద్దరూ ఆ టీంని నది దాటించే బాధ్యత తీసుకున్నారు. వార్ని నది దాటించి కోప, లింగా రాత్రే తిరిగి రావాలనుకున్నారు. ఇంతలో నేను పనుండి ఢిల్లీ వచ్చాను. మా బృందం చింగోర్ గ్రామానికి బయలుదేరింది. నది దాటడం మొదలెట్టామని నాకు మెసేజ్ వచ్చింది. రాత్రి లోపులో మా నుండి మీకు మెసేజ్ రాకపోతే కనుక మా కోసం వెతకడానికి ఇతర కార్యకర్తల్ని పంపండని రాసారు. రాత్రిలోపల, ముగ్గురునీ గ్రామంలో వదిలి మేం నది దాటి వచ్చామనీ అయితే నది ఒడ్డున పెట్టిన మోటర్‌సైకిళ్ళు మాయమయ్యాయనే మెసేజొచ్చింది. పోలీసులు మాపై దాడి చేస్తారని భయంగా ఉంది కాన మేం అడవిలో మరోదారిలో ఆశ్రమానికొస్తున్నాం అని పెట్టారు.

మరుసటిరోజు మధ్యాహ్నం రహస్యంగా గ్రామస్తుడొకరొచ్చి సర్వే కోసం మీరు గ్రామానికి పంపిన ముగ్గురు కార్యకర్తల్నీ ప్రత్యేక పోలీసులు పట్టుకుపోయారని కబురందించాడు. అలాగే ఆ సిఆర్‌పిఎఫ్, సల్వాజుడుం జవాన్లు వాళ్ళని ఈ రాత్రికే చంపి శవాల్ని ఇంద్రావతి నదిలో విసిరేయాలనుకుంటున్నారని చెప్పాడు.

నేను వెంటనే గాంధియన్, పార్లమెంటు మెంబరు అయిన నిర్మలాదేశ్‌పాండేకి ఫోన్ చేసాను. వారు వెంటనే తాత్కాలిక హోంమంత్రయిన శివ్‌రాజ్‌పాటిల్‌తో మాట్లాడారు. తరువాత నేను చత్తీస్‌ఘడ్ డిజిపి విశ్వరంజన్‌కి ఫోన్‌చేసి ఆ కార్యకర్తలకి కనుక ఏదయినా జరిగితే తీవ్ర పరిణామాలెదుర్కోవాల్సి ఉంటుందనీ, వాళ్ళు సంయుక్త దేశాల సమితి కోసం పనిచేస్తున్నారని చెప్పాను. పోలీసధికారులు నాకు ఫోన్ చేయడం మొదలుపెట్టారు. అర్ధరాత్రి కార్యకర్తల్నీ, వారి మోటారు సైకిళ్ళనీ కసోలీ సల్వాజుడుం, సిఆర్‌పిఎఫ్ క్యాంపు వద్ద కనుగొన్నారు.

మర్నాటి ఉదయం గాదం పోలీసు స్టేషనుకి మా కార్యకర్తలకోసం వెళ్ళాను ఒకరి చెవి పగిలిపోయింది, మరొకరి వేళ్ళు విరిగిపోయున్నాయి, ఇంకొకరికి పళ్ళు రాలిపోయాయి. ముగ్గురూ నన్ను చూసి పరిగెత్తుకొని వచ్చి నన్ను పట్టుకుని ఏడ్చారు. నేనూ ఏడ్చాను. అప్పుడు మొట్టమొదటి యుద్ధశంఖం పూరించాల్సి వచ్చింది. ఆ రాత్రి సల్వాజుడుం, చత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలకి వ్యతిరేకంగా మొదటిసారి విలేకరుల సమావేశం పెట్టాం. పెట్టిన వారం రోజులలోపే సంస్థ ఆశ్రమాన్ని కూలగొట్టడానికి

ప్రభుత్వం నోటీసులిచ్చింది. యూనిసెఫ్ మా సంస్థతో ఏరకంగానూ సంబంధాలు పెట్టుకోడానికైనా నిరాకరించింది.

తర్వాత కూడా మరో మూడేళ్ళు దంతెవాడలో పనిచేసాను. కానీ కార్యకర్తలపై ఎన్ని దాడులూ, దౌర్జన్యాలూ జరిగాయనంటే, మేము మా కార్యకర్తల, ఆదివాసుల జీవితాల్ని మరింత ప్రమాదంలోకి నెట్టాలనుకోలేదు. అందుకే చత్తీస్‌ఘడ్ నుండి బయటికి వచ్చేసాం.

ప్రశ్నేమిటంటే మన దేశపు పిల్లల్ని మన ప్రభుత్వమే చంపితే ఆదివాసులు ప్రభుత్వంవైపు వస్తారా? నక్సలైట్‌ల వైపు వెళతారా? మేము ప్రభుత్వం పరువు కాపాడ్డానికీ, ప్రభుత్వంపై గౌరవం పెంచడానికే ఎన్నో కష్టాలు పడ్డాం. కానీ, విచారించాల్సిన విషయం ఏమిటంటే మాదనుకున్న ప్రభుత్వమే మాపై దాడి చేసింది.

సోముడు చనిపోయాడు

ఈరోజు దంతెవాడ నుంచి ఫోనొచ్చింది, సోముడు చనిపోయాడనీ! ఎలా చనిపోయాడని అడిగాను. పాము కరిచిందని చెప్పారు. న్యాయం కోసం ఎదురుచూస్తూ సోముడు చనిపోయాడు. ఇంతకీ ఎవరీ సోముడు?

3 సంవత్సరాల క్రితం సంగతి. బైరమ్‌ఘడ్ నుంచి బీజాపూర్ వెళ్ళే దారిలో మాట్‌వాడా పేరుతో ఒక సల్వాజుడుం కేంప్ ఉంది. మార్చి 18, 2008న స్థానిక వార్తాపత్రికలో ఒక వార్తొచ్చింది. దాని సారాంశం ఏమంటే మాటావాడా సల్వాజుడుం కేంప్‌పై నక్సలైట్లు దాడిచేసి ముగ్గురు ఆదివాసీల్ని హత్యచేసారనీ. వార్త నమ్మదగిందిగా అనిపించలేదు. దానికి కారణాలున్నాయి. అది చాలా చిన్న కేంప్, రోడ్డుపక్కన గుడిసెలు వేసుకునే ఆదివాసీలు ఉంటారు. మధ్యలో చిన్న రోడ్డు దానికి ఒకవైపు పోలీస్ స్టేషను, ఆదివాసీ గుడిసెల వెనకే ఆర్.పి.ఎఫ్. కేంపు! కానీ నిజం ఎలా తెల్సుకోవడం? అకస్మాత్తుగా కోపా కనిపించకుండా మాయమైపోయాడు. ఏమైపోయాడోనని నేను కంగారుపడుతుంటే రెండ్రోజులకి ప్రత్యక్షమయ్యాడు. అతని వెంట మరో యువకుడు కూడా ఉన్నాడు. అతడెవరని కోపాని నేనడిగాను. కోపా, మీరే అడగండన్నాడు. అప్పుడా యువకుడు తన హృదయవిదారకర కథ చెప్పాడు. నక్సలైట్లు హత్యచేసారని పత్రికల్లో వచ్చిన ఆదివాసుల్లో ఒకడు తన తమ్ముడనీ, వాళ్ళని నక్సలైట్లు చంపలేదనీ, పోలీసులే హత్య చేసారని చెప్పాడు.

కానీ మేమెప్పుడూ పూర్తి వివరాలు తెల్సుకున్నాకనే రంగంలోకి దిగుతాం. అందుకే నేనాయువకుడ్ని చనిపోయినవారి భార్యలు ఎక్కడున్నారని అడిగాను. క్యాంప్‌లోనే ఉన్నారని చెప్పాడు. వాళ్ళనిక్కడికి తీసుకురావాల్సుంటుందన్నాను. ఆ బాధ్యతనుకోపా

తీసుకున్నాడు. మరుసటి రోజు ఉదయానికి హత్య కావించబడిన ఆదివాసుల భార్యలు ఆశ్రమానికొచ్చారు. వారివెంట కోపా, గ్రామసర్పంచ్, పటేలు కూడా ఉన్నారు. వాళ్ళని విడివిడిగా చేసి అసలేం జరిగిందో వివరించమన్నాను. నా సందేహాలన్నీ తీరిపోయాయి. అందరూ సుమారు ఒకలాగే వివరించి చెప్పారు. అప్పుడర్థమైంది నాకు అది సల్లాజుడుం నివాస శిబిరం కాక, చిత్రవధల శిబిరమని.

3 సం॥రాల క్రితం వాళ్ళ గ్రామంలో 8 మందిని చంపి గ్రామాన్ని తగలబెట్టి గ్రామస్తుల్ని ఈ కేంప్‌లో పడేసారు. అప్పట్నుంచీ వీళ్ళంతా అక్కడే ఉంటున్నారు. ఆరంభంలో ప్రభుత్వ కేంపుల్లో అందరికీ తిండి దొరుకుతుందని చెప్పింది కానీ సల్వాజుడుం నాయకులు దాన్ని వీళ్ళదాకా రానివ్వడంలేదు. కడుపు నింపుకోడం కోసం గ్రామస్తులు రోడ్డు పక్కన కూలిపనుల్లాంటివి చేసుకుంటున్నారు. అయితే దాంట్లో కూడా సగం పోలీసులు, సల్వాజుడుం నేతలే మేసేయసాగారు. ఇక గ్రామంలోకి వెళ్ళి మద్యం తయారుచేయడం, ధాన్యం పండించడం వంటివి చేస్తున్నారు. కానీ చీకటి కాకముందే అంతా కేంప్‌కి వచ్చి పోలీసుల దగ్గర హాజరు వేయించుకోవాలి. బాగా పొద్దుపోయాక వచ్చేవాళ్ళకి దేహశుద్ధి జరిగేది, నక్సలైట్ల సభలకి వెళ్ళొచ్చారు కనుకనే ఆలస్యమయ్యారని ఆరోపించి వారిని కొట్టేవారు. అలా ఒకసారి ఈ నలుగురూ ఆ దెబ్బలకి భయపడి గ్రామంలోనే ఉండిపోయారు. మర్నాడుదయం గప్‌చుప్‌గా ఇళ్ళలోకి వెళ్ళిపోదామనీ ఎవరయినా అడిగితే నిన్న సాయంత్రమే వచ్చేసామని చెబుదామనుకున్నారు. అలాగే చేసారు కూడా. కానీ ఈ విషయం అక్కడున్న ఎస్పీవోలకి ఎలాగో తెల్సిపోయింది. వాళ్ళు అక్కడ పోలీస్ ఇన్‌ఛార్జ్ ఎ.ఎస్.ఐ. పటెల్‌తో కల్సి నిబంధల్ని ఉల్లంఘించిన నేరానికి ఈ నలుగుర్నీ శిక్షించాలని నిర్ణయించారు. తర్వాత పూటుగా మద్యం సేవించి ఈ నలుగుర్ని ఇళ్ళలోకి చొరబడి బయటకి ఈడ్చుకొచ్చారు. వారి భార్యలు అడ్డుకోబోతే వార్ని తుపాకులతో కుళ్ళపొడిచారు. ఈ నలుగురి చేతుల్నీ వాళ్ళ లుంగీలతోనే వెనక్కి విరిచికట్టి రోడ్డుమీద పడేసి తుక్కుతుక్కుగా కొట్టారు. కొంతసేపట్లో నలుగురూ స్పృహకోల్పోయారు. బకెట్టుతో నీళ్ళు తెప్పించి వాళ్ళమీద పోసారు. వారికి కొద్దిగా స్పృహ వచ్చింది. ఆ నలుగురిలో సోముడు కూడా ఒకడు. అంతలో రాత్రయింది. సమయం చూసి సోముడు మెల్లగా లుంగీ విప్పుకుని కుంటుకుంటూ కొంతదూరం వచ్చాడు. అక్కడున్న గ్రామస్తులు తాగడానికి నీళ్లిచ్చి, మేకల మందలో అతన్ని దాచారు. మిగిలిన ముగ్గురు ఆదివాసుల్ని సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకూ కొడుతూనే ఉన్నారు. చివరికి వాళ్ళు శాంతించారు. శిక్షని పూర్తి చేయడానికి కత్తితో ముగ్గురి కనుగుడ్లూ పెకిలించారు. నెత్తిమీద కత్తిపెట్టి పెద్ద రాయితో దానిని మెదడులోనుంచి తలలోకి దిగ్గొట్టారు. తర్వాత మూడు శవాల్ని దగ్గర్లోని నది ఒడ్డున పాతేసారు.

నేను ఆ ముగ్గురు ఆదివాసుల భార్యల్నీ మీడియా ముందు ప్రవేశపెట్టి నిజానిజాలు తెల్సుకోమని అడిగాను, మీరు కూడా అందుకోసం కృషి చేయాలని విలేఖరుల్తో చెప్పాను. తర్వాత ఈ అంశం చత్తీస్‌ఘడ్ హైకోర్టుకెళ్ళింది. ఆ ముగ్గురు మహిళల్ని నేను మా ప్రాంత డి.జి.పి. శ్రీ విశ్వరంజన్‌గారి వద్దకి తీసుకెళ్లాను. నాతో ఆ స్త్రీలని ఇంకేమీ అడగనక్కర్లేదని చెప్పి ఆయన తర్వాత విలేఖరులతో మాట్లాడుతూ ఆ మహిళల భర్తల్ని నక్సల్స్ హత్యచేసి పోలీసులపై నేరారోపణ చేస్తున్నారన్నాడు. ఈ విషయంపై మేథాపాట్కర్ కూడా డి.జి.పి.కి లేఖ రాయగా, ఆయన జవాబిస్తూ, హిమంశు అబద్దాలు చెబుతున్నాడని రాసారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ జరిపిన విచారణలో కూడా పోలీసుల పాత్రపై సందేహాల్ని వెలిబుచ్చింది. ఈ ఘటనలో నిందితులయిన ఎ.ఎస్.ఐ., ఇద్దరు ఎస్.పి.వోలు కటకటాల వెనక్కెళ్ళారు. కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురు మహిళలకీ ఒక్కొక్క లక్షరూపాయిల చప్పున లభించాయి. దెబ్బల కారణంగా సోముడు చెయ్యి, మూడు పక్కటెముకలు విరిగిపోయాయి. అతను తనతోనూ, తనవారిపట్లా జరిగిన దౌర్జన్యానికి గానూ తీర్పులో న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నాడు. కానీ ఈరోజు సోముడు చనిపోయాడనే కబురందింది. అతడితోబాటు అతని నిరీక్షణ కూడా మరణించింది.

సోనిసోరికి సంబంధించి సుప్రీంకోర్టుకి నేను రాసిన లేఖ:

మాన్యులయిన న్యాయాధీశులు,

సర్వోన్నత న్యాయస్థానం,

న్యూఢిల్లీ.

ఈ లేఖ మీకు నేను సోనీసోరీ అనే ఆదివాసీ అమ్మాయి విషయంపై రాస్తున్నాను. ఆమె గుప్తాంగాల్లో దంతెవాడ ఎస్.పి. రాళ్ళు దూర్చిన అంశంపై కేసు మీ కోర్టులోనే జరుగుతోంది. మీ ఆదేశానుసారం ఆమెకి వైద్య పరీక్షలు జరిపి డాక్టర్లు ఆ ఆదివాసీ మహిళ చేసిన ఆరోపణలతో సమ్మతించారు. రిపోర్టుతోబాటూ ఆమె శరీర గుప్తాంగాల్లో నుంచి తీసిన మూడు రాళ్ళను కూడా మీకు పంపించారు.

నిన్న అంటే, 02-12-2011న మీరా రాళ్ళను చూసిన తర్వాత కూడా ఆ ఆదివాసీ అమ్మాయిని చత్తీస్‌ఘడ్ జైల్లోనే ఉంచమని ఆదేశిస్తూ, చత్తీస్‌ఘడ్ ప్రభుత్వానికి ఈ అంశంపై జవాబు చెప్పమని నెలన్నర గడువిచ్చారు.

గౌరవనీయులయిన జడ్జిగారూ, నాకూ ఇద్దరు కూతుర్లున్నారు. ఎవరైనా వార్ని కూడా ఇలాగే చేస్తే నెలన్నర కాదు కదా నిమిషంన్నర సమయం కూడా నేను ఇవ్వలేను. జడ్జిగారు ఒకవేళ ఈ అమ్మాయి మీ కూతురైతే ఆమె గుప్తాంగాల్లో రాళ్ళను చొప్పించినవారికి 45 రోజుల పాటు మీరు గడువిస్తారా? ఇంకా వాళ్ళని మీరు నా

కూతురు గుప్తాంగాల్లో రాళ్ళెందుకు దూర్చారని అడిగి సరే ఇప్పుడు కాకపోతే 45 రోజుల్లో వచ్చి చెప్పండి కంగారేం లేదు, అప్పటి వరకూ నా కూతుర్ని మీ ఇంట్లోనే బంధించి ఉంచుకోవచ్చు, అంటారా?

రాళ్ళు పెట్టించిన దుర్మార్గుడయిన ఎస్పీకి తెల్సు ఆ బద్మాష్‌గాడు ఏం చేసినా రక్షించేందుకు సుప్రీంకోర్టులో కూర్చుని మీరున్నారనీ, అందుకే అలాంటి సిగ్గుమాలిన పనిని బాహాటంగా భయం, బెరుకు లేకుండా చేయగలిగాడు. నిన్నటి మీ ఆదేశం అదే విషయాన్ని నిరూపిస్తూ, ఇలాంటి పనులు చేసేవాళ్ళని బ్రిటీష్‌కాలంలోని కోర్టులెలా కాపాడాయో అలాగే సుప్రీంకోర్టు కూడా కాపాడుతుందని తెలియజేసినట్లయింది.

జడ్జిగారూ, ఈ న్యాయస్థానం ఆ ఆదివాసీ అమ్మాయి రక్షణకోసం ఏర్పాటయ్యిందే కాని బద్మాష్ ఎస్.పి.కోసం కాదు. ఇది ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానం. ఈ దేశంలోనున్న బలహీనుల పక్షాన నిల్చి వార్ని రక్షించడం ఈ న్యాయస్థానం యొక్క ప్రధమ కర్తవ్యం. ఈ దేశంలో దళితులు, ఆదివాసులు, మైనార్టీలు, మహిళలు, మొదలైన బీదబడుగు బలహీనవర్గాల వారున్నారు. మీరిచ్చే ప్రతి ఆదేశం వారి స్థితిగతుల్ని మరింత మెరుగుపర్చడానికి ఇవ్వాల్సి ఉంటుందనే విషయాన్ని మీరు గుర్తుంచుకోవాలి. కానీ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ ఈ బహుజనులందరిపట్లా మీరు నిర్లక్ష్యం వహిస్తూ, వీళ్ళ దుర్గతికి కారణమయిన వార్ని మాత్రం సంరక్షించడం జరుగుతోంది.

నా తండ్రి ఈ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాడు. అలా పోరాడిన సమరయోధులందరి స్వప్నం ఏంటి? స్వతంత్ర దేశపు సర్వోన్నత న్యాయస్థానంలో ఆదివాసీ అమ్మాయిపై అత్యాచారం చేసినవాడ్ని రక్షించే రోజొకటి వస్తుందని వాళ్ళు కలలో కూడా ఊహించి ఉండరు.

చిన్ననాటి నుండి ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉందని నాకు చెప్పడం జరిగింది. అంటే అర్థం కోట్లాది మంది ఆదివాసులు, కోట్లాదిమంది దళితులు, కోట్లాదిమంది అన్నార్తుల స్వామ్యం. కానీ మీ తీర్పులు, ఆదేశాలన్నీ ఈ అత్యధిక శాతం మంది దుర్గతికి కారణమయిన వారి పక్షానే ఉంటున్నాయి. ఒడిసాలోని జగత్‌సింహ్‌పూర్‌లో వారి భూముల్ని కాపాడుకోడానికిగానూ మండుతున్న ఇసుకలో పడుకున్న స్త్రీలు, పిల్లలు కనిపించడం లేదా? వాళ్ళకోసం ప్రశ్నిస్తున్న అభయ్‌సాహు అనే కార్యకర్తని భూమిని లాక్కుంటున్న సంస్థల యజమానుల ఆదేశానుసారం ప్రభుత్వం ఖైదు చేయడం మీకు కనిపించడం లేదా?

మీ న్యాయస్థానంలోనే గోమ్‌పాడ్ అనే గ్రామంలో ప్రభుత్వ సాయుధ బలగాలు నరికేసిన 16 మంది ఆదివాసులకి సంబంధించిన కేసు నలుగుతూ నక్కుతూ నడుస్తోంది. ఆ కేసు గురించి ఆదివాసుల్ని నేను తీసుకొస్తుంటే నాకు ఒక నక్సలైట్ నాయకుడు సవాలు విసిరాడు, "ఆ ఆదివాసుల్ని హత్యచేసిన పోలీసులకి కనుక మీరు న్యాయం చేసి శిక్షింపగలిగితే నేను ఆయుధాన్ని వదిలేస్తాను." కానీ నేను వోడిపోయాను.

ఈ న్యాయస్థానానికొచ్చిన నేరానికి గాను ఆ ఆదివాసీల కుటుంబాన్ని పోలీసులు అపహరించుకుని పోయారు, వాళ్ళిప్పటికీ పోలీసుల అక్రమ నిర్బంధంలోనే ఉన్నారు. మీరు ఇప్పటివరకూ దోషుల్ని శిక్షించకుండా చేసి ఈ దేశ ప్రభుత్వాన్ని గెలిపించలేదు, నన్నూ, మిమ్మల్ని సవాలు చేసిన నక్సలైట్లని గెలిపించారు. ఇక నేను నా దేశపు మహత్తర ప్రజాస్వామ్యం గురించీ, నిష్పాక్షికమైన న్యాయవ్యవస్థ గురించీ ఆ నక్సలైట్ ముందు ఏ మొహం పెట్టుకుని ధంబాలు కొడుతూ డాబులు చెలాయించగలను? అతడు తుపాకీ పట్టుకోడాన్ని ఏ విధంగా తప్పుపట్టగలను?

ఈ దేశంలో ఏకచ్ఛత్రాధిపత్యమో, నియంతృత్వమో ఉండుంటే నాకు సంతోషంగా ఉండేది. నేనా ఆధిపత్యానికి విరుద్ధంగా పోరాడేవాడ్ని కానీ నా దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. కానీ దీంట్లోని వ్యవస్థలు, శాసన కర్తలు, సంస్థాధిపతులు, న్యాయాధీశులు అంతా కల్సి కోట్లాదిమంది ప్రయోజనాల్ని పణంగా పెట్టి సిగ్గూలజ్జా లేకుండా ధనమదంతో కులుకుతున్న కొద్దిమంది పశువుల కోసం పనిచేస్తున్నారు. దీనిని నేను ప్రజాస్వామ్యం కాదు ప్రజల్ని వంచనచేసే స్వామ్యమంటాను. ప్రజాస్వామ్యం పేరిట సాగుతున్న ఈ వంచనస్వామ్యాన్ని ఒక్కరోజుకూడా ఇకపై భరించడానికి నేను సిద్ధంగాలేను.

ఇక నుండీ ఏ పేదవాడ్నీ న్యాయం కోసం మీ కోర్టుకి తీసుకురానని ఈరోజు ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఇకమీదట నేను జనంలోకి వెళతాను, నడుస్తున్న వంచనాస్వామ్యాన్ని కాదని దీన్ని పెకలించి పారేసి నిజమయిన ప్రజాతంత్ర వ్యవస్థను నిర్మించుకునేలా వాళ్ళని ప్రేరేపిస్తాను. అలాంటి సిసలైన ప్రజాస్వామ్య వేదిక అవశరాన్ని ప్రజల మధ్యలో ఉండి వాళ్ళు గుర్తించేలా చేస్తాను.

మీరు కనుక ఆ అమ్మాయికి న్యాయం చేస్తే ప్రభుత్వానికి కోపం వచ్చి మీ ప్రమోషను ఆగిపోతుందని ఆలోచిస్తుంటే, ఒక్కసారి చరిత్ర గుర్తుచేసుకోండి. తప్పుడు తీర్పులిచ్చే న్యాయమూర్తులకి చరిత్రలో స్థానం లేదు. సత్యం మాట్లాడుతున్నాడని సోక్రటీస్‌కు మరణశిక్ష విధించిన న్యాయమూర్తుల పేర్లు ఎంతమందికి గుర్తున్నాయి? జీసస్‌ని దొంగలతోబాటు శిలువ వేయించిన జడ్జిని ఎంతమంది జనం గుర్తుంచు కున్నారు?

ఈ అన్యాయం జరిగిన తర్వాత సోనీసోరీకి చారిత్రాత్మక స్థానం లభిస్తుంది. కానీ చరిత్ర పుస్తకాల్లో మీ పేరు రాసుకోడానికి చిన్న చోటు కూడా లేకుండా చేస్తుంది. అదే మీరు కనుక రాజ్యాంగబద్ధమయిన విధానాన్ని అనుసరించి ఆ ఒంటరి ఆదివాసి మహిళకి న్యాయం చేస్తే అధికారంలోఉన్న వాళ్ళు మీకు పదోన్నతిని కల్పించకపోవచ్చు కానీ మీ దృష్టిలో, మీ కుటుంబం దృష్టిలోనూ, దేశం దృష్టిలోనూ మరింత ఔన్నత్యాన్ని పొందగలుగుతారు.

ఈ లేఖ రాసినందుగ్గానూ మీరు నన్ను అరెస్టు చేయించాలనుకుంటే అందుకు నాకు ఇసుమంత కూడా బాధలేదు. ఎందుకంటే తర్వాత కనీసం నా ఇద్దరు కూతుర్ల కళ్ళలోకి ధైర్యంగా చూసి మాట్లాడగలుగుతాను, సోనీసోరీ సోదరికి జరిగిన అన్యాయంపై అత్యాచారంపై నేను మౌనంగా లేనని చెప్పగలుగుతాను, కన్న కూతురికి అవమానం జరిగితే తండ్రి ఏం చేయాలో సరిగ్గా నేను అదే చేసాను.

అభివృద్ధా, ఆత్మహత్యా?

పోలీసు బలంతో రైతుల దగ్గర భూములు గుంజుకుని కంపెనీలు ఏర్పడతాయి.

అలా రైతుల భూమి లాక్కునేటప్పుడు ఈ ఫ్యాక్టరీల యజమానులు కొత్త పరిశ్రమలొచ్చాక పనులు కల్పిస్తామని రైతుల్ని ఆశపెడతారు.

కానీ స్థానికుల్ని కంపెనీలు పనిలోకి తీసుకోవు. న్యాయబద్ధమయిన వేతనాలు అడుగుతారని భయపడతాయి.

అందుకే కాంట్రాక్టర్లతో బయటనుంచి చవకగా శ్రామికుల్ని తీసుకురమ్మంటాయి.

వాళ్ళయితే కలిసికట్టుగా పూర్తి జీతాలకోసం ఎప్పటికీ గొంతెత్తి అడగలేరు.

ప్రభుత్వం, పోలీసులు, ఈ మొత్తం దోపిడీలో ఫ్యాక్టరీ యజమానులకే వత్తాసు పలుకుతారు.

కార్మికుల పక్షాన ఎప్పుడూ నిలబడ్డం జరగదు.

చత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ దగ్గర మాల్‌పురీ రైతుల వద్ద భూమి లాక్కుని లక్ష్మీ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టడం జరిగిది.

పెట్టేటప్పుడు ప్రతి ఇంటి నుండీ ఒకరికి పనిస్తామన్నారు. కానీ మోసం చేసారు. ఉద్యోగం పేరిట గ్రామస్తులకి చుక్కలు చూపించారు.

గ్రామస్తులు కంపెనీ ముందు ధర్నా చేసారు.

కంపెనీ యాజమాన్యం కిరాయి గూండాల్ని పిలిపించుకుని ఫ్యాక్టరీకి కొద్దిగా నిప్పు పెట్టించుకుంది.

ప్రభుత్వ నాయకులకు, పోలీసులకు, అధికారులందరికీ డబ్బులు పంచేసింది.

ధర్నాకి నేతృత్వం వహిస్తున్న గ్రామంలోని దళిత నాయకుడు వీరేంద్రకురేని జైల్లో పడేయడం జరిగింది.

తర్వాత కంపెనీల ఆజ్ఞ మేరకు ప్రభుత్వం అతడిని నక్సలైట్‌గా రుజువు చేసే పని నెత్తినేసుకుంది.

చత్తీస్‌ఘడ్ మీడియా, టీవీ ఛానళ్ళు కంపెనీ దారిలోనే గ్రామస్తులంతా నక్సలైట్లని గొంతుచించుకుని మరీ అరిచాయి.

ఇంకొంత కాలానికి కాస్త పట్టణాల్లో ఉండే మనమే దేశభక్తులమంటాం.

దేశంలోని గ్రామస్తుల్నీ, బీదల్నీ, దళితుల్నీ, ఆదివాసులందర్నీ నక్సలైట్లనో, టెర్రరిస్టులనో పిల్చి దేశానికత్యంత ప్రమాదకారులుగా చిత్రిస్తాం.

తర్వాత ఈ కోట్లాదిమందిని చంపించడం కోసం మనం సైన్యాన్ని గ్రామంలోకి పంపుతాం.

సరిగ్గా ఇప్పుడు సాయుధ బలగాలని ఆదివాసీ ప్రాంతాలకు పంపుతున్నామే అలాగేనన్నమాట.

గాంధీ ఇదే చెప్పాడు.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం కనుక ఆంగ్లేయుల అభివృద్ధి నమూనాని అనుసరిస్తే ఒకరోజు సొంత మనుషుల మీదే దాడి చేయాల్సిన స్థితి దాపురిస్తుంది.

ఆంగ్లేయులు లోకంలోని దేశాలెన్నింటిలోనో దాడులు చేసారు. ఈ తరహా అభివృద్ధి వలన యుద్ధమే జరుగుతుంది. ఎందుకంటే కోట్లాదిమంది జీవితాల్ని కొల్లగొట్టి, కొద్దిమందికి లాభాలు చేకూర్చే నమూనా ఇది.

ఇలా మెల్లమెల్లగా దేశమంతటా మీరు మంటపెడతారు. తర్వాత అందులోపడి మీరుకూడా కాలి బూడిదైపోతారు.

దేశంలోని సహజవనరులు సమిష్టివని ఒప్పుకోడానికే మీరు సిద్ధంగా లేరు. ఆ సంపదంతటికీ అందరూ సమాన యజమానులు.

అందరికంటే వెనకనున్నవారికే అభివృద్ధి చెందేందుకు మొదట అర్హతా, హక్కు ఉంటాయి.

సమానత్వం, సామాజిక న్యాయం అనేవి మీ దృష్టిలో నక్సలైట్ల పదాలు.

మీకు మీరే మంటల్లోకి దూకి ఆత్మహత్య చేసుకోదలుస్తే, మిమ్మల్నెవరు కాపాడగలరు?

మన ఆర్థిక వ్యవస్థ దోపిడీని అర్థం చేసుకుందాం

మీరు నగరంలో ఉన్న ధనవంతులు.

కానీ జాగ్రత్తగా గమనించండి. మీ దగ్గర నిజానికి ఏమీ లేదు.

అన్నం, కూరలు, పాలు, చేపలు, బంగారం, వజ్రాలు...

మీ దగ్గర కేవలం కాగితపు నోట్లున్నాయి.

వాట్ని మీకు మీరే ముద్రించుకున్నారు.

నిజానికి ఆ కాగితానిది ఒక కాల్పనిక విలువ.

వంద రూపాయిలకి ఎన్ని ధాన్యం, కూరలు, చేపలు, పాలు, బంగారం, వజ్రాలు వస్తాయనే సూత్రం మీదనే దాని విలువ.

మీ కాగితపు నోట్లకి కనుక పప్పులు, కూరలు, చేపలు, పాలు, బంగారం, వజ్రాలు వంటివి మారకం కాకపోతే మీ నోటుకున్న విలువ జీరో అంటే శూన్యం.

అప్పుడు హఠాత్తుగా మీరు బీదవారైపోతారు.

అందుకనే ఎవరైతే వాళ్ళ దగ్గరున్న అసలయిన సంపదని మీ నోట్లతో మార్చుకోడానికి నిరాకరిస్తారో వారిపై దౌర్జన్యం చేయడానికి మీరు సైన్యమూ, ఆయుధాలు పంపుతారు.

బస్తర్ ఆదివాసులు వారి నిజమయిన సంపదయిన భూమిని మీ నకిలీ సంపదనబడే కాగితపు నోట్లతో మార్చుకోడానికి నిరాకరించినప్పుడు సైన్యం ఆదివాసుల్ని చంపడానికి తరలించబడినట్లుగా అనమాట.

గ్రామగ్రామాన నిజమయిన సంపద యజమానులయిన రైతులపై మీ సైన్యాలు ఈ నకిలీ సంపత్తిని తీసుకోమని దాడులు చేస్తున్నాయి.

దీనినే మీరు సరళీకృత ఆర్థిక వ్యవస్థ అంటారు.

కానీ ఇది మొత్తం తుపాకీ బలంతోనే నడవగలదు.

ఎందుకనంటే ఇది పూర్తిగా అశాస్త్రీయ ఆర్థిక విధానం.

ఇది సరైందేనని నిరూపించేందుకు మీ వద్ద ఏ తర్కమూ లేదు.

అందుకే ఈ వ్యవస్థని సవాలుచేసే ఆలోచనల్ని మీరు ఆంతరిక భద్రతపేరుతో అతిపెద్ద సవాలని భావిస్తున్నారు.

మీరు ముందు తుపాకుల బలంతో ప్రజల దగ్గర ఉండే నిజమయిన సంపదని లాక్కుంటారు.

తర్వాత వార్ని మీ నకిలీనోట్లకోసం పనిచేసే స్థితికి దిగజారుస్తారు.

ప్రజలు మీ కాగితపు నోట్లకోసం పనిచేస్తు పడుండడంలోనే ఈ మీ వ్యవస్థ జీవితం ఉంది.

ఈ వ్యవస్థ కోట్లాదిమంది రైతుల, ఆదివాసుల, మత్స్యకారుల, కార్మికుల వ్యవస్థ కాలేదు.

ఇది దోపిడీ వ్యవస్థ.

ఇది ఆయుధాల బలంతోనే సాగగలుగుతుంది.

ఇదెప్పటికీ అహింసాత్మక మార్గంలో మనలేదు.

ఇదెన్నడూ ప్రజాస్వామికంగా ప్రవర్తించలేదు.

ఇందులో నుండి పేదరికం, అసమానత్వం, యుద్ధం, వినాశనం మాత్రమే రాగలవు.

అభివృద్ధి నమూనా

అభివృద్ధి అంటే ఏంటి?

ఇంకా ధనవంతులు కావడం

ధనవంతులు కావడమంటే?

అంటే మన దగ్గర అన్నీ ఎక్కువగా ఉండటం

అంటే ఎక్కువ డబ్బులు, ఎక్కువ భూమి, ఎక్కువ ఇళ్ళూ ఉండటమా?

అవును.

మీరు అభివృద్ధయితే మీ దగ్గరకి ఎక్కువ డబ్బులు వస్తాయి, దాంతో మీరు ఎక్కువ ధాన్యం, కూరలు, భూమి కొనుక్కోవచ్చు కదా?

అవును.

మీ కోసం ప్రకృతి ప్రత్యేకంగా ఎక్కువ భూమి తయారుచేసిందా?

లేదు. అందరికీ సమానంగానే చేసింది.

మరి మీరు ఎక్కువ భూమి తీసుకున్నారంటే దానర్థం అది మరొకరికి న్యాయంగా చెందాల్సినదనేగా?

అవును, కచ్చితంగా

అంటే మీ అభివృద్ధి ఇంకొకరికి న్యాయంగా చెందాల్సినదానిని గుంజుకుంటేనే అవుతుంది.

అవును

మరి మీ అభివృద్ధి ప్రకృతి నియమాల్ని ఉల్లంఘించినది కదా?

అవును, కచ్చితంగా.

ఎవరైతే పొద్దస్తమానం కష్టపడతారో వాళ్ళు అంటే, రైతు కూలీలు కూడా ధనవంతులౌతారా?

లేదు. వాళ్ళు ధనవంతులవలేరు.

అంటే ధనికులవ్వడానికి కష్టపడ్డంతో సంబంధం లేదనమాట?

అవును. దానికోసం తెలివితేటలుండాలి.

వ్యవసాయానికీ, ఇతర శ్రమలకీ తెలివితో పనిలేదని మీరనుకుంటున్నారా?

అవును తెలివీ, బుద్ధీ వాటికి అక్కర్లేదు.

పొలంపని కానీ, మట్టి పని కానీ మీరెప్పుడయినా చేసారా?

లేదు, చేయలేదు.

మరి, ఆయా పనులు చేయడానికి బుద్ధి అవసరం లేదని మీకెలా తెలుసు?

కష్టజీవులకి చదవడం, రాయడం రాదు కదా.

అవునా, మరి వాళ్ళెందుకు చదువుకోలేదు?

ఎందుకంటే వాళ్ళ గ్రామంలో మంచి స్కూల్ ఉండకపోవచ్చు. ఇంకా వాళ్ళు పనిచేయాల్సి ఉండవచ్చు.

అంటే వాళ్ళు నిరక్షరాస్యులుగా పడుండడానికి వాళ్ళ సామాజిక స్థితిగతులు కారణమన్నమాట. అయితే ఇందులో వాళ్ళ తప్పేముంది?

లేదు వాళ్ళ తప్పులేదు.

మరి వాళ్ళ తప్పు లేనప్పుడు వాళ్ళక్కూడా మీలాంటి అభివృద్ధే ఎందుకు ఉండడం లేదు?

ఎందుకంటే వాళ్లు మా పని చేయలేరు కనుక.

రైతులు, కష్టజీవులు చేయలేని ఏ పని మీరు చేస్తున్నారు?

నేను కంప్యూటర్‌లో పని చేయగలను.

ఇంట్లో కూర్చుని కంప్యూటర్ పనిచేస్తే మీరు ధనవంతులయిపోతారా?

అవ్వం, బయట అనేక కంపెనీల్లో పనిచెయ్యాల్సుంటుంది.

అంటే కంపెనీలు మీకు డబ్బులిస్తే మీరు ధనికులవుతారన్నమాట?

అవును, కంపెనీ డబ్బుతోనే నా అభివృద్ధి జరుగుతుంది.

మరి కంపెనీ దగ్గరికి ధనం ఎలా వస్తుంది?

కంపెనీ సరుకుల్ని ఉత్పత్తిచేసి అందులోని సొమ్మునే మాకు చెల్లిస్తుంది.

కంపెనీ సరుకుల్ని ఉత్పత్తి చేయడానికి కావలసిన భూమి, నీళ్ళు వగైరా ఎక్కడి నుండి వస్తాయి?

భూమి, నీరు ప్రభుత్వం కంపెనీకి ఇస్తుంది.

ప్రజలు వారి భూమినీ, నీటినీ ప్రభుత్వంపై ప్రేమతో ఇస్తారా?

లేదు, ప్రభుత్వం పోలీసుల్ని పంపి భూమి, నీరు లాక్కుంటుంది.

అవునా, అయితే ఎవరి నుండయితే ప్రభుత్వం భూమీ, నీరు లాక్కుంటుందో వాళ్ళు కచ్చితంగా ధనవంతులయి ఉంటారేమో కదా?

లేదే, ప్రభుత్వం బీదల నుండి భూమి, నీరూ లాక్కుని కంపెనీకిస్తుంది.

అంటే పేదల భూమిని లాక్కుంటేనే మీ అభివృద్ధి అవుతుందన్నమాట?

అవును కచ్చితంగా.

మీ అభివృద్ధి కోసం బీదల భూమి మీక్కావాలి?

అవును.

బాములు గుంజుకునేందుకు పోలీసులు కూడా కావాలి?

ఆ, మరి పోలీసులు కూడా కావాలి.

నిరాయుధులైన పోలీసులా, సాయుధ బలగాలా?

నిరాయుధులెందుకు, సాయుధులే కావాలి.

అంటే మీ అభివృద్ధికి ఆయుధాలు కూడా కావాలి?

అవును, ఆయుధాలు కూడా కావాలి?

దానర్థం ప్రభుత్వం హింస లేకుండా అభివృద్ధి చేయలేదు?

అవును, చేయలేదు.

అంటే ఈ మీ అభివృద్ధి హింస లేకుండా కాదు?

అవును, కాదు.

ఈ ప్రభుత్వ హింసను మీరు సమర్థిస్తారన్నమాట?

అవును, అభివృద్ధి కావాలంటే మరి హింస ఉంటుంది.

మీరు చేస్తున్న ఈ హింస కారణంగా పేదలు కూడా మీ పోలీసులతో పోరాడితే అప్పుడేం చేస్తారు?

మేం అప్పుడింకా ఎక్కువమంది పోలీసుల్ని పంపుతాం.

పేదలు ఇంకా ఎక్కువగా పోరాడటం మొదలెడితే?

మేం సైన్యాన్ని పంపుతాం.

అంటే మీరు మీ దేశ పేదప్రజలకి వ్యతిరేకంగా దేశ సైన్యాన్ని ప్రయోగిస్తారు.

ఒక దేశంలోని సైన్యం ఆ దేశ బీద ప్రజల్నే చంపితే అది అంతర్యుద్ధం కాదా?

ఆ, మేం అభివృద్ధి కోసం ఏ యుద్ధమయినా చేస్తాం. అందుకే మా అభివృద్ధిని అడ్డుకునేవాళ్ళంతా తీవ్రవాదులేనని మన ప్రధానమంత్రి గారన్నారు.

ఓ, అంటే మీరు అభివృద్ధి కోసం దేశప్రజల మీదనే సైన్యాన్ని ఉపయోగిస్తారన్న మాట?

అవును, కచ్చితంగా ఉపయోగిస్తాం.

ఈ దేశపు అభివృద్ధి కోసం పై వర్గాలవాళ్ళు పేదవారిపై సైన్యాన్ని ప్రయోగించే రోజుని చూడటం కోసమే దేశం స్వాతంత్ర్యం పొందిందా?

అవును, అభివృద్ధి కోసం మేం ఏమయినా చేస్తాం.

బీద ప్రజానీకంపై సాయుధ సైన్యాన్ని పంపుతారా?

కచ్చితంగా పంపుతాం.

మిత్రులారా! ఇదే మన అభివృద్ధి నమూనా. ఇందులో నుండి హింస మాత్రమే జన్మిస్తుంది.

గణతంత్రమంటే ఏమిటి?

గణతంత్రమంటే ఈ గణం యొక్క పౌరులంతా కల్సి తంత్రాన్ని, అంటే వ్యవహారిక కార్యక్రమాల్ని నడుపుతారు. అంటే ఇక్కడ నియంతృత్వము, సైనిక స్వామ్యము పనికిరావు.

ఏ రోజైతే గణతంత్రమని ప్రకటించామో ఆరోజే ఒక దేశానికి జన్మనిచ్చి ఉనికిలోకి తీసుకొచ్చాం.

ఏదైని అస్తిత్వంలోనున్న ప్రాంతానికి భౌగోళిక సరిహద్దులు సమిష్టిగా నిర్ణయించుకుని అందులో ఉండే గణాలన్నీ సమానమేనని ప్రతిపాదించడం జరిగింది.

కుల, మత, జాతి, లింగ, ప్రాంతాలాధారంగా ఎవరిపట్లా బేధభావాలు చూపబడరాదు.

దీనికి సంబంధించిన విధి విధానాలన్నీ రాజ్యాంగం మీద ఆధారపడి ఉంటాయి. ఈ రాజ్యాంగాన్ని ప్రజలే రూపొందించుకున్నారు.

ఇందులో, భారత ప్రజలమైన మేము ఈ రాజ్యాంగ శాసనాన్ని మాకు సమర్పించుకున్నట్టు రాసుంటుంది.

రాజ్యాంగం తన పౌరులందరికీ రెండు విషయాల్లో గ్యారంటీ ఇచ్చింది. మొదటిది సమానత్వం రెండు భద్రత, అంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం, ఇంకా న్యాయం.

అందుకే ఇందులో పౌరులెవరికయినా సమానత్వం మరియు న్యాయం అందజేయడంలో వ్యవస్థ విఫలమయితే ఇక గణతంత్రమనే గ్యారంటీకి అడ్డుకట్ట పడ్డట్లే.

రాజ్యాంగంలోని తమ పీఠికలో రాసుకున్నదేమిటంటే మా ఈ గణతంత్రం సమాజవాదాన్ని ప్రతిపాదిస్తున్నదని.

దేశంలోని సంపదంతా సమాజానికి చెందుతుందని ఉంది. కానీ సంపదంతటినీ వ్యక్తిగతం చేయడం జరుగుతోంది.

ఇది ఘోరమయిన రాజ్యాంగ విరుద్ధ చర్య.

ఒకవేళ సమాజంలోని సంపద, వనరులన్నింటికీ డబ్బున్న ధనికులే యజమానులవ్వడానికి వ్యవస్థ అంగీకరిస్తే దానర్థం రాజ్యాంగంలో రాసుకున్న సమాజవాదం, అంటే సోషలిజాన్ని కాదని పెట్టుబడిదారీ విధానానికి పట్టం కట్టడమే.

ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం పరస్పర విరుద్ధాలు.

పెట్టుబడిదారీ వ్యవస్థ పైకి ఇంకా పైకి మరింత పైపైకి రావడమే లక్ష్యంగా చేసుకుని మిగిలిన వాళ్ళని కిందకి తోస్తుంది. పెద్దపెద్దగా ఎదగడమే పనిగా పెట్టుకుని తక్కిన వాళ్ళందర్నీ దిగజార్చి చిన్నవాళ్ళగానే ఉంచుతుంది.

కానీ ప్రజాస్వామ్యం సమానత్వానికి భరోసానిస్తుంది.

అందుకే పెట్టుబడిదారీ విధానం, ప్రజాస్వామ్యం ఒకే దారిన కల్సి నడవలేవు.

కుటుంబమంతా ఎలా నడుస్తుందో అలా దేశమంతా కల్సి నడవడమే సమాజవాదానికి అర్థం. కుటుంబంలో ఎవరైనా సభ్యుడు మందబుద్ధయితే తనకి తక్కువగా తిండిపెడతామా? అందరికీ సమానత్వం ఉండాలనే కుటుంబం చూస్తుంది.

కానీ దేశంలోపలనున్న బలవంతులే దేశంలోని బలహీనుల భూముల్ని గుంజుకోడానికి సైన్యాన్ని వాడుతున్నారంటే అంతర్యుద్ధం ఆరంభమైందని అర్థం. దేశమంతా ఒక్కటేననే ఐక్యతా నినాదం ఈరోజు ప్రమాదంలో ఉంది.

రామచంద్ర గుహని కూడా నక్సలైటని చంపడానికి సిద్ధపడ్డారు:

ఇప్పుడు దేశంలో ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా గొంతు విప్పే వారందర్నీ నక్సలైట్లు, మావోయిస్టులు, తీవ్రవాదులనే ముద్ర వేసి నోళ్ళు మూయించే దందా నడుస్తోంది.

మన దేశంలో కష్టపడకుండా సుఖంగా విలాసంగా బతకాలనుకునే మధ్య తరగతిలో ఒక వర్గం ప్రభుత్వం చేసే ఈ అబద్ధపు ప్రచారాల్ని నమ్మాలనుకుంటోంది. పరిస్థితులు తారుమారై అందరూ విధిగా కష్టపడి పనిచేసే పరిస్థితి రాకూడదని భావించబడుతోంది.

అందుకే పేదల పక్షాన సమానత్వం కోసం గొంతు విప్పే వేలాదిమంది ప్రజల్ని హత్య చేయడం జరుగుతోంది లేదా తప్పుడారోపణలతో జైళ్ళలో పడేయడం జరుగుతోంది.

కానీ అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలున్న చరిత్రకారుడూ, రచయితా, మేధావి రామచంద్రగుహని ఒక పోలీస్ స్టేషన్లో పెట్టి నక్సలైటని చంపడానికి సిద్ధపడ్డం జరిగింది. ఆయన వెంట్రుకవాసిలో తప్పించుకున్నాడు.

ఈ ఘటన 2007 జూన్ నెలలోది. దంతెవాడలో ప్రభుత్వం సల్వాజుడుంని మొదలుపెట్టింది. సల్వాజుడుం, పోలీసులు కలిసి ఆదివాసీల ఇళ్ళు తగలబెడుతున్నారు. ఆదివాసీ యువకుల్ని కాల్చి చంపుతున్నారు. యువతులపై ఊహించలేనన్ని ఘోరాలు చేస్తూ అత్యాచారాలు చేస్తున్నారు.

ఆ సమయంలో రామచంద్రగుహ, ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా॥ నందినీ సుందర్, ఇందిరాగాంధీకి సలహాదారుగా చేసిన విలేఖరి బి.జి. వర్గిస్, కేంద్ర శాసన సభా పూర్వ కార్యదర్శి ఇ.ఏ.ఎస్. శర్మ, ఫర్హానక్వీ ఇంకా జార్ఖండ్‌లోని ప్రముఖ పత్రిక ప్రభాత్‌ఖబర్ సంపాదకులు హరివంశ్ మొదలగువారున్న టీమ్ సల్వాజుడుం, ఆదివాసీల గురించి వివరాలు సేకరించడానికని దంతెవాడ రావడం జరిగింది.

వీరిలో కొద్దిమంది వేరే టీంగా ఏర్పడి దంతెవాడకి దాదాపు 60 కి.మీ. దూరంలో ఉన్న గ్రామానికి ఆదివాసీల్ని కలవడానికెళ్ళారు. విషయం పోలీసులకి తెల్సిపోయింది. ఇంకేముంది? న్యాయాన్ని రక్షించి, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన సాయుధ బలగాలు ప్రభుత్వ ఆజ్ఞానుసారం బయలుదేరాయి. టీం సభ్యులు ఒడ్డున వాహనాలుంచి నదిని దాటి గ్రామానికెళ్ళారు. భద్రతా దళాలు అక్కడున్న డ్రయివరు మెడ మీద కత్తిపెట్టి బెదిరించి ఎక్కడెక్కడికెళ్ళిందీ సమాచారం తెల్సుకున్నారు.

టీం సభ్యులు వెనక్కి రాగానే వారి వివరాలడిగి తిన్నగా వెళ్ళిపోడానికి అనుమతించారు కానీ దారిలోని భైరమ్‌ఘడ్ పోలీస్ స్టేషనుకి ఈ వార్త అందించారు.

ఈ టీం భైరమ్‌ఘడ్ చేరేసరికి సాయంత్రమైంది. వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు అందర్నీ స్టేషన్‌లోకి తీసుకెళ్ళారు. స్టేషనులో ఎస్.పి.వో. (స్పెషల్ పోలీస్ ఆఫీసర్) లదే రాజ్యం.

ఒక ఎస్‌పివో రామచంద్రగుహని చూసి వీడు మాకు తెలుసు, కచ్చితంగా ఇతడు నక్సలైటే! అన్నాడు. చత్తీస్‌ఘడ్‌లో సాక్ష్యాలకు కొదవేముంది? ఆనన్ ఫెనన్‌ను కూడా నక్సలైట్లతో వారి మీటింగుల్లో చూసినట్లు ముగ్గురు సాక్ష్యం చెప్పారు.

ఇంకేముంది? ఈ నా కొడుకుల్ని లేపేద్దాం రండని టీం సభ్యుల్లో రామచంద్రగుహని వోవైపు తీసుకెళ్ళారు. ఇంతలో సల్వాజుడుం ఎస్‌పివోలు నందినీ సుందర్ పర్సుని లాక్కున్నారు. కెమెరా కూడా గుంజుకున్నారు.

నందినీ కలెక్టరుకి ఫోన్ చేసారు. కలెక్టరు పోలీసు ఉన్నతాధికారికి చెప్తానన్నాడు. ఎస్.పి. ఫోన్ వచ్చింది కానీ స్టేషను పోలీస్ అధికారి ఆ ఫోన్ రిసీవ్ చేసుకోకుండా, స్టేషను మొత్తాన్ని ఎస్పివో, సల్వాజుడుంకి వదిలేసి గదిలోకి పోయి తలుపు బిగించుకున్నాడు.

నేను ఆరోజు రాయ్‌పూర్‌లో ఉన్నాను. నందినీగారు కవల్‌నార్ ఆశ్రమంలో నున్న నా భార్య వీణకి ఫోన్ చేసారు. వీణ నాకు ఫోన్‌చేసి నందినీ, ఆమె ఇతర స్నేహితులు ప్రమాదంలో ఉన్నారనీ, వెంటనే ఏదైనా చేయమని విషయం మొత్తం చెప్పిందామె. నేను ఖైరమ్‌ఘడ్ సల్వాజుడుం నాయకుడు అజయ్‌సింహకి వెంటనే ఫోన్ చేసాను. అప్పటికి మా సంస్థ బాగా బలంగా ఉండింది. పెద్ద సంఖ్యలో ఆదివాసులు మా కార్యకర్తలకి మద్దతుగా ఉండేవారు.

ఆ జనశక్తి వల్లనే మేము అంత సుదీర్ఘకాలం అక్కడ ఉండగలిగాం. రామచంద్ర గుహ తదితరులెవరికీ ఏమీ కాకూడదని నేను అజయ్‌సింహతో చెప్పాను. తర్వాతే ఆ బృందం ప్రాణాలతో బయటపడగలిగింది.

మీ ఫోన్ రావడంతోనే మమ్మల్ని విడిచిపెట్టేసారనీ నందినీ ఆశ్చర్యంతో నాకు చెప్పారు. మరుసటిరోజు రామచంద్రగుహ కూడా వనవాసి చేతన ఆశ్రమంలో కూర్చుని సల్వాజుడుం దుర్మార్గాలపై కోపంగా విరుచుకుపడ్డారు. నందినీగారి కెమేరా 6 నెలల తర్వాత కలెక్టరు తిరిగి ఇచ్చాడు.